# కథామంజరి

## పది కథల సమాహారం



ఫిబ్రవరి 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

**ఫిబ్రవరి 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 2



ఈ నెల సంచికకు చేయూతనిచ్చిన వారు,

**స్వర్గీయ చిర్రావూరి సర్వేశ్వరశర్మ, లలిత గార్ల**

జ్ఞాపకార్థం వారి కుమారుడు

**డా. చిర్రావూరి శ్యామ్ గారు, (యుఎస్ఏ),**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



## కథామంజరి
## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక సంక్రాంతి కథల పోటీలు - 2026

# విజేతలు



**చొప్పదండి సుధాకర్** గత 47 సంవత్సరాలుగా సాహిత్యరంగంలో కృషిచేస్తున్నారు. వందల్లో కథలు, కవితలు, సమీక్షలు, వ్యాసాలు వ్రాశారు.. వ్రాస్తున్నారు. సుధాకర్‌గారు స్వీయరచనలు .. ఒక కవిత సంపుటి, ఒక కథా సంపుటి "వెన్నెల కుప్పలు", ఒక నవల "జీవితం చేసిన సంతకం" వెలువరించారు. వీరి కవితలకి, కథలకి జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో చాలా బహుమతులు వచ్చాయి. సిద్దిపేట జిల్లాలోని అల్లీపూర్ గ్రామంలో పుట్టి, ఉపాధ్యాయునిగా అక్కడే 30 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ చేశారు.



**వెంకటమణి** విశాఖపట్నం అడవివరంలో నివాసం. అమ్మ పేరు మణి, నాన్న పేరు వెంకట్రావు. వారి ఇరువురి పేర్లను కలిపి, తన కలంపేరుగా పెట్టుకున్న జె.ఏం.వి. ఈశ్వరరావు గారు.. ప్రజాశక్తి జర్నలిజం కాలేజీలో జర్నలిజాన్ని అభ్యసించారు. చాలా సంవత్సరాలు "ప్రజాశక్తి" దినపత్రికలో ఉప సంపాదకుడిగా పనిచేశారు. అనంతరం 2008లో 'పార్టీరహిత రాజకీయం' అనే మాసపత్రికను పెట్టి ఏడేళ్లు నడిపారు. పార్టీరహిత ప్రజాస్వామ్యం కోసం కృషిచేస్తున్నారు. పార్టీరహిత ప్రజాస్వామ్యం ఆవశ్యకతను తెలియజేస్తూ అనేక రాజకీయ వ్యాసాలతో పాటు, ఇప్పటికి 50 కథల వరకు రాశారు. అవి అన్నీ వార, మాస పత్రికలలో ప్రచురితమయ్యాయి. వాటిలో చాలా కథలకు బహుమతులు, పురస్కారాలు కూడా లభించాయి. ఆ బహుమతి కథలతో 'అకాలం' కథా సంపుటి వెలువరించారు.



**సింహ ప్రసాద్** వీరి సాహిత్యప్రస్థానం 1973 లో ప్రారంభమైంది. ఇంతవరకు 570 కథలు, 76 నవలలు, 9 నాటకాలు రాశారు. వాటిలో 173 కథలకు, 24 నవలలకు, 9 నాటకాలకు, కొన్ని కవితలకు బహుమతులు పొందారు. ఇవేగాక వీరి.. వివాహ వేదం, తిరుమల దివ్య క్షేత్రం, శ్రీరాముడి ధర్మపథం గ్రంథాలకు ప్రముఖుల ప్రశంసలు పొందారు. 51 కథలు, 4 నవలలు, వివాహవేదం ఇతర భాషల్లోకి అనువదించబడినవి. అమృతలత జీవనసాఫల్య పురస్కారం, ఉషా పత్రికల లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఉగాది పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీపురస్కారంతో పాటు ఎన్నో అవార్డులు రివార్డులు అందుకున్నారు. పురస్కారాలు కూడా లభించాయి. ఆ బహుమతి కథలతో 'అకాలం' కథా సంపుటి వెలువరించారు.



**కొత్తపల్లి ఉదయబాబు** తెలుగు సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియల్లో కథలు, కవిత్వం, సాంఘిక నాటకాలు, వ్యాసాలు, గేయాలు, ఆధ్యాత్మిక వ్యాసాలు అందిస్తున్న వీరు విశ్రాంత ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు. అందమైన తీగకు, చిగురు పిట్టలు (నానీల సంపుటి), మాస్టారి కథానికలు, ఉదయకిరణాలు, అమ్మతనం సాక్షిగా (కవితా సంపుటి), నాన్నకో బహుమతి (కథల సంపుటి), పడమటి సూర్యోదయం (కథల సంపుటి), మనిషిని నమ్మితే ఏముందిరా? (ఉపాధ్యాయ పాత్ర ప్రధానంగా కథల సంపుటి) మొదలైన కథా కవిత సంపదతో పాటు, మూడు నాలుగు నవలలు, బాల కథలు, నాటికలు, వీరి కలం నుండి జాలువారాయి. వీరు మంచి నటులు కూడా! చాలా సాంఘిక నాటికల్లో, కొన్ని టెలీఫిల్మ్స్, చలనచిత్రాలలో నటించారు. వీరు కార్టూనిస్ట్, సమీక్షకులు కూడా. ఇవే కాకుండా తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా ఇతిహాసాలు, తెలుగు పద్యభావాలు, పాత సినిమా పాటలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. స్వస్థలం తాడేపల్లిగూడెం, ప్రస్తుత నివాసం సికింద్రాబాద్.

# కథామంజరి
## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక సంక్రాంతి కథల పోటీలు - 2026

# విజేతలు



**విజయార్కె** వీరు రచయితగా, జర్నలిస్ట్‌గా నలభై మూడేళ్ళ ఏళ్ల ప్రయాణం కొనసాగుతూనే ఉంది. ఏడు వందలకు పైగా కథలు వ్రాశారు. కామెడీ, రొమాన్స్, అడ్వెంచర్, క్రైమ్, డ్రామా, హారర్ అన్ని జోనర్స్‌లో రాయడం, ప్రొఫెషనల్ రైటర్‌గా సాగించిన అక్షర ప్రయాణం తెలుగులో అన్ని ప్రముఖ దిన, వార, మాస పత్రికల్లో వీరి రచనలు వచ్చాయి. నలభైకి పైగా నవలలు, యాభైకి పైగా వ్యక్తిత్వవికాస రచనలు.. తెలుగు, కన్నడ భాషల్లో వచ్చాయి. చాలా కథలకి, నాటకాలలో నటనకు వీరు బహుమతులు అందుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీపై రాసిన "నరేంద్ర మోదీ - ప్రైడ్ ఆఫ్ ఇండియా", అయిదుగురు ముఖ్యమంత్రులు.. కేసీఆర్ (ది లీడర్), జగన్మోహన్ రెడ్డి (విజయ యాత్ర), చంద్రబాబునాయుడు (స్వర్ణాంధ్ర విజేత), రేవంత్ రెడ్డి (ఒకే ఒక్కడు), రోశయ్య (ప్రజల హృదయాల్లో) పుస్తకాలు వ్రాసారు.

**డా. దారల విజయ కుమారి** విజయకుమారి గారు 'డాక్టరేట్ ఇన్ సైకాలజీ'. ప్రవృత్తి రచన వ్యాసాంగం. వీరి కథలు విరివిగా వివిధ పత్రికల్లో వస్తూనే ఉంటాయి. రెండు నవలలు వ్రాసారు. మొదటి నవల, "హేమంత తుషారం", రెండవ నవల "ఎ బర్డ్ ఇన్ ది హ్యాండ్". రెండూ బహుమతులు అందుకున్నావే! వీరు రచించిన కవితలతో 'వేచాను కలకై' కవితా సంపుటి వెలువరించారు. వీరి కథలు పలు కథా సంకలనాలలో చోటు చేసుకున్నాయి. ఆకాశవాణి ద్వారా వీరి రచనలు ప్రసారం కూడా అవుతున్నాయి. స్వస్థలం కర్నూలు, ప్రస్తుత నివాసం తిరుపతి.



**బోయిన భాస్కర్** ఈనాడు దిన పత్రికలో సికింద్రాబాద్ కంట్రిబ్యూటర్ (ఇంచార్జ్) గా చేస్తున్న వీరు, చిన్నతనం నుంచే కవితలు, కథలు వ్రాస్తున్నారు. మధ్యలో రచనలకు దూరం అయి, గత మూడేళ్లుగా మళ్ళీ కలం పట్టారు. వీరి కథలకు, కవితలకు పలు బహుమతులు వచ్చాయి. స్వస్థలం పాత కరీంనగర్, ప్రస్తుతం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం, పోతారం(ఎస్) గ్రామం, ప్రస్తుత నివాసం సికింద్రాబాద్.



**డా. చెళ్లపిళ్ల సూర్యలక్ష్మి** 2015లో తెలుగు భాషలో మొదలైన వీరి సాహితీప్రస్థానంలో ఎనభై కథలు, 'అపజయాలు కలిగిన చోటే...', 'మార్పు మన(సు)తోనే మొదలు' అనే రెండు నవలలు వ్రాశారు. సమాజానికి ఉన్నత విలువలుండే సాహిత్యాన్ని అందించడం కోసమే రచనలు చేస్తానని అంటున్న వీరి హాస్య కథలలో కూడా ఒక ఉన్నతమైన విలువ పొంచి ఉంటుంది. వీరి రచనలలో స్త్రీకి ఉన్నతమైన స్థానం, ప్రత్యేక వ్యక్తిత్వం ఉంటాయి. వీరి కథలు దాదాపు అన్నీ పత్రికలలో ప్రచురితమయ్యాయి. కొన్ని కథలు ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం ద్వారా ప్రసారమయ్యాయి. మూస రచనలను చేయడానికి ఇష్టపడరు. విభిన్న ఇతివృత్తాలు, విభిన్న కోణాల నుండి మానవ ప్రవర్తనని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ రచనలు చేసే వీరు, ఐ. ఆర్. ఎస్. అధికారిగా రైల్వేలో పని చేస్తున్నారు. నివాసం విశాఖపట్నం.

# కథామంజరి

## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక సంక్రాంతి కథల పోటీలు - 2026

# విజేతలు



**శ్రీమతి వాడపల్లి పూర్ణ కామేశ్వరి**

దక్షిణ రైల్వేలో ప్రైవేట్ సెక్రెటరీగా పదవీ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత నివాసం చెన్నై. పుట్టినది పిఠాపురంలో. హిందీనే మొదటి భాషగా ప్రాథమిక విద్య కొనసాగినందున తెలుగు భాషలో కొద్దిపాటి ప్రవేశమే కలిగింది. డిగ్రీ చదువుతుండగా రైల్వే సర్వీసు కమిషను ద్వారా సెలెక్టై, వృత్తి బాధ్యతలను చేపట్టి, ప్రైవేటుగా ఎమ్.కామ్. పూర్తి చేసారు. 2003 నుండి వీరి సాహితీ ప్రయాణం ప్రారంభమయ్యింది. ఆంగ్లంలో కూడా చిన్నా పెద్దా వ్యాసాలు, కథలు వ్రాయడం ప్రవృత్తి అయ్యింది. వుమెన్స్-వెబ్, పేరెంట్ సర్కిల్ వంటి అంతర్జాల బ్లాగుల్లో వ్యాసాలూ, కథలు (హిందీలో, ఆంగ్లములో) ప్రచురితమయ్యాయి. మాతృభాషలో వ్రాయాలనే ఆసక్తితో, 2020లో కథలు వ్రాయడానికి శ్రీకారం చుట్టారు. స్వల్ప-కాలంలోనే పాఠకులను మెప్పించే కథలను వ్రాశారు. మరో మెట్టు ఎక్కి నవలలు కూడా వ్రాస్తూ, వాటికి బహుమతులు కూడా సాధించారు. దాదాపు అన్ని పత్రికల్లో వీరి రచనలు ప్రచురితమయ్యాయి. చాలా రచనలకు బహుమతులు కూడా వచ్చాయి. పద్య రచన, గజల్ రచనలు కూడా వీరు అభ్యసించడం జరిగింది. ఇంత వరకూ వీరు రచించిన నూరు పైగా కథలు, కవితలు, వ్యాసాలు, గజళ్ళు, పద్యాలు ప్రచురితమయ్యాయి.



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ix |
| కథాపుస్తక పరిచయం | x |


## కథలు


| | | |
|---|---|---|
| అతనొక మార్గదర్శి! | కొత్తపల్లి ఉదయబాబు | 1 |
| జీవుగంజి | బోయిన భాస్కర్ | 8 |
| అమృతహస్తం | వాడపల్లి పూర్ణ కామేశ్వరి | 14 |
| నాంది | డా. చెల్లపిళ్ల సూర్యలక్ష్మి | 20 |
| ఆడుతూ... పాడుతూ | కె. లక్ష్మి శైలజ | 27 |
| లాగిన్ ... అవుట్ | డా. లక్ష్మి రాఘవ | 32 |
| చిన్నమ్మ ఎందుకు ఏడ్చింది? | మాచిరాజు కామేశ్వర రావు | 37 |
| నియంత్రణ! | బండారు మురళీమోహన్ రావు | 40 |
| ఆలస్యం | శ్రీ యర్రంశెట్టి శాయి | 42 |
| దాహం | కీ. శే. భమిడిపాటి జగన్నాథరావు | 51 |


Cover Page Credits : Shri PSN Murty



# కథాకీయం

ఎవరి నోట విన్నా.. ఇప్పుడు ఒకే ఆవేదన వినబడుతోంది. అదేమిటంటే.. సాంఘిక మాధ్యమాలు అందరికీ బాగా చేరువై, వారి మెదడంతా వాటితో నిండిపోయాయని! దీనికి కారణం ఒక్కటే. మారుతున్న కాలమాన పరిస్థితులలో పెరిగిపోయిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంత వరకూ ఉపయోగించుకోవాలనే దానికి హద్దులు చెరిపేసుకుని మనిషి తన ఉనికిని మర్చిపోతున్నాడు. ఇప్పుడు ఈ జాడ్యం భాష మీద పడింది. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని, ప్రజలు మాట్లాడుకునే వాడుకభాషలోకి తీసుకొచ్చి, పామరులకు సైతం సాహిత్య గుబాళింపులు అందేటట్టు చేసారు.. గిడుగు రామమూర్తి గారు! తరవాత కాలంలో పింగళిగారు తనదైన శైలిలో.. కొత్త పద సంపద సృష్టి కావాలని తనదైన శైలిలో పిలుపునిచ్చారు. తెలుగు పద్యం, వచనం, కవిత, గేయం, కథ.. ఇలా ప్రక్రియలన్నీ అక్షరం రానివారికి కూడా చేరువైంది. ముఖ్యంగా ఇవి వాడుక భాషలో ప్రజలకు మరింత చేరువై, వారిలో చాలా మార్పులు తీసుకొచ్చాయి. ఒక గేయం, ఒక కథ.. మనిషిలో ఆలోచనలు రేకెత్తించి, సంస్కారం కూడా నేర్పే స్థాయికి వచ్చాయి. అక్షరాస్యత కూడా చాలా పెరగడంతో, ఒకప్పుడు చాలా వెనుకబడిన ప్రాంతాల్లోని ప్రజలు కూడా చదువుకుని, పరిజ్ఞానం సాధించారంటే.. పరోక్షంగా వాడుకభాషా ప్రభావం ఉందనే చెప్పాలి. అలాగే సాహిత్యం మీద కూడా వాడుక భాష ప్రభావం ఉంది.

ఇప్పుడు వచ్చిన సమస్య ఏమిటంటే.. టీవీ, సాంఘిక మాధ్యమాల ప్రభావం ప్రజల మీద పడిన తర్వాత.. వాడుకభాషా పదాల ఉనికికి తెలియకుండానే ప్రమాదం ఏర్పడింది. పదాల అర్థాలను మార్చి ఉపయోగించే జాడ్యం టీవీ షోల ద్వారానే ఆరంభమయ్యింది. సున్నితంగా, సరళంగా ఉండే పదాలు, వాటి అర్థాలు పక్కన పెట్టి.. సొంతంగా కొన్ని పదాల అర్థాలు మార్చి వాడుతున్నారు. ఉదాహరణకు.. 'పాట బావుందని' చెప్పడానికి 'చించిసారు' అనే మాటను వాడి వాడి.. అదే సరియైన మాట అని పిల్లల మెదడుల్లోకి చొప్పించారు. ఇలా ఒకొక్క పదానికి అర్థాలు అటు ఆయా రచయితలు, ఇటు 'సెలిబ్రిటీలు' కూడా వాడుకలోకి తీసుకొచ్చేసారు. చివరికి కొన్ని పదాలకు అశ్లీలత అంటగట్టేసారు. దానికి తోడు 'మనోభావాలు'.. మాట్లాడుతున్నప్పుడు వాడే కొన్ని పదాల వలన మనోభావాలు దెబ్బతిన్నాయంటూ గొడవలు జరుగుతున్నాయి. ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్లు.. రచయితలు రచనలు చేస్తున్నప్పుడు.. ఏ పదం వాడితే ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని భయపడే రోజులు వచ్చేస్తున్నాయి.

ఇలా మన భాషా పద సంపదను అక్రమంగా వాడటం వలన తేట తెలుగు మరుగున పడుతుంది. ఇప్పటికే తెలుగు భాష మనుగడకు అడ్డంకులు పడుతున్నాయి. ఇటు ఈ ముప్పు నుంచి, అటు అక్రమ వాడుక నుంచి మన తేట తెనుగు భాషని మనమే రక్షించుకోవాలి. దీనికి ముఖ్యంగా.. టీవీ కార్యక్రమాలకు, సినిమాలకు మాటలు వ్రాసే రచయితలు, వాటి దర్శకులు.. భాషా పదసంపదని అక్రమ వాడుక చేయకుండా, అర్థాలు వారిష్టమొచ్చినట్లు మార్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే.. సెలిబ్రిటీలు కూడా తమ అభిమానుల్ని రంజింప చేయడానికి ఇష్టమొచ్చినట్లు భాషా ప్రయోగాలు చేయడం మానుకోవాలి.

మన భాషని రక్షించుకునే బాధ్యత ఒక్క రచయితలదే కాదు... తెలుగు మాట్లాడే ప్రతీవారిదని తెలుసుకోవాలి!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

శ్రీ యర్రంశెట్టి శాయి

మొన్నటి తరం తెలుగు హాస్యకథా రచయితలు అంటే.. అలనాటి మునిమాణిక్యం, మొక్కపాటి, చిలకమర్తి మొదలైన దిగ్గజాలు నుంచి నిన్నటి తరం ముళ్ళపూడి వెంకటరమణ వరకు తెలుగు హాస్య కథలు ఓ ఒరవడిలో నడిచాయి! వారి రచనలన్నీ అజరామరాలే! ఆ తర్వాత తరంలో తెలుగు హాస్యం మరో పొంతన సంతరించుకుంది. కాలానుగుణంగా మనిషి జీవనవిధానంలో వచ్చిన మార్పుల్లో చోటుచేసుకున్న హాస్యంతో రచనలు చేయడం ఆరంభించిన రచయితల్లో మొదట వరుసలో చెప్పుకోదగ్గ కథారచయిత శ్రీ యర్రంశెట్టి శాయి గారు. 1963 నుంచి కథలు వ్రాస్తున్న శాయి గారు, కథలు వ్రాయడం మొదలెట్టిన కొత్తలోనే హాస్యానికి కొత్త ఒరవడి తీసుకొచ్చి, తెలుగు హాస్యాన్ని తనదైన శైలిలో పండించారు. ఆ రోజుల్లో శాయి గారి కథలు దాదాపు అన్ని పత్రికల్లో ప్రతీ వారం కనబడేవి.

సమకాలీన కుటుంబ వ్యవస్థ, మధ్య తరగతి మందహాసాలు, ఆఫీసులలో కనబడే హాస్యం, కాలనీలలో జీవితాలు, ఇంటి చూట్టూ పండే హాస్యం.. ఇలా కంటికి కనబడే విషయాలను వస్తువులుగా తీసుకుని ఆరోగ్యవంతమైన హాస్య కథలు అందించారు. 'వారం వారం' శీర్షిక ప్రధానమైన కథాంశాలతో కథలు కూడా ఆ రోజుల్లోనే ఆరంభమయ్యాయి. హ్యూమరాలజీ శీర్షిక మీద శాయి గారి వ్రాసిన కథలు వేటికి అవే సాటి అని చెప్పాలి. అపార్ట్‌మెంటాలజీ, అవస్థల పురం, నిర్భయ్ నగర్.. అంటూ కొత్త కొత్త పదాలను వెలుగులోకి తీసుకొచ్చి హాస్యాన్ని పండించిన శాయి గారి హ్యూమరాలజీకి ముందు మాటలో కూడా నిర్భయత కనబడుతుంది. "ఈ కథలూ, సంఘటనలూ అన్నీ పచ్చి నిజాలు, ఏవీ కల్పితాలు కాదు. ఇవన్నీ తెలుగు ప్రజలను ఉద్దేశించి రాసినవే. ఒకవేళ ఏ కథైనా, సంఘటనైనా, పాత్రైనా మన దేశంలోని జీవితాలను పోలి ఉండకపోయినట్లయితే అది కేవలం కాకతాళీయం... అంటూ నిక్కచ్చిగా కథలు వ్రాసారు. శాయి గారి కథల్లో హాస్యాన్ని, వ్యంగ్యాన్ని నూరు శాతం పండించిన కథల్లో కూడా ఓ సందేశమో, ఓ సెంటిమెంటో తప్పకుండా ఉంటుంది. తన కళ్ళకి కనబడిన మంచినో చెడునో కథావస్తువుగా తీసుకుని సెటైరికల్‌గా కథలని వ్రాయడంలో శాయిగారు ఓ మంచి ఒరవడిని నిర్మించారు. అంతేకాదు.. శాయి గారి హాస్య కథలు పాఠకుడిని నవ్వించి కళ్ళంట నీళ్ళు ఎలా తెప్పిస్తాయో.. సెంటిమెంట్‌తో కూడిన కథలు కూడా పాఠకుడి గుండెని తడి చేసి కంటనీరు తెప్పిస్తాయి. శాయి గారు కథలకు పేర్లు పెట్టడంలో కూడా ఓ చమత్కారం కనబడుతుంది. 'అపూర్వ ప్రేమాశ్రమం అను పాపపు కథ, అసలు సంగతి చెప్పరా జ్యోతిష్యా, ఇవి పుకార్ల రోజులనీ, ఉత్తమ సాహిత్యం జిందాబాద్.. ఇలా కథల శీర్షికల్లో కూడా ప్రత్యేకత శాయి గారిది! ఆ పేరు చూడగానే కథ చదవాలనిపిస్తుంది. ఇంకో విశేషం ఏమిటంటే.. ప్రఖ్యాత కథకుడు, నవలా రచయిత, తెలుగు నవలా రచనలలో ఓ కొత్త శకానికి నాంది పలికిన రచయిత శ్రీ యండమూరి వీరేంద్రనాథ్‌గారు.. సమకాలికుడైన శ్రీ యర్రంశెట్టి శాయి గారితో కలిసి ఓ కథ రాసారు. ఆ కథ పేరు "కొంగుచాటు కృష్ణుడు"

ఇలా ఎన్నో ప్రత్యేకతలతో, ఆరు వందల పైచిలుకు కథలూ, ముప్పైకి పైగా నవలలూ వ్రాసిన శ్రీ యర్రంశెట్టి శాయి గారు బందరులో పుట్టి పెరిగారు. హైదరాబాద్లో రైల్వేలో పనిచేసి, అక్కడే స్థిరనివాసంలో ఉన్నారు. వర్తమానంలో కథలు,

## విశిష్ట అతిథి

పుస్తకాలు ఎవరు చదవడం లేదని వాపోయే శాయి గారు, కలం కదిలి చాలా కాలమైంది. ఫేస్‌బుక్‌లో రాజకీయ సెటైర్‌లు మాత్రమే వ్రాస్తున్న శాయి గారు, మళ్ళీ కలం పట్టుకుని కథలు వ్రాస్తే చదివే పాఠకులు చాలామందే ఉన్నారు. తప్పకుండా వ్రాస్తారని కథామంజరి కూడా ఎదురుచూస్తూ.. అడగగానే మా అభ్యర్థనను మన్నించి, ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. భమిడిపాటి జగన్నాథరావు

కొందరి ఇంటిపేరు చూడగానే.. వీరు కూడా తప్పకుండా తెలుగు సాహితీవేత్తలనే గట్టి నమ్మకం వచ్చేస్తుంది. కారణం.. ఆ ఇంటిపేరుతో గతంలో గొప్ప రచయితలను చూడటం.. లేదా సాహిత్యరంగంలో వారి పేరు ప్రఖ్యాతులు వినడం, వారి రచనలు చదివి వారి పేరు మదిలో నాటుకు పోవడం.. ఇలా ఆ ఇంటిపేరుకి ఓ గుర్తింపు వస్తుంది. భమిడిపాటి పేరు వినగానే.. తెలుగువారికి జ్ఞాపకం వచ్చేది భమిడిపాటి కామేశ్వరరావు గారూ, తర్వాత తరానికి చెందిన భమిడిపాటి రాధాకృష్ణ గారూ. ఆ తర్వాత తరంలో జ్ఞాపకానికి వచ్చేది 'భరాగో' అనబడే భమిడిపాటి రామగోపాలం గారు. వీరి తరానికి చెందిన మరో గొప్ప రచయిత కీ.శే. భమిడిపాటి జగన్నాథరావు గారు. ప్రగతిశీల కథారచయితగా అటు అభ్యుదయవాదుల దగ్గర, ఇటు మధ్యతరగతి జీవితాలను కాచి వడబోసే కథారచయితగా సాధారణ పాఠకుల దగ్గర మంచి గుర్తింపు పొందారు.

1934 డిసెంబరు ఒకటో తారీఖున కృష్ణా జిల్లా గుడివాడలో జన్మించిన జగన్నాథరావు గారు, కాలేజీ విద్యాభ్యాసం ముగించి, నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీ.జీ. చేసారు. డిల్లీలో తెలుగు సమాచార, పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్‌గా, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా, సర్వీసు చివర్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ప్రెస్ సెక్రటరీగా చేసి రిటైర్ అయ్యారు. ఉద్యోగంలో ఎన్ని ఒత్తిడులున్నా, తలమునకలైన పనుల్లో ఉన్నా.. కథలు చదవడం, వర్ధమాన రచనల పోకడలు గమనించడం చేస్తూ ఉండేవారు. వారు సంఖ్యాపరంగా తక్కువ కథలు వ్రాసినా, రాసినవన్నీ ఆణిముత్యాలే!

దాదాపు ఆ రోజుల్లో వచ్చే వార, మాస పత్రికలన్నింటిలోనూ వీరి కథలు ప్రచురితమయ్యాయి. మధ్యతరగతి కుటుంబాల జీవిత ఇతివృత్తాలనే ప్రధానంగా కథావస్తువుగా తీసుకుని కథలు వ్రాసారు. కథావస్తువుతో పాటు, సమస్యలను లోతుగా పరిశీలించి, పరిశోధన చేసి రచనలు వ్రాసేవారు. మంచి వర్ణన, పాత్రల చిత్రీకరణలో సహజత్వం, విలువల పట్ల శ్రద్ధ, మంచి చెడులు.. జగన్నాథరావుగారి కథల్లో కనబడతాయి. అలాగే.. ఆయన కథలు మనిషి సంస్కారాన్ని, సంస్కృతిని చూపడమే కాకుండా.. అవి సమాజంలో మంచిని పెంచడానికి దోహదపడే విధంగా ఉంటాయి. సమాజంలో మార్పులను నిశితంగా పరిశీలిస్తూ.. వాటిని తన కథల ద్వారా పాఠకులకు అందించి వారిని ప్రగతిపథం వైపు నడిపించడానికి ప్రయత్నించేవారు. విప్లవసాహిత్యాన్ని ఇష్టపడే జగన్నాథరావుగారు ఇరవై ఏళ్ళ ప్రాయం నుంచే కథలు వ్రాయడం మొదలెట్టారు.

అప్పట్లో ఆయన వ్రాసిన "అడుగుజాడలు, సముద్రం, అపరంజి పంజరం, జీవనరాగం, పాపం దీక్షితులు, భావి పౌరులు, లౌక్యుడు, వరహీనం" వంటి కథలు ఈనాటి పాఠకుల్ని కూడా ప్రభావితం చేస్తాయి. జగన్నాథరావుగారు మంచి స్థాయిలో ఉద్యోగం చేసే రోజుల్లో గాని, మంచి రచయితగా గుర్తింపు పొందిన రోజుల్లో గాని.. ఆయన చాలా నిరాడంబరంగా

ఉండేవారు. తన కంటే వయసులో చిన్న వారిని కూడా ఎంతో గౌరవంగా చూసేవారు. తెలుగు కథకి స్వర్ణయుగంగా చెప్పుకోదగ్గ రోజుల్లో మంచి వాసి గల కథలు వ్రాసినా.. మిగతా రచయితలకు దక్కిన గౌరవం, జగన్నాథరావు గారికి లభించలేదనిపిస్తుంది. ఆయన కోరుకోలేదు కూడా!

తెలుగు కథా చరిత్రలో మంచి కథలు రాసిన కథారచయితగా కథాప్రియుల హృదయాల్లో నిలిచిపోయిన భమిడిపాటి జగన్నాథరావుగారు, 2023 ఫిబ్రవరి ఆరవ తేదిన తుదిశ్వాస విడిచారు. ఆయన తెలుగు కథాసాహిత్యానికి అందించిన సేవల్ని తలుచుకుంటూ, ఆయనకి ఘనమైన నివాళి తెలుపుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా పరిచయం

## శ్రీమతి గంటి భానుమతిగారి రెండు కథలు

మొన్నీమధ్య హైదరాబాదులో జరిగిన బుక్ ఎక్జిబిషన్‌కి వెళ్ళినప్పుడు నాకు మొట్టమొదటగా తారసపడిన పుస్తకం.. రచయిత్రి గంటి భానుమతిగారి "జలతారు కలలు" కథల సంపుటి. ఈ పుస్తకం 2023 లో ప్రచురించిన కథల సంపుటి. ఆవిడ ఇంతవరకు 11 కథల సంపుటాలు, 15 నవలలు, ఒక వ్యాస సంపుటి ప్రచురించిన మంచి పేరున్న రచయిత్రి. ఆవిడ రాసిన కథలు 'జీవన పోరాటం', 'అమ్మకో ఉత్తరం', 'సాగర మథనం', 'తప్పటడుగు', 'అంతర్మథనం' ఎంతో ప్రాచుర్యం పొందాయి.

అయితే 'జలతారు కలలు' కథాసంపుటిలో 'ఎదురుచూసిన క్షణాలు', 'ఈ అబ్బాయికి ఏం కావాలి?' అన్న రెండు కథలు నాకు ఒకటికి రెండుసార్లు చదవాలనిపించాయి. మొదటి కథ ఒక ఏడో తరగతి చదివే పిల్ల ఒక రిటైర్ అయిపోయి కళ్ళు సరిగ్గా కనిపించని తాతతో కలిగిన పరిచయం, కలిసి ప్రయాణించిన మూడు నెలలూ ఒకరికొకరు కల్పించిన బ్రతుకుదారులూ, చివరికి ఎన్నేళ్ళ తరవాతో ఒకరినొకరు కలుసుకోవాలనుకుంటూ ఎదురుబడిన రోజు కలియలేకపోవడంతో కథ ముగుస్తుంది. ఇక రెండో కథలో మానసికంగా, శారీరకంగా హింసించబడిన పిల్లాడిని తెచ్చుకుని పెంచుకునే ప్రయాణంలో ఆ పెంచుకున్న తల్లి ఏం చెయ్యాలి అన్న నేపథ్యంలో పాఠకులకు సున్నితంగా, మనసులకు హత్తుకునేలా చెప్తారు రచయిత్రి. రెండు కథలూ ఉత్తమ పురుషలోనే నడుస్తాయి.

మొదటి కథ రెండు జీవితాల చుట్టూ పరిభ్రమిస్తుంది. ఆసుపత్రిలో ఉన్న అత్తగారిని చూసి తిరిగి వస్తూ అక్కడ లాబీలో గోడకి పెట్టిన ప్రత్యేకమైన పెయింటింగ్‌లను చూసి ఉలిక్కిపడి, అవి తనకు ఎంతో పరిచయమున్నవే అని గ్రహించడానికి ఎక్కువసేపు పట్టదు ఆమెకు. వాటిని వేసిన 'తాత'కు అక్కడి ఆడిటోరియంలోనే అప్పుడే సన్మానం జరుగుతోందని తెలిసి అక్కడికి వెళుతుంది. ఎన్నేళ్ళ నుంచో తను కలియడానికి ఎదురుచూస్తున్న తాత ఎదురుగా కనిపించాడు. ఆడియన్స్‌లో తను కూడా కూర్చొంటుంది. వెనకాల ఉన్న ప్లెక్సీలో కనిపిస్తున్న చిత్రాలలో చాలా తనకు పరిచయమైనవే. కనుచూపు పోయే వరకూ తనలో ఉన్న చిత్రకళను గుర్తించని ఒక ప్రత్యేక కళాకారుడని తాతని పరిచయం చేసారెవరో. తాత మాట్లాడడం మొదలు పెట్టాడు. ఈ రోజు తను ఆర్టిస్ట్‌గా నిలబడడానికి పన్నెండేళ్ల ఒక అమ్మాయి కారణమని, ఆమే తన జీవితానికి ఒక దారి చూపిందని చెప్తాడు. తన అరవైమూడో ఏట ఒకరోజు అనుకోకుండా తన కళ్ళు కనిపించడం లేదని గుర్తించాడు. ఆ సమయంలో తన భార్య కూడా దగ్గర లేదు. తన పాత జ్ఞాపకాలను గ్రంథస్థం చేయాలనుకుని, ఒక పార్ట్ టైమ్ సెక్రెటరీ కోసం వేసిన ప్రకటనకు స్పందించి వచ్చింది ఒక పన్నెండేళ్ల అమ్మాయి. ఎంతో మృదువైన కంఠం ఆమెది. మొదట్లో తప్పులు చదివినా, తనకు చదువుకోవడానికి డబ్బులు అవసరమని, కష్టపడైనా నేర్చుకుని చదవగలనని,

రాయగలనని చెప్తుంది. ఆమెను బుజ్జీ అని పిలిచేవాడు. తనను ఆమె తాతా అని పిలిచేది. తను రాద్దామనుకుని డిక్టేట్ చేసింది తనకే నచ్చక పోవడంతో ఆ ప్రయత్నం ఆపేద్దామనుకుంటాడు. బుజ్జి రోజూ లైబ్రరీకెళ్ళి పుస్తకాలు తెచ్చేది, కొత్త విషయాల కోసం! చదివి వినిపించేది. అనుకోకుండా ఓ రోజు బుజ్జి ఇంకా రాలేదు. ఏదో ఆలోచిస్తూ, గోరుతో ఒక రైజ్డ్ బొమ్మ గీశాడు. ఆరోజు బుజ్జి చూసి, అంత మంచి బొమ్మ వేసిన తాతను అభినందించింది. అప్పటి నుంచి రోజూ కొత్త కొత్త బొమ్మల్ని గీయించేది. ఆ బొమ్మలకు తను రంగులు వేయడం నేర్చుకున్నాడు.

అయితే ఒక రోజు భార్య వెనక్కి తిరిగి వచ్చింది. బుజ్జిని అవమానించి, అనుమానించి తరిమేసింది. ఆ తరవాత మళ్ళీ చూడలేదు బుజ్జిని. ఈ రోజు తన చిత్రాలు ఇంత ప్రాముఖ్యానికి వచ్చాయంటే కారణం బుజ్జే. తన దగ్గర డబ్బులేకపోవడంతో, ఆమె వెళ్ళేటప్పుడు తను ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వలేదు.

బుజ్జి ఏడో క్లాసు కూడా చదవలేదు. పెళ్ళైన తరవాత అత్తవారు చదివించారు పదో క్లాసు వరకు. తాత నేర్పిన తెలుగు భాష తనకు ఒక డీటిపి పనిలో చేరేట్టు చేసింది. ఆ తరువాత తనకు తాత బలవంతాన బోధించిన భాష స్పష్టత.. సినిమాలకి, టివి సీరియల్స్‌కి ఒక డబ్బింగు ఆర్టిస్టుగా అయి, జీవితం సుఖవంతం చేసుకోవడానికి పనికి వచ్చింది.

ఇప్పుడు తాత మాటలు వింటోంది. వెళ్ళి కలిస్తే? తనను అనుమానించిన తాత భార్య అక్కడే ఉండి ఉంటుంది. 'తాతా! దేవుడు తన చేత్తో రాసిన చందమామ కథలాగా.. నీ జీవితానికి ముగింపు దొరికిందని నువ్వు అన్నావు. అలాగే ఆ దేవుడే నాక్కూడా, నా జీవితానికి కూడా చందమామ కథలో లాంటి ముగింపు ఇచ్చాడు' అనుకుని, అక్కడ నుంచి వచ్చేసింది బుజ్జి.

గంటి భానుమతిగారి కథల్లో తిరిగి తిరిగి వచ్చే థీమ్ స్త్రీ సాధారణంగా కష్టాలకు లోనవుతుంది, అయితే, ఆ కష్టాలను అధిగమించగలిగే శక్తి కూడా ఆ స్త్రీలోనే ఉంటుందని చెప్పడం జరుగుతుంది. ఆవిడ కనబడని స్త్రీవాద రచయిత్రి. 'ఎదురుచూసిన క్షణాలు' కథలో తినడానికి, ఏడో తరగతి చదువుకోవడానికి కూడా వీలులేని ఆడపిల్లల్లో కూడా తెలివితేటలకు తక్కువుండదని, ఆ సూక్ష్మమైన తెలివిని ఉపయోగించుకోగలగడం, అవతలి మనిషిలో వున్న సృజనాత్మకను బయటకు తీయగలగడం, తన జీవితాన్ని బాగుచేసుకోవడం జరగవచ్చని చెప్పడం ఆమె లక్ష్యం.

ఇక రెండో కథలో ఒక తల్లి ఒక అబ్బాయిని పెంచుకుందామనుకుంటుంది ఇద్దరాడపిల్లల తరవాత. అడాప్షన్ సెంటర్ వాళ్ళు చూపించిన అబ్బాయిని లీగల్ పేపర్లు సంతకం పెట్టి తీసుకొచ్చింది. ఆ అబ్బాయి పేరు మున్నా. తల్లి, తండ్రి ఇద్దరూ డ్రగ్ ఎడిక్ట్‌లు. తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. తమ శృంగారానికి అడ్డొస్తున్నాడని సవతి తల్లి కొట్టేది, వాతలు పెట్టేది. ఒకసారి రెక్కపట్టుకు లాగడంతో భుజం ఎముక విరిగింది. పోలీసులు ఆ అబ్బాయిని అనాథాశ్రమంలో పెట్టారు. అక్కడ నుంచి అడాప్షన్ సెంటర్‌కి తీసుకొచ్చారు. ఒక జంట తీసుకెళ్ళారు పెంచుకోడానికి! ఆ అబ్బాయిని సాకడం చేతకాక తిరిగి తీసుకొచ్చారు. ఇంకో జంట కూడా సాగలేక పోయారు. ఇప్పుడు ఈమె తీసుకెళ్లింది.

తీసుకెడుతున్నప్పుడు ఆ అబ్బాయి చూపిన నిర్లిప్తత, 'ఓ, ఇంకో అమ్మవా' అన్న నిర్లక్ష్యభావన, ఆశ్చర్యపరిచాయామెను. వాడికి బాధలేదు.. తెలియని చోటుకు వెళ్తున్నానని! ఏదో జీవంలేని నవ్వు. మొదటి రోజునే పక్క తడిపాడు. "కొడతావా?" అంటూ చూసాడామెను. ఆ చూపులో భయం లేదు. తను కొట్టనని చెప్పి, కొన్నిరోజుల్లోనే ఆ పని మానిపిస్తుంది. పాత

మమ్మీ కొట్టేదిట. అయినా వాడు ఏడవలేదట. ఎడిస్తే మళ్ళీ కొడతారు కాబట్టి, ఏడవకుండా ఉండడం నేర్చుకున్నాడు. ఓ రోజు పిల్లలు స్కూలుకెళ్ళిన తరవాత మున్నా అలికిడి లేదు. ఎక్కడున్నాడా అని చూస్తే, వంటింట్లో కూరలు తరిగే కత్తి మొనని కడుపుకు ఆనించుకుని కనబడ్డాడు. కోప్పడి దగ్గరకు తీసుకుంది. ఎందుకు అలా చేశావంటే, "కత్తినలా పొట్టలో గుచ్చుకుంటే స్వర్గానికెళ్తారట గదా, అక్కడ దెబ్బలూ తిట్లూ ఉండవట కదా, అందుకే అక్కడికి వెళ్తే ఎలా ఉంటుందా అని చూస్తున్నా!" అన్నాడు.

ఈ దీనస్థితి నుంచి ఈ అబ్బాయిని మార్చగలమా అన్న అనుమానం పట్టుకుంది. న్యూరో సైకాలజిస్టుకు చూపించారు. పిల్లలు తాము పెద్దల నుండి కోరుకునే సెక్యూరిటీ దొరకనప్పుడు, అయోమయ స్థితిలోకి వెళతారని, ఆ పిల్లవాడు మామూలుగా అవాలంటే ఆ అబ్బాయి తనివితీరా ఏడవాలని, ఆ బాధ పైకి వచ్చినప్పుడు ఆ అబ్బాయిలో మార్పు కనిపిస్తుందని చెప్తాడు.

అలా అవాలంటే, తనొక నాటకం ఆడక తప్పదు. ఓ రోజు ఆడుకొందామని చెప్తుంది, తనను చిన్నప్పుడు అందరూ బాగా తిట్టేవారని, కొట్టేవారని, తను రోజూ ఏడ్చేదని చెప్తుంది. ఆ ఆట తను ఆడనంటాడు మున్నా. సరే తనేమనుకుంటున్నాడో బయటకు వద్దు, చెవిలో చెప్పమంటుంది. ఆమె మెడ దగ్గరకొచ్చి చెప్పాడు. ఆకలేసినప్పుడు, తనంటే ఇష్టంలేదని ఇంట్లోంచి బయటకు తోసేసినప్పుడు, రాత్రంతా బయట చలిలో నిలబడినప్పుడు, ఏడ్చానని చెబుతూ నవ్వుతూ పోబోయాడు. తిరిగి తనే, వాడెక్కడెక్కడ బాధపడిందీ, ఏడిచిందీ, చెప్పింది. తను వాడినలా చూడననీ, వాడిని కొట్టననీ, తను వాడినెప్పుడూ వదలననీ చెప్పి గట్టిగా ఆ చిన్నవాడిని గుండెలకదుముకుంటుంది. అంతే, తననెవరూ అంత దగ్గరగా ఎప్పుడూ తీసుకోలేదంటూ, ఒక్కసారిగా ఏడవడం మొదలుపెట్టాడు. 'అనేక గ్రీష్మాల వర్షం. ఆ రెప్పల చివర్ల సప్తరంగుల ఇంద్రధనుస్సులు, అద్భుతమైన ఈ ఆనందం బుద్బుదం కాకూడదు.' అనుకుందామె.

ఈ కథలో మనిషికి, ముఖ్యంగా పిల్లలకి ప్రేమ ఎంత అవసరమన్నది చెప్పడం రచయిత్రి లక్ష్యం. సమాజంలో కొందరు చిన్నతనంలోనే అనుభవించే క్రూరత్వం, హింస ఎక్కడ నుంచి మొదలవుతుంది? ఎందుకుంది? దానికి పిల్లలు ఎలా బలి అవుతారు? అసహజంగా మారిన ఆ పిల్లల ప్రవర్తనను మార్చవచ్చా? మార్చగల్గితే ఎలా మార్చాలి? ఆ పిల్లలలో ప్రేమరాహిత్యపు స్థితి కలిగించే మానసిక వికృతాలను, ప్రేమతోనే జయించి తిరిగి పిల్లలకు కోల్పోయిన బాల్యాన్ని ఇవ్వవచ్చని రచయిత్రి ఈ కథ ద్వారా చూపిన బాట ఇది!

***పరుచయకర్త : శాయి రాచకొండ, హ్యూస్టన్***




# వినదగునెవ్వరు చెప్పిన..

కథామంజరి సర్వాంగసుందరంగా ఉంది. బహుమతి కథలు ఒకదాని మించి మరొకటి అన్న చందాన ఆసక్తిగా చదివించి బహుమతికి అర్హంగా ఉండి చాలా బాగున్నాయి. అన్ని కథల్లో కథనం శైలి ఆకట్టుకున్నాయి. “పులిన్యాయం” కథ హృదయాలను కదిలించేదిగా ఉంది. డాన్సులు వేసి చివరకు తోడేళ్ల గుంపు నుంచి తప్పించుకుంది అనుకుంటే.. పులి నోట చిక్కడం దయనీయంగా ఉంది. మాకో న్యాయం.. అన్నీ విప్పిన సినిమా హీరోయిన్లకీ ఒక న్యాయమా? అని అడిగిన తీరు బావుంది. రచయితకు అభినందనలు .

***జి యన్ వి సత్యనారాయణ, హైదరాబాద్***



# కథాపుస్తక పరిచయం




## చిత్ర కథా సమాహారం


గత పదేళ్లలో వందకు పైగా కథలు వ్రాసిన కథారచయిత, చిత్రకారులు శ్రీ రామ్మోహన్ రావు గారి 20 కథల సమాహారం. ఈ కథలకి బొమ్మలు కూడా ఆయన కుంచె నుంచి జారువాలినవే! నవంబర్ 2025 లో విడుదలైన రూ. 200 వెల గల ఈ కథల సంపుటి కోసం ..

శ్రీ కె. రామ్మోహన్ రావు,
3-6-22, నరసింగరావు పేట,
**అనకాపల్లి – 531 001**
✆ 9849345060

## వరి కంకులు

మానవ సంబంధాల్లోని జీవన విలువల్ని, జీవిత సత్యాన్ని వివరించే 12 కథల సంపుటి. డిసెంబర్ 2025 లో విడుదలైన రూ. 150 వెల గల ఈ సంపుటి కోసం..

పెమ్మరాజు విజయరామచంద్ర,
ఫ్లాట్ నెం. 504, బ్లాక్ 12,
హెచ్ ఐ జి, హిల్ టాప్, చిత్రపురి హిల్స్,
**హైదరాబాద్ – 500 104**
✆ 98497 44161






# అతనొక మార్గదర్శి!

కొత్తపల్లి ఉదయబాబు
✆ 9533756075

> *"నేనిపుడు డ్యూటీ దిగి ఇంటికి వెళ్తానా... వేడినీళ్లు సిద్ధం చేసి ఉంచుతుంది నా గంగ! స్నానమాడిన వెంటనే వేడి వేడి అన్నంలో నాకిష్టమైన పదార్థాలు తినడానికి సిద్ధంగా ఉంటాయి. ఇల్లు అందమైన తోటలా ఆహ్లాదంగా ఉంటుంది. ఆమెకు ఇష్టమైననాడు పక్క విరిసిన తెల్ల తామరపువ్వులా ఉంటుంది. తనకి ఓపిక లేనినాడు నేను ఇబ్బంది పెట్టను. ఇంతకన్నా అదృష్టం ఏ మగవాడికి ఉంటుంది సర్?"*

స్టేషన్లో రైలు దిగాను.

"ఆటో కావాలా బాబు?" ఇద్దరు ఆటో వాళ్ళు అడిగారు.

"అవసరం లేదు. ఇల్లు దగ్గరే!"

నేను మరో వంద అడుగులు నడిచాను. అక్కడ ఒక రిక్షాతాత చుట్ట కాల్చుకుంటూ కూర్చున్నాడు. నన్ను చూస్తూనే లేచి నిలబడ్డాడు.

"వస్తావా తాతా?" అప్రయత్నంగా నా నోటివెంట వచ్చేసాయి ఆ మాటలు. ఆటో వద్దన్నాను కదా! ఇదేమిటి? రిక్షా అతన్ని ఇలా అడిగేసాను అనుకున్నాను.

"ఎక్కడికి వెళ్లాలి బాబు?" ఒక్కసారి ఫోన్ ఆన్ చేసి లొకేషన్ చూసుకున్నాను.

"హౌసింగ్ బోర్డ్ కాలనీ... రోడ్ ఎనిమిది" అని చెప్పాను.

"నా ఇల్లు ఆ కాలనీ చివరే బాబూ. ఈ ఒక్క బేరం చూసుకుని ఇంటికి వెళ్ళిపోదామనుకున్నాను. ఎక్కండి బాబూ." అన్నాడతను.

రిక్షా ఎక్కిన తర్వాత తాతని అడిగాను. "నీ పేరు?"

"రావణవర్మ బాబు." అన్నాడు నెమ్మదిగా తొక్కడం ప్రారంభిస్తూ.

"ఆశ్చర్యంగా ఉందే! రిక్షా తొక్కే అతనికి ఇలాంటి పేరు ఉండడం ఇప్పుడే వింటున్నాను."

“నాకు జ్ఞానం వచ్చాక మా నాయన చెప్పిన మొదటి మాట ఇలా చెప్పాడయ్యా! ’పెద్దయ్యాక నువ్వు రాములోరు అంతటోడివి కాకపోవచ్చురా... కనీసం రావణాసురుడంతటివాడు అవ్వరా’ అని! ‘అదేంటయ్యా’ అని అడిగినా! దానికి మా అయ్య ’రాముడు 16 సద్గుణాలు కలవాడు. ఆయన అవతార పురుషుడు! రావణుడిలోని చెడుగుణాన్ని చంపడానికి ఈ భూమిమీద పుట్టినోడు. కానీ రావణుడు రాజనీతిలో చాలా గొప్పోడురా! లంకలో తన ప్రజలందరినీ ఎంతో గొప్పగా పాలించినవాడు. రోజులు వేగంగా మారిపోతున్న మనదేశంలో... నువ్వు రాములోరిలా ఉంటే బ్రతకలేవురా! నీ బ్రతుకు నువ్వు బతుకుతూ, రావణుడి రాజనీతిని పాటిస్తూ, నిన్ను నమ్ముకుని నీమీద ఆధారపడిన పదిమందిని బతికిస్తూ... నీ కష్టాన్ని నమ్ముకుని, మంచి పేరు తెచ్చుకుని, సమయానుకూలంగా ప్రవర్తిస్తూ, హాయిగా బ్రతకరా! నువ్వు లక్షలు సంపాదించక్కర్లేదు, మేడలు



మిద్దెలు కట్టక్కర్లేదు. ఉండడానికి గూడు, తినడానికి తిండి, కట్టుకోవడానికి నచ్చిన బట్ట, ఈ మూడేరా మనిషి సంతృప్తిగా బతకడానికి కావాల్సింది! అంతకన్నా ఆశలు పెంచుకుంటే జీవితంలో సుఖపడవురా' అని చెప్పాడయ్యా! ఆనాటి నుంచి ఈనాటికీ... అదే మాట మీద బతుకుతున్నానయ్యా." అన్న అతని మాటలు విని నివ్వెరపోయాను.

"అది సరే, ఆటో వాళ్ళు నన్ను 'ఆటో కావాలా' అని అడిగారు. నన్ను చూసి కూడా నువ్వు 'రిక్షా కావాలా బాబు?' అని అడగలేదు... ఎందుకని?" ఉత్సాహంగా అడిగాను ముందుకు వంగి.

"వాళ్లు జీవితం మీద ఎంతో ఆశతో బతుకుతున్నవాళ్ళు బాబు! అలా కష్టపడకపోతే వాళ్ళ ఆడవాళ్లు, వాళ్ళ పిల్లలు వాళ్ళని బతకనివ్వరు. అర్ధరాత్రి దాటినా సరే వాళ్లు ఆరోజు అనుకున్న డబ్బు సంపాదించగలిగితేనే బ్రతకగలరు. నాకు ఆ అవసరం లేదు బాబు! అయినా రిక్షా కావలిస్తే... మీరే అడుగుతారు కదా బాబు! ఎందుకంటే ఈ ఊర్లో ఉన్న రిక్షావాణ్ణి నేనొక్కడినే బాబు. అదే నా లాజిక్!"

"లాజిక్కా... నీకు ఇంగ్లీష్ కూడా వచ్చా?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"మా నాన్న, నన్ను బికామ్ చదివించాడు బాబు. అమ్మ నా చిన్నప్పుడే చచ్చిపోయింది. ఇద్దరు చెల్లెళ్లు... వాళ్ళు ఇంటర్ చదువుతూ ఉండగా నాన్న చచ్చిపోయాడు బాబు! ఒక కంపెనీలో అకౌంట్స్ రాయడానికి గుమస్తాగా చేరాను. వాళ్లు చేసే గొప్ప వ్యాపారాలలో ప్రభుత్వానికి న్యాయంగా చెందాల్సిన డబ్బు విషయంలో దొంగ లెక్కలు రాయమని నన్ను నిర్బంధించారు. నిర్మొహమాటంగా రాయనని చెప్పి ఉద్యోగం మానేసి ఇంటికి వచ్చేసి ప్రశాంతంగా నులకమంచం మీద పడుకుని ఆలోచించాను. నాన్న చెప్పిన మాటలన్నీ గుర్తొచ్చాయి. వాటిని మరల మరలా మననం చేసుకుంటూ పక్కకు తిరిగి పడుకున్నాను. నాన్న చనిపోయాక ఇంటి ముందున్న వేపచెట్టు కింద కాన్వాసు గుడ్డ కప్పేసిన నాన్న తొక్కిన రిక్షాచక్రం మీద పడిన చంద్రుడి వెన్నెలకిరణం, పరావర్తనం చెంది నా కళ్ళకు సున్నితంగా గుచ్చుకుని నాకు కర్తవ్యబోధ చేసింది. మరునాటి నుంచే నాన్న రిక్షా తొక్కడం ప్రారంభించాను. మూడేళ్ల తేడాలో ఇద్దరు చెల్లెళ్ళకి పెళ్లిళ్లు చేసాను. పిల్లాపాపలతో వాళ్ళెంతో సుఖంగా, సంతోషంగా ఉన్నారు!"

"డిగ్రీ చదివానన్నావు కదా... ఎవరిని ప్రేమించలేదా?"

అతడు ఒక్కక్షణం రిక్షా తొక్కడం ఆపి ఏదో అనుభూతికి లోనైనట్టు రెండు నిముషాలు అలా ఉండిపోయి, నెమ్మదిగా తొక్కుతూ అన్నాడు! "నాన్న చెప్పిన మాటలు మనసులో సువర్ణాక్షరాలుగా నిలిచిపోయిన నేను, వయసు ప్రభావాన్ని నియంత్రించుకోవడం కోసం, అటు వ్యాయామం, ఇటు యోగా, ధ్యానం... పాఠశాల స్థాయిలోనే అలవాటు చేసుకున్నాను సార్. ఇక మీరు అడిగిన ప్రశ్నకు నా సమాధానం. జ్ఞానం వచ్చినప్పటి నుంచి చదువులో ప్రథమస్థానంలో ఉన్న నన్ను, మా కాలనీ ప్రెసిడెంట్ గారి అమ్మాయి మనస్ఫూర్తిగా ప్రేమించానని నాకు తొలి ప్రేమలేఖ అందించినాడు... దాన్ని తీసుకొని కూడా బాధ్యతలు ఉండడం వల్ల బదులు చెప్పలేక, మౌనంగా ఉండిపోయాను. ఇటు నన్ను వదులుకోలేక, అటు వాళ్ళ నాన్నని కాదనుకోలేక, ఆమె ఎంతగా నలిగిపోయిందో నాకు తెలుసు. అయితే తన ప్రేమను ఆమె గానీ, నేను గానీ ఎవ్వరికీ చెప్పుకోలేదు.

చదువు పూర్తి కాకుండానే వాళ్ళ నాన్న, ఆమెను బలవంతంగా ఒక పట్నం కుర్రాడికి ఇచ్చి పెళ్లి చేశాడు. వాడు నగరంలో కాపురం పెడతానని చెప్పి, ఆ అమ్మాయిని తీసుకుని మద్రాసు వెళ్లే రైలు ఎక్కేసాడు. ఆరోజు వాళ్లని స్టేషన్లో దింపింది నా

రిక్షాలోనే! నాకెందుకో అతని మీద అనుమానం వచ్చి, వాళ్లకి తెలియకుండా అనుసరించాను. వాడు ఆ అమ్మాయిని ఒక వేశ్యా గృహానికి అమ్మబోతే, అతని మాటలు చాటుగా విన్న నేను, తన తండ్రి ఇష్టంలేని పెళ్ళిచేయడం వల్ల రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నట్టుగా ఒక ఉత్తరం ఆమెచేత రాయించి, హోటల్ నుంచి ఆమెను తప్పించేసి, తనతో, మా చెల్లెళ్ళతో ఈ ఊరు శాశ్వతంగా వచ్చేసాను. ఆమె అనుమతితోనే ఆమెను గుళ్ళో వివాహం చేసుకున్నాను. మనస్ఫూర్తిగా ప్రేమించి, పెళ్ళిచేసుకున్న ప్రేమికుల జీవితాన్ని, ఆ అనుభూతిని ఈనాటికీ ఆమెనుంచి పొందుతునే ఉన్నాను. నాకు ఒక అబ్బాయి పుట్టాడు. వాడికి చిన్నప్పటినుంచి కోరినవన్నీ ఇచ్చి, సాఫ్ట్వేర్ ఇంజనీర్ని చేసి, అమెరికాలో స్థిరపడాలి అన్న వాడి ఆలోచనకు జీవం పోసి, వాడు ప్రేమించిన అమ్మాయిని ఇచ్చి పెళ్ళిచేసి అమెరికా పంపేసాను. 44 సంవత్సరాల మా సంసార జీవితం... ఈనాటికీ అన్యోన్యంగా కొనసాగుతోంది. ఈ ప్రపంచంలో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరి పట్ల ఒకరికి పరిపూర్ణ అనురాగం, ప్రేమ పుష్కలంగా ఉన్నప్పుడు, ఆ దాంపత్యం ఎన్ని సంవత్సరాలైనా బోర్ కొట్టదు సర్! కానీ ఈ రోజుల్లో చాలా జంటలు వయసు ఆకర్షణ చేత ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే సంసారం చేస్తున్నారు. ఆ తర్వాత ఎవరిదారులు వారు వెతుక్కుంటున్నారు సార్. ఏమిటో సార్! రోజులు మారిపోయాయి.''

అతను ఏ ఉద్దేశంతో ఆ మాటను అన్నాడో కానీ, చివరి రెండు వాక్యాలు మాత్రం నన్ను ఎవరో ఛళ్ళున కొరడాతో కొట్టినట్లు తాకాయి!

అతని వాలకానికి , అతను మాట్లాడుతున్న మాటలకి పొంతనను ఊహించుకుంటూ అనుమానంగా అడిగాను. ''ఏమయ్యా రావణా! నీ వయసెంత?''

''అరవై నాలుగు సంవత్సరాలు బాబు. ఎందుకు అలా అడిగారు?''

''సన్నటి పర్సనాలిటీ, మరీ మాసిపోయిన ఆ గడ్డం, అక్కడక్కడ చిరుగులున్న ఆ పాంటు, టీషర్టు చూస్తుంటే నాలుగు రోజులనుంచి తిండి లేనివాడిలా ఉన్నావ్?''

దానికి అతను పకపకా నవ్వేసి అన్నాడు.

''మా గంగాభవాని ఇంట్లోకి రాని మూడురోజులు... నేను గెడ్డం గీసుకోను సారూ! ఆవిడకి, నాకు తప్ప ఇంక ఎవరికీ అందంగా కనపడాలి అనుకోను సారూ. కానీ మిగతా ఇరవై ఏడురోజులూ నేను రంగేళి రాజాలా ఉంటా. ఇది కూడా డ్యూటీ డ్రెస్ సారూ. ఇంటికెళ్ళి మళ్ళీ బయటకు వస్తే నన్ను మీరే గుర్తు పట్టలేరు సారూ. ప్రేమించుకుని చేసుకునే పెళ్లి కన్నా, పెళ్లి తర్వాత భార్యాభర్తలు ఒకరినొకరు అవగాహన చేసుకుంటూ, ఒకరి పొరపాట్లను మరొకరు చర్చించుకుని సరిచేసుకుంటూ, తమ అనుభవాలను, అనుభూతిని తామే పంచుకుంటూ పెంచుకునే ప్రేమానురాగాలు, ఆజన్మాంతముంటాయని, పెళ్ళయ్యాక మాకు తెలిసివచ్చింది సర్. అంతెందుకు? నేనిపుడు డ్యూటీ దిగి ఇంటికి వెళ్తానా, వేడినీళ్లు సిద్ధం చేసి ఉంచుతుంది నా గంగ! స్నానమాడిన వెంటనే వేడివేడి అన్నంలో నాకిష్టమైన పదార్థాలు తినడానికి సిద్ధంగా ఉంటాయి. ఇల్లు అందమైన తోటలా ఆహ్లాదంగా ఉంటుంది. ఆమెకు ఇష్టమైననాడు పక్క విరిసిన తెల్ల తామరపువ్వులా ఉంటుంది. తనకి ఓపిక లేనినాడు నేను ఇబ్బంది పెట్టను. ఇంతకన్నా అదృష్టం ఏ మగవాడికి ఉంటుంది సర్?'' అన్నాడు సంతృప్తిగా దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ.

నాకు బుర్ర తిరిగిపోయింది. జీవితం విలువ ఇంత అద్భుతంగా చెప్పినవారు ఎవరూ నాకు ఇప్పటివరకు తారసపడలేదు.

అంతలో ఫోన్‌లో మెసేజ్ వచ్చిన శబ్దం వినపడింది.

తీసి చూసాను. ''ఎక్కడి వరకు వచ్చారు?'' సువర్ణ పంపిన సందేశం అది.

జ్ఞానం వచ్చినప్పటినుంచీ అడిగిందే తడవుగా, ఏది కోరినా ఎంత ఖరీదైనా కొనిపెట్టి, నేను ఏం చేసినా తమకు అంతకు ముందు తెలియని కొత్తవింతను చూస్తున్నట్టే భావించేవారు నా కన్న తల్లితండ్రులు! చివరకు భార్గవిని ప్రేమించి, ఆమెతో జీవితపు అంచులు చూసేసి, ఆమెనే పెళ్లి చేసుకుంటాను అంటే, 'నీ ఇష్టం నాయనా' అని ఒప్పుకుని, నాకు ఇద్దరు పిల్లలు పుట్టేంత వరకు, ఇంట్లో జీతం భత్యం లేని పనివాళ్ళలా పనిచేసి, వాళ్ళు చదువుల్లోకి వచ్చాకా వాళ్ళ ప్రభావం పిల్లల మీద పడకూడదు అన్న భార్గవి అభిప్రాయం ప్రకారం వాళ్ళని వృద్ధాశ్రమంలో చేరమంటే... చేరిపోయిన ప్రేమమూర్తులు నా తల్లి తండ్రులు!

ఈమధ్య భార్గవికి ఆఫీసులో పని ఎక్కువగా ఉండి చాలా ఆలస్యంగా ఇంటికి రావడంతో నాకు చాలా చిరాగ్గా ఉంటోంది. ఇంట్లో తరచుగా చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. కాస్త మనసుకు శాంతి కావాలనిపించింది. మనసు విప్పి మాట్లాడుకునే ఒక తోడు ఉంటే బాగుండునని అనిపించింది.

ఆ ప్రయత్నంలో భాగంగా ముఖపుస్తకంలో, నేను అంగీకరించని దాదాపు తొమ్మిదివందల స్నేహ విన్నపాలలో చాలా ఎక్కువ సార్లు సందేశాలు పంపినది ఎవరా అని చూసాను. తానే సువర్ణ. దాదాపు నెలరోజుల నుంచి మా మధ్య ఛాటింగ్ జరుగుతోంది. నా వివరాలు తాను పెద్దగా అడగలేదు.. నేను చెప్పలేదు. ఎక్కువగా తన వివరాలే చెప్పేది. తన భర్త దుబాయ్‌లో ఉంటారని, పిల్లలను తన తల్లిదండ్రులు చూసుకుంటారని, ఎపుడైనా వీలైతే ఒకసారి తన ఇంటికి రమ్మని కోరింది. భార్గవి సెలవులకి ఊరు వెళ్ళిన పిల్లల్ని చూసొస్తాను అని వాళ్ళ అమ్మగారింటికి వెళ్లడంతో...సువర్ణ స్వాగతించడమే నా ఈ ప్రయాణానికి కారణం!

నేను ఆ సందేశానికి సమాధానం ఇవ్వలేదు.

''వర్మా! రిక్షా ఒకసారి ఆపుతావా, కాస్త వేడివేడిగా టీ తాగుదాం!'' ఆలోచనలతో వేడెక్కిపోయిన కణతలు నొక్కుకుంటూ అన్నాను.

అపుడే 'హౌసింగ్ బోర్డు కాలనీ – స్వాగతం' అని రాసి ఉన్న ఆర్చ్ మార్గంలోకి రిక్షా తిప్పాడు వర్మ.

ఒక్కక్షణం తొక్కడం ఆపి... ''అంత తలనొప్పిగా ఉందా బాబు. సమయం పదకొండు దాటిపోయింది కదా. ఈ సమయం వరకు ఇక్కడ షాపులు తెరిచి ఉండవు బాబు. మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి వెళదాం. మీరు వేడివేడి టీ తాగాక, మీరు వెళ్ళవలసిన ఇంటి దగ్గర దింపేస్తాను బాబు.'' అన్నాడు.

ఒక్కనిముషం ఆలోచించి ''సరే'' అన్నాను.

మరో రెండు నిముషాల్లో వర్మ గుడిసె ముందు రిక్షా ఆగింది.

వీధిదీపం వెలుగులో గేటు తీసి, ''రండి బాబూ, రండి'' అన్నాడు కొంచెం వేగంగా ముందుకు నడుస్తూ వర్మ.

అతన్ని అనుసరించాను.

''గంగా...'' అని అరిచాడు వర్మ.

''తులసి ఇప్పటివరకూ నీ కోసం చూసి ఇప్పుడే పడుకుంది. అలా అరుస్తావేంటి?'' అంటూ బయటకు వచ్చిన గంగాభవాని కాబోలు, నన్ను చూసి 'ఎవరాయన' అన్నట్టు కనుబొమలు ముడిచి అడుగుతూ సైగ చేసింది.

"ఆయన పెద్ద ఆఫీసరుగారు! పాపం చాలా తలనొప్పిగా ఉందట. కొంచెం అల్లం వేసి చిక్కగా టీ పెట్టు. ఇక్కడున్నట్టు రావాలి!" అన్నాడు ఆమెతో.

''అలాగే" అని ఆమె లోపలికెళ్ళింది.

"ఇలా కూర్చోండి బాబు'' అని విరగబూసిన సన్నజాజిపందిరి పక్కన కుర్చీ వేసి, నేను కూర్చున్నాక అతను లోపలికి వెళ్ళి, మంచినీళ్లు తెచ్చి ఇచ్చాడు.

నేను మంచినీళ్లు తాగాను.

మరో రెండు నిముషాల్లోనే పొగలు కక్కుతున్న మరిగిన 'టీ' మగ్‌తో వచ్చింది గంగాభావాని.

''నా శ్రీమతి... గంగాభవాని.'' పరిచయం చేసాడు వర్మ.

పమిట నిండుగా కప్పుకున్న ఆమె మౌనంగా నమస్కరించింది.

రెండు సిప్‌లు వేసాక, 'అద్భుతమైన రుచి' అనిపించింది.

''తులసి ఎవరు వర్మా?'' అడిగాను.

మిగతా టీ వేడిగా తాగేసరికి, తలనొప్పి పారిపోయినట్టు మాయమైంది.

''ఓ... మీకు తులసి సంగతి చెప్పలేదు కదా సారూ! నా పెద్ద చెల్లి మనవరాలు సారూ. పన్నెండేళ్ల కిందట వాళ్ల ఊరికి వరద వచ్చి, అందరూ తలోదిక్కూ కొట్టుకుపోతుంటే తులసిని నా చెల్లి కాపాడి, రెండు రోజులు ఆలంబనగా దొరికిన పెద్దచెట్టు మీద ఉండిపోయింది. ఆతర్వాత హెలికాప్టర్ వాళ్ళు చూసి రక్షించి తీసుకువచ్చి, నాకు అప్పగించిపోయారు. తన వారందరూ పోయిన బెంగతో నా చెల్లెలు బెంగ పెట్టుకుని, తులసిని నాకు అప్పగించి కళ్లు మూసింది. అప్పటినుంచి తులసిని మేమే పెంచుకుంటున్నాం. ఇపుడు ఆరో తరగతిలోకి వచ్చింది బాబు.'' అన్నాడు వర్మ.

మనసు ఆర్ద్రమై నా కళ్ళు చెమరించాయి.

నేను లేచాను. ఎదురుగా నిలబడిన వర్మ కళ్ళలో ఎక్కడైనా అసంతృప్తి కనబడుతుందేమో అని గబగబా వెతికాను.

ఊహు. గంగతో అభిషేకించిన స్ఫటికాల్లా ఉన్నాయి అవి!

అతన్ని ఒక్కసారిగా గుండెలకు హత్తుకున్నాను.

''సార్! మీరెందుకో ఎమోషన్ అవుతున్నారు!" అన్నాడు వర్మ నా చెవిలో.

''ఏమీలేదు వర్మా! రాజనీతి సంగతేమో గానీ, బ్రతుకునీతి తెలుసుకుని, ఇప్పుడే నా కళ్ళు తెరుచుకున్నాయి. నేను తిరిగి స్టేషన్‌కి వెళ్లాలనుకుంటున్నాను.'' అన్నాను బరువెక్కిన మనసుతో.

''బాబు. ఎవరింటికో వెళ్ళాలి అన్నారు?''

''అవసరం లేదు. నేను వెళ్తాను.'' అని వెనుదిరగబోయాను.

''అయ్యో... బలేవారే బాబు! దాదాపు మూడు కిలోమీటర్లు. అంత దూరం నడిచి వెళ్తారా? నేను దించేస్తానాగండి. గంగా! ఇప్పుడే పదినిముషాల్లో వస్తా. రండి బాబు... రండి.'' అని, నా చేయి పుచ్చుకుని గేటువైపు దారితీసాడు వర్మ.

రైల్వేస్టేషన్ ముందు రిక్షా దిగాక, ''మీరెటు వైపు వెళ్ళాలి బాబు? ఈ టైములో బళ్ళు ఏమైనా ఉన్నాయేమో కనుక్కురానా బాబు?'' అని అడిగాడు

''అవసరం లేదు వర్మా! మళ్ళీ ఈ వూరంటూ వస్తే, నిన్ను చూడటానికే వస్తాను. అన్నట్టు యిదిగో'' అంటూ అతని చేతిలో పదివేలు పెట్టాను.

''బాబూ! ఏమిటిది? నా కిరాయి యాభై రూపాయలు మాత్రమే!" అన్నాడు ఆదుర్దాగా.

''నీకు కిరాయి ఇవ్వను తాతా! ఇస్తే ఇప్పుడే నీ ఋణం తీర్చుకున్నట్టు అయిపోతుంది. ఈ డబ్బు తిరిగి ఇస్తే నామీద ఒట్టే! ఈ పదివేలు తులసి చదువుకు ఉపయోగించు. ఇంకా అవసరమైతే నాకు ఫోన్ చేయి. వస్తాను."

సువర్ణ అడిగిందని పట్టుకెళ్తున్న డబ్బు... అతని రెండుచేతుల్లో పెట్టి, ఆప్యాయంగా నొక్కి, మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా స్టేషన్‌లోకి నడిచాను.

# జీవుగంజి

**బోయిన భాస్కర్**

✆8008573368




*ఎవళ్ళు యాడికివోయినా... జరంత మంచిగ బతకనీకేగదా. ఆళ్లంతా ఎప్పుడూ ఆపతికి సంపతికి కల్సుకుంటంద్రు. బయిటోళ్ళు ఒక్క చెడ్డ మాటనుకోకుండ ఎంత మంచిగుంటంద్రు. అంటే? తల్లిదండ్రులు పడ్డ కష్టాన్ని గుండెల్ల పెట్టుకుని యాది చేసుకునెటోళ్ళకే... మంచిగ సూసుకోవాల్ననే అకలు ఉంటది. అది మర్సి, నాది నేనే సూసుకుంట అంటేనే... గిసొంటి లొల్లులు, పంచాయితీలు.”*

“రెక్కలచ్చిన పక్షి ఎంత దూరమెగిరి పోయినా... పోయినకాడ ఎంత సౌలతి ఉన్న గానీ, పుట్టి పెరిగిన జాగ మీద బుద్ధి పుట్టి, ఒక్క మల్కనైనా వచ్చి, సూసుకుని మురిసిపోతదట! గాయింత సోయి, గీ మనుషులకు ఎందుకుండదో... ఏమో? ఎంతైనా... గసొంటోళ్ల గుండె గట్టిదే. ఆళ్లకు చేతులెత్తి మొక్కాల్నే!” యాపచెట్టు కిందున్న గడాంచను వంచుకుని, కూసుండుకుంట అన్నడు యాదగిరి.

ఆ పక్కన్నే కుర్చీల కూసుని, ముందున్న మంచమ్మీద తెల్లబట్ట పరిచి, అందులో సకినాల కోసం నానబెట్టిన బియ్యాన్ని వేసి, ఆరేందుకు అటు ఇటు చేత్తో పొర్లిస్తున్న లింగమయ్యకు ఆ ముచ్చట సమజ్ గాక... “అది ఎవల ముచ్చట. ఇప్పుడదెందుకు యాదికచ్చె?” పనిజేసుకుంటనే అడిగిండు.

జేబులకెంచి బీడీ తీసి, నోట్లె వెట్టుకుని లైటర్‌తోని ఎలిగించుకుంట, “గా... బిత్తిరి ఎంకటిగాడు లేకుండెనా... వాని కొడుకు సమ్మిగాడు పెళ్ళైనంక పెళ్ళాన్ని తీసుకుని, సూరతో గీరతో బతకవోయి పదేండ్లయిపోయింది. నడుమ ఎప్పుడో ఒకసారి ఇట్లచ్చి, అట్లవోయిండు. మల్ల ఇటుదిక్కు తొంగి చూడలే. మంచి, చెడ్డకు ఫోన్ గూడా లేదట!”

“గిప్పుడు వాని ముచ్చటెందుకచ్చిందిరా?” యాదగిరినే అదో రకంగ సూసుకుంట అన్నడు.

“ఎందుకంటవేందన్నా... పాపం వానవ్వకు పాణం పురాంగ బాగలేదట. కొడుకును ఒక్క తీర్గ కలవరిస్తందట. ఫోన్ చేస్తంద్రట గానీ, కలుస్తలేదో... ఎత్తుతలేడో గానీ... ఆ ఎంకన్న దారిల కల్సి, అది ఉంటదో పోతదో జీవుగంజి పోయనీకైనా వస్తే బాగుండని ఏడుసుకుంట చెప్పిండు. నాకైతే శానా బాధనిపించింది.” అని విషయాన్ని చెప్పిండు.

అది ఇనంగనే లింగమయ్య ఏం మాట్లాడలేదు. ఇంతల అక్కడికి రాజలింగం వచ్చిండు. అతన్ని చూడంగనే...

“ఏమోయ్ రాజలింగు. ఎన్నడులేంది బాట ఇటు మొకాన పడ్డదేందోయ్.” అని పరాచికంగా అడిగిండు యాదగిరి.

“గిర్నీ కాడా పెద్ద మనుషులు జమైంద్రు. లింగమన్నను తోలుక రమ్మని మొగిలన్న పంపిండు!”

ఆ ముచ్చట లింగమయ్యకు ఇనవడ్డది. తననెందుకు రమ్మన్నరో అర్థం గాలేదు. గదే సోంచాంచుకుంట... “నాతోని వాళ్లకేం పనట?” అనడిగిండు.

అప్పుడు యాదగిరికి ఏదో గుర్తుకు వచ్చినట్లై... “నాకు తెల్సి, గా... చింతకింది కొమురన్న పంచాయతేమోనే.” అనంగనే... ”అవునవును. గదానికే.” అని రాజలింగం చెప్పిండు.

“కొమురన్న పంచాయతేంది? దానికి నన్ను పిలుసుడేందీ? తెల్లారితే బోగి. పండుగ ముందట పంచాయతీ ఏందిరా?” అసలేం అర్థంగాక యాదగిరి దిక్కు చూసిండు.

“అరె... లింగమన్నా... నువ్వేం ఆగంగాకు! ముందు నువ్వు పద. నేను గూడ వస్తా.” అని గడాంచల నుండి లేచిండు.

“ఊరించకుంట ముందు ముచ్చటేందో చెప్పండ్రా.” జరంత గుర్కాయించుకుంటనే, అటూ ఇటూ ఇద్దర్ని సూసుకుంట అడిగిండు లింగమయ్య.



“కొమురన్న కొడుకు రమేష్ ఉన్నడు గదా. వాడు భూమిని అమ్మమని నెల్లాళ్ళనుంచి అవ్వయ్యలతోని పోరువెడుతండు. వాళ్లేమో అర్కీస్ ఒప్పుకుంటలేరు. పండుగ పూట అందరూ ఇండ్లల్లనే ఉంటరు గదా. ఆ ఉపాయంతోనే నిన్ననే ఊర్లెకు వచ్చిండు. గదే ముచ్చట ఇల్లుదాటి, ఊరి ముందట పంచాయితై కూసున్నట్టున్నది.” తనకు తెల్సింది చెప్పిండు యాదగిరి.

అదినంగనే లింగమయ్య... “మరి దానికి నన్నెందుకు రమ్మన్నట్టు?” తానువొయ్యి... ఏం జెయ్యాల్నో అర్థంగాక ఆలోచించుకుంట అన్నడు.

“అంటే... తల్లిదండ్రి కొడుకు పంచాయితీ కదా. నువ్వు గూడా... అసోంటి లొల్లిలనుంచే బయటపడి వచ్చినవ్ గదా. జరంత అనుభవమున్నదని పిల్చిండ్రేమో... అని నాకనిపిస్తంది.” అని దీర్ఘంతీసి చెప్పిండు యాదగిరి.

“రమ్మని చెప్పిన ఆళ్లకంటే బుద్దిలేదు. పిల్చిన వీనికి, పోదాం పమ్మని ఎగేస్తున్న నీకైనా కొంచెముండాలి కదరా! ఇంకా నయం అందాకా పోయినంక విషయం తెల్సి ఔలగాన్ని కాలేదు.” అని జరంత కోపంజేసి అనంగనే, మరోమాటకు తావియ్యకుండా గమ్మున బయిల్దేరిండు రాజలింగం. పంచాయితీల ఏం జరుగతదో తెల్సుకుందామని. యాదగిరి గూడా అటే నడిసిండు.

లింగమయ్యకు ఎకాఎకిన మనసంతా కరాబైంది. ఏవేవో మతిల మెదులుతుంటే, వాకిట్లనే అటీటు కాసేపు తిరిగిండు.

“ఏమైందయ్యా! ఎన్నడులేంది కాలుగాలిన పిల్లిలెక్క ఆగమాగం తిరుగవడితివి?” చాలా సేపటి నుండి భర్తను గమనించిన రుక్కమ్మ, ఇంట్ల నుంచి బయటికచ్చుకుంట అన్నది.

అదినంగనే లింగమయ్యకు ఏం చెప్పాల్నో సుదులాంచలేదు. సప్పుడు జెయ్యకుంట వెళ్లి, గడాంచల కూసున్నడు. రుక్కమ్మ మెల్లగా వచ్చి భర్త పక్కన కూసుంటూ... “అంతా నాకెరుకేలే. నువ్వేం మళ్ళా మనుసు పాడుజేసుకోకు.” అంది.

ఆ మాటతోని కొంచెం నిమ్మళమైన లింగమయ్య, భార్య వైపు జూసి... “నువ్వొకటి సూటిగజెప్పు. మనం మన పిల్లలతోని లొల్లివెట్టుకుని వచ్చినమా?” అన్నడు.

అదినంగనే రుక్కమ్మకు కోపం సుర్రున లేచింది. “ఎవలన్నరీ మాట? చీపురు తీసుకుని కొడుతా... నా ముందల అంటే!” అని పెనిమిటినే చూసుకుంట కోపంగ అన్నది.

“ఎవరేం అన్లేదు గానీ, అందరూ గట్లనే అనుకుంటున్నరేమో...” అని జరిగిన విషయాన్ని భార్యకు చెప్పిండు లింగమయ్య.

అది ఇనంగనే జరసేపు సోంచాంచి, “నిజమే. మనం వచ్చిన లెక్క వేరైనా, ఆఖరికీ ఆలోచన జేత్తే అసోంటి ముచ్చటనె గదా! జనం అట్లనే అనుకుంటరు. గా దానికేనా... నువ్వంతగనం ఆలోసిత్తన్నవ్. పోనియ్ లే. ఎవలెట్లనుకున్నా... అందరూ మనోళ్లే గదా. నువ్వింకేం మనాది వెట్టుకోకు. మళ్ళా ఈ పంచాయితీ ముచ్చట కోసం ఎవలైనా వస్తే, అట్లగాదు... గిట్లనీ నీకు తోచింది సెప్పు!” అనిజెప్పి లోపలికి పోయింది.

భుజమీ్మదున్న తువ్వాలను మడిచి నెత్తికింద పెట్టుకుంటూ, గడాంచల ఒరిగి, ఆలోచనల పడ్డడు లింగమయ్య.

★★★

లింగమయ్య సర్కార్ బడిల చెప్రాసిగా పనిజేసి రిటైరయ్యిండు! ఇద్దరు కొడుకులు, ఒక్కతే కూతురు. లింగమయ్యకు రుక్కమ్మతోని లగ్గమై, నౌకరి దొరికేనాటికే... ఊరిల తాత నుంచి వచ్చిన మూడెకరాల పొలం, అయ్యవ్వ కట్టిన కుమ్మరి గూణపెంకుల ఇల్లున్నది. ఇంకేం చేసుకునే ఆరాటం అంతగ లేకపోవడంతోటి, పిల్లలు పుట్టంగనే, వాళ్ళను మంచిగా చదివించుకుంటే చాలనుకున్నరు ఆలుమగలు. ఎవుసం జేసుకుంటనే, వాళ్ళు వీళ్ళు ఎకురం, అరెకురం భూములు కొనుకుంటాంటే, నౌకరి జేసుకుంట మనమెందుకు కొనద్దనుకుని, ఓ రెండెకరాల చెలుక భూమి కొన్నరు.

"పండని చెల్క భూమి తీసుకుని పడావు బెట్టుడెందుకు? మండలంల్నో, జిల్లా కేంద్రంల్నో గుంటో, రెండు గుంటలో తీసుకుంటే, పిల్లలు ఎదిగేయాళ్ల వరకు దేనికైనా అక్కరకొస్తది. ఇంకా పైసలుండి ఇల్లుగట్టి అద్దెలకిస్తే నెలానెలా కిరాయిలొస్తయని..." పనిజేసే బడికాడి సార్లు లింగమయ్యకు చెప్పిండ్రు.

అప్పటికైతే భూమిని కొనుడు అయిపోవడంవల్ల, అయిందేదో అయిపోయిందని అనుకున్నరు గానీ, సార్లు జెప్పిన ఇగురం ముచ్చట లింగమయ్య, రుక్కమ్మ మతిల నుంచి పోలేదు.

కాలం గడుస్తాంటే, లింగమయ్యకు రెండు మూడేండ్లకోసారి అటు ఇటు బదిలీలైతన్నయ్. డూటికి పోనికి, రానికి ఇబ్బంది గూడా అయితాంటే, తెలిసినోళ్లు, బడులల్ల మంచిగ దోస్తులైన సార్ల దొరింపుతోని మండలంల్నే రెండు గుంటల జాగ తీసుకున్నరు. అప్పటికే పోరల చదువులు గూడా మండలానికి చేరినయ్. వాళ్ళ సౌలతి కోసం... వాళ్ళు వీళ్ళు ఎన్నెన్ని జెప్పినా, అప్పుజోలికి పోకుండా, ముందు కొన్న రెండెకరాల చెల్క భూమిని అమ్మి, మూడేసి రూములుండే... నాలుగు పోర్షన్లతోని రెండంతస్తుల బంగ్లా కట్టుకున్నరు. ఊరికి దూరమయినా, నౌకరి కోసం ఏ ఊరికి పోయినా దగ్గరే అవుతదని, పిల్లలకు కూడా కాలేజీ చదువులదాకా డోకా ఉండదనుకుని చేసిన ఉపాయం మంచిగనే కలిసొచ్చింది.

చూస్తుండంగనే ఏండ్లు గడిచిపోయినయ్. పిల్లలందరి చదువులయిపోయి, పెండ్లిళ్లు గూడా అయిపోయి సంసారాల్లో పడ్డరు. బిడ్డకు మంచి సంబంధమే చూసి చేసిండ్రు. ఆమెకేం రంజిలేదు. ఎటొచ్చి కొడుకుల కథే జరంత ఎటమటంగా తయారైంది. పెద్దోడు డిగ్రీ ఎల్లకముందే, ఓ పిల్లను ప్రేమించి పెళ్ళిజేసుకుని పట్నంబోయిండు! ఇగ రెండోడు డిగ్రీ దాటి ముందుకుపోలె! సోపతులు పెరిగి, తాగి తందనాలు ఆడుతున్నడని, మేనరికం సంబంధమైతే కాళ్ళుజేతులు దగ్గర వడ్డంక జరంత జీవుగంజి పోసే ప్రేముంటదనుకున్న రుక్కమ్మ, తన తమ్ముని బిడ్డను దొరింపుజేసి లగ్గం జేసిండ్రు!

ఇగ అందరికీ ఇంటికచ్చే కిరాయిలు, లింగమయ్యకచ్చే జీతమే ఆధారమైంది. ఇంతల ఓ పోరడు పుట్టంగనే పెద్దోడు ఇల్లు జొచ్చుకొని వచ్చిండు. అయిందేదో అయిపోయింది అందరం కలిసే ఉందమనుకుని ఉన్నరు. కూసుండి తింటే గుట్టలైనా అరుగుతయంటరు గదా... లింగమయ్య ఇంట్ల గదే కత మొదలయింది. మీది పిట్టల చూసుకుంట, మసాల నూరుకున్నట్టు అయ్యకచ్చే జీతం, అద్దెలు చూసుకుంట... కొడుకులు లెక్కలేసుకుంట... నాకు ఇదని ఒకడంటే, నాకు అది అని ఇంకొకడు వంతులేసుకునుడు మొదలువెట్టిండ్రు! అండ్ల మెల్లగ లొల్లులు సురువైనయ్.

ఇట్లయితే కాదని, పని మీద ధ్యాసలేని కొడుకుల్ని నమ్ముకుంటే తమ బతుకు ఆగమైతదని ఆలోచన జేసిన లింగమయ్య... నౌకరి దిగిపోయినంక వచ్చిన డబ్బులతోని ఊర్లే ఉన్న ఇంటిని కూలగొట్టి రెండు రూముల డాబా ఏసిండు. కొడుకులకు చెరి కొన్ని పైసలిచ్చి ఏదన్న యాపారం పెట్టుకొమ్మని, నెల నెల వచ్చే కిరాయిలతోని పొల్లగాండ్లను చదివిచ్చుకొమ్మని

సుద్దులు జెప్పి, 'మా తెరువు రాకుండ్రని, ఊర్లే ఉన్న ఇల్లు, భూమికి మేం చచ్చినంకనే ఆశపడుండ్రని' గట్టిగ చెప్పిండు. ఒక రకంగా 'మీరు బాగుపడ్డరని మాకు నమ్మకం కలిగితేనే మీ దగ్గరికి చుట్టం చూపుగ వస్తమని, అంతదాకా మా దగ్గరికి అర్కీస్ రావద్దని' వార్నింగ్ ఇచ్చి వచ్చిండు లింగమయ్య.

అట్ల కొడుకుల్ని వదులుకుని ఊరికి వచ్చి అరేళ్లయింది. బస్సెక్కినా, ఆటోలో పోయినా పావుగంట తొవ్వే. రుక్కమ్మ అప్పుడప్పుడు పోయొస్తది. వాళ్ళు గూడా ఎప్పుడన్నా వచ్చి పోతుంటరు. కానీ, ఇన్నేండ్లల్ల లింగమయ్య ఒక్కసారిగూడా కొడుకుల దగ్గరికి పోలేదు. ఇక్కడికి వాళ్ళొచ్చిన గానీ... కోడళ్ళు, మనుమళ్ళు, మనుమరాళ్లతోని తప్ప కొడుకులతోని ఇయ్యాల్టివరకు మాట మాట్లాడలేదు. అంతటి పట్టింపు మనిషి లింగమయ్య! అసోంటి ఆయనకు కొడుకులతోని లొల్లి వెట్టుకుని వచ్చిండనే అపవాదు విని తట్టుకోలేకపోయాడు. తన తప్పు లేకుండనే నిందలు మోయాల్సి వచ్చినందుకు బాధ పడ్డడు.

★★★

రుక్కమ్మ చెప్పినట్టు... మాట సాయం కోరుకుంట నలుగురు పెద్దమనుషులు కల్సి, లింగమయ్య ఇల్లు జొచ్చుకుని వచ్చి విషయాన్ని మొత్తం ఆయనకు చెప్పింద్రు. అదంతిన్న లింగమయ్యకు ఏం మాట్లాడాల్నో అర్థం గాలేదు. కానీ, ఏదో ఒకటి చెప్పాలె గదానీ... "కత్తి వాళ్లదే, నెత్తిగూడా వాళ్లదేనాయే... ఇండ్ల నడిమిట్లకు వొయ్యి నేనేం జెప్పాలే?" తండ్రికొడుకుల లొల్లికి నేనేం చేయలేనన్నట్లు అన్నడు.

"నువ్వన్నది నిజమే గానీ, నీ కొడుకులకు ఏందో మంత్రం చెప్పచ్చినవనీ, దాంతోని వాళ్ళు ఆల్సమైనా మంచిగనే కుదురుకున్నరని అందరు అనుకుంటాంటే... జరంతగా ఇగురమేందో... ఆ కొమురన్నకో, ఆయన కొడుక్కో చెప్తువని వాళ్ళను అక్కన్నే ఉంచి వచ్చినం." అందరు కల్సి వచ్చిన అసలు విషయం చెప్పిండు కుల పెద్దమనిషి మొగిలి.

"చూడు మొగిలి... ఇది ఇంటింటికీ ఉండే కతనే! ఒక్కొక్కల్దీ ఒక్కో తరీకల ఉంటది. నేనేం నా కొడుకులకు నీతులు చెప్పలేదు. నా జాగల, నేను చచ్చేదాకా వేరేగా ఉండి, నా బతుకేదో బతుకుదామని వాళ్ళతోని తెగదెంపులు చేసుకుని వచ్చిన. ఇప్పుడు కొమురయ్య కత వేరు. ఉన్న భూమిని తెగనమ్మి కొడుక్కిస్తే రేపటి సావుదలకు మా గతేందనీ? నువ్వు సాదుతవని గ్యారంటీ ఏందని ఆయన లొల్లి. అసోంటి పంచాయతీకి ఎవలేం చెప్తరు? అందుకే ఎవల లడాయిని ఆళ్లే తేల్చుకోవాలే. ఇండ్ల నేను చెప్పనీకి ఏం లేదు." కుండ పల్గొట్టినట్టు చెప్పిన ఆ మాటలు ఇనంగనే... అందరూ ఆలోచన్ల వడ్డరు.

"తూ... దీనవ్వ. ఎసోంటి కాలం నడువవట్టే! పిల్లల్ని గుట్టెత్తు పెంచి అన్నీ సవరిస్తే... ఆఖరికి కన్నోళ్లకు పిడికెడు బువ్వవెట్టని కాలం దాపురించే! ఎక్కడ జూసినా గిసొంటి లెక్కలే కానవస్తుంటే, ఇగ గసోంటప్పుడు కొమురన్న ఏ భరోసతోని కొడుకును నమ్మి, భూమమ్మిస్తడు!" కన్న తల్లిదండ్రులకు తిండివెట్టకుండా తరిమేస్తున్న కొడుకులు, కూతుళ్ళ కథలు మదిల మెదులుడుతోని తావుసంగ అన్నడు యాదగిరి.

"అరె... అందరూ అట్లనే ఉంటరా. ఆడాడ ఒకళ్ళో ఇద్దరో మోపైతరు! ఇగ అసోంటోళ్లను పట్టుకుని, అందర్ని అనుమానిస్తే ఎవలం కొసెల్లం!" ఓ పెద్దమనిషి తన మాటను చెప్పిండు.

"ఇప్పుడు అందరూ అట్లనే తయారైతంద్రు. పేపర్లల్లా... టీవీలల్లా... చూస్తలేమా! అంతదాకా ఎందుకు? అసోంటోళ్ళు మనూర్లనే బొచ్చెడు మందున్నరు. వాళ్ళల్ల ఎవరయ్యా... ఇక్కడున్న అవ్వయ్యలను కష్టపెట్టకుండ సూసుకుంటున్నది. లింగమన్న చెప్పినట్లు కొడుకులకు, బిడ్డలకు ఎంత జెయ్యాల్నో గంతే చేసి, మన జాగర్తల మనముండాలే!" లోకంల పిల్లలంతా అంతే అన్నట్టుగ నిందించిండు యాదగిరి.

"నువ్వన్నది నిజమే గావచ్చు. కానీ, అదే పగట్ల రామన్న కుటుంబంనే తీసుకో... ఆయన కొడుకు బడిపంతులై, మన లింగమన్న లెక్కనే మండలంల ఇల్లు గట్టుకుని, అన్నే ఉండుకుంట, ఇక్కడ తండ్రిని జూసుకుంటండు, ఆయన కొడుకు పట్నంబోయిండు, మనుమడు అమెరిక పోయిండట! ఎవళ్ళు యాడికివోయినా... జరంత మంచిగ బతకనీకే గదా. ఆళ్లంతా ఎప్పుడూ ఆపతికి సంపతికి కల్సుకుంటంద్రు. బయిటోళ్ళు ఒక్క చెడ్డ మాటనుకోకుండ ఎంత మంచిగుంటంద్రు. అంటే? తల్లిదండ్రులు పడ్డ కష్టాన్ని గుండెల్ల పెట్టుకుని యాది చేసుకునెటోళ్ళకే... మంచిగ సూసుకోవాల్ననే అకలు ఉంటది. అది మర్సి, నాది నేనే సూసుకుంట అంటేనే... గిసొంటి లొల్లులు, పంచాయితీలు." అందరట్లనే ఉండరని వివరించిండు మొగిలి.

"సుక్కతెగి పడ్డట్టు వాల్లొక్కరే ఉన్నరు. ఇంకా మిగిలినోళ్ల సంగతేంది?" అని యాదగిరి అంటుండగానే... ఇంట్లనుంచి రుక్కమ్మతోని కలిసి కొమురయ్య, ఆయన భార్య లచ్చిమి, కొడుకు రమేష్‌లు అక్కడికి వచ్చింద్రు.

వాళ్ళను చూడంగనే వీళ్లంతా ఎప్పుడచ్చింద్రని అందరూ బీరిపోయింద్రు. జరసేపటికి రమేష్ మెల్లగ నోరిప్పిండు.

"లోపల మీరు మాట్లాడుకున్నదంతా ఇన్నం. నేనేదో ఉద్దరించెటోని లెక్క, భూమిని అమ్మి యాపారం జేద్దమని ఆరాటపడిన గానీ, మీ మాటలన్నీ ఇన్నంక నామీద నాకే నమ్మకం కలుగతలేదు. అందుకే, భూమినమ్మి తలాతోక తెల్వని యాపారం జేసి, అది నిలువక నేనూ మునిగి, వీళ్ళను గూడా ముంచుడు ఇప్పుడు నాకిష్టం లేదు. నేను ఊరిడిసి పోయిన ఇన్నేళ్లల్ల ఈల్లకు, బుడ్డపైస ఆసరా కాలేదు. ఇప్పుడు ఆళ్లకున్న అయింత భరోసాను లాకెల్లి, ఆళ్లను ఆగం జేసి... అటెన్క ఇజ్జతిని బజాట్లేసుకునే దైర్నం గూడా నాకు లేదు. నేనింక బయిలెల్లిపోతా. నేనేం సూదకున్నా, వాళ్ళకున్న ఆసరా వాళ్ళకే జీవుగంజి లెక్క ఉండనియ్." అని అందరికీ రెండు చేతులు జోడించి దండం పెట్టి అక్కనుండి కదిలిండు రమేష్.

పిల్లలు తల్లిదండ్రులను చూడకపోయినా పర్వలేదు. వాళ్లకున్న జీవుగంజిలాంటి ఆసరాను, భరోసాను బలవంతం పెట్టి, గుంజుక పోకూడదనే సత్యం అక్కడున్నోళ్లందరికీ అర్థమై... గంభీరంగా అడుగులేసుకుంట పోతున్న రమేష్‌నే చూస్తుండిపోయారు.

# అమృతహస్తం

**వాడపల్లి పూర్ణ కామేశ్వరి**
✆ 8056024790




*"బాబూ, నీదసలే జాలిగుండె! కృతజ్ఞత పేరిట అత్తయ్య కూతురుని మాత్రం చేసుకోవాలనుకోకు! కావాలంటే నాలుగు రూపాయలేసైనా సరే... దానికో సంబంధం చూసి చేద్దాం!" అంది అమ్మ.*
*ఆ ఇంటి దురదృష్టం నుండి నన్ను కాపాడాలని అమ్మ పడుతున్న తాపత్రయానికి నవ్వొచ్చింది. 'మనుషులెంత స్వార్థపరులమో కదా!' అనిపించింది.*

'ఆకేసి, పప్పేసి, కూరేసి నెయ్యేసి...' మనవరాలితో బువ్వాటాడుతోంది నాగలక్ష్మి. వాళ్ళిద్దరిని తదేకంగా చూస్తున్న శ్రీధరుకి, ఆ బువ్వాట ఆకలితో పేగులు పెట్టిన కేకలను గుర్తు చేసింది. శ్రీధర్ మనసు పాత జ్ఞాపకాలను తట్టిలేపింది.


నర్సాపురం కాలేజీలో బిఏ చదువుతున్న రోజులవి! కుర్రాళ్ళతో కలిసి స్ట్రైకులనీ, హక్కులనీ, పోరాటాలనీ విప్లవకారుల్లా ఉత్సాహంతో ఉవ్విళ్ళూరే వయసు! ఉద్యమాలు ఉద్వేగ పరుస్తున్నా, వయసు.. అల్లర్లు చిలిపిపనుల వంకకు తోసే పరువం! వీటన్నిటినీ మించినదే ఆకలి బాధ. దాన్ని జయించలేక నిస్సహాయ స్థితిలో గడిపిన రోజులవి!

"ఒరేయ్, ఆ పిట్ట చూడ్రా, ఎలా కవ్విస్తోందో!" సుధాకర్ అంటున్నప్పుడు, "కడుపు నిండినవాడికిరా కవ్వింపులూ, అలరింపులూ! అది కాల్తున్నప్పుడు అందాన్ని ఆరాధించే స్థితీ, ఆకలితీరే గతీ ఎక్కడిది?" ఉక్రోషంగా ప్రశ్నించిన ఆ రోజే నా కళ్ళల్లో మెదుల్తోంది. అటువంటి ఉక్రోషానికీ, ఆకలి బాధకూ సమాధానం దొరికిన సందర్భం, నా మనసులో ఎప్పటికీ తాజాగా నిలిచిపోతుంది.

సుధాకర్ చూపిన అందంతోనే నా ఆకలి తీరింది! అదొక సౌందర్యవతి అందామనుకుంటే పొరపాటే అవుతుంది! కసాయిగా కనిపిస్తూ, కడుపుని నింపిన రహీము సాయబు అందం. ఆరున్నరడుగుల ఆజానుబాహుడు రహీమ్ భాయ్. అరనెరిసిన గడ్డం, నల్లని వర్ణం, పటిష్టమైన శరీర సౌష్టవం, మశూచి సోకి, తగ్గిందని నిరూపిస్తూ మొహం నిండా మచ్చలు.

చూడగానే కరుకుగా కనిపించే ఆ రూపం మదిలో నిలిచిపోయింది. ఆ రూపాన్ని తలచినంతనే కళ్ళు అప్రయత్నంగా వర్షిస్తాయి. పాతికేళ్ళనాటి జ్ఞాపకాలను ఆ మసకలోంచి తాజాగా కనిపించే అపురూపమైన రూపమది.

★★★




“వాడ్నేదైనా పన్లో పెట్టకుండా మీ పట్టుదలేంటండీ? నాలుగువేళ్ళూ నోట్లోకి వెళ్ళడం మాటటుంచి, నలుగురికీ గుక్కెడు గంజి పోయడమే కష్టంగా ఉంటోంది. ఈ కాలేజీ చదువులిప్పుడెక్కడ కుదురుతాయి!” వాపోయింది అమ్మ.

“చివరి ప్రయత్నంగా మా బావని అడుగుతాను లీలా! కాదంటే జరిగేది అదే. అప్పుడు నువ్వన్నట్టే, పని తప్ప తప్పేదేముంది. ఇష్టమున్నా లేకున్నా అక్కయ్య గుమ్మమెక్కి సహాయం అడగాలి!” బరువెక్కిన మనసుతో అన్నారు నాన్నగారు. ఆరోజే మా పెద్దమేనత్తింటికి నర్సాపురానికి ప్రయాణమయ్యారు.

“బావగారూ, శ్రీధర్ డిగ్రీలోకొచ్చాడు. వేములదీవిలోనా కాలేజీ లేదు, మహానగరాల్లో చదివించేంత స్తోమత నాకు లేదు. వాడు కనుక డిగ్రీ పూర్తి చేస్తే, ఏదో ఒక ఉద్యోగం వస్తుంది బావగారూ! పెద్దకొడుకు చేతికందొస్తే మిగిలిన వాళ్ళకు చేయందిస్తాడన్న ఆశ! వాడికొచ్చిన మార్కులకు ఈ ఊళ్ళో కాలేజీలో సీటు వస్తుంది. ఫీజుకీ డబ్బు ఏర్పాటు చేసుకున్నాను. మీరు పెద్దమనసు చేసుకుని మూడేళ్ళపాటు వాడికి ఆశ్రయమిస్తే గట్టెక్కేస్తాడు” అర్థించారు నాన్నగారు.

“అదేమిటి ప్రసాదు, మేనత్తింట్లో హక్కుతో ఉండవల్సిన పిల్లాడు. మనలో మనకీ అర్థిపులేంటి. శ్రీధరు ఇక్కడుండి చదువుకుంటాడు. నువ్వు వాడి సంగతిక మరచిపో” అంటూ అభయమిచ్చారు మామయ్యగారు.

సుందరమ్మత్తయ్య నాన్నగారికి స్వంత అక్కయ్యే. అయినా పుట్టింటి వాళ్ళనెప్పుడూ చులకనగానే చూసేది. మా తాతగారి కాలంలో చేసిన మేనరికం పెళ్ళి ఆమెది. అక్కచెల్లెళ్ళందరిలో కాస్త సంపన్నుల ఇంట్లో పడింది. దాంతో సుందరమ్మత్తయ్యకు కొద్దిపాటి మిడిసిపాటుతో పాటు స్వార్థం విపరీతంగా పెరిగింది. ఎప్పుడైనా నలుగుర్నీ చూడాలనుకుంటే, పుట్టింటికి తనొచ్చి వెళ్ళడమే తప్ప, తన ఇంటికి ఛాయలకి ఎవ్వరినీ రానిచ్చేది కాదుట! బావమరుదులు ఇబ్బందుల్లో ఉండడం చూసి, మావయ్యగారు చూసీ చూడక ఏదైనా సహాయం చేద్దామనుకున్నా, ఉన్నదంతా ధారపోస్తే రేపు మనమదుక్కుతినాల్సి వస్తుందని కసురుకునేదిట. మా నాన్నగారు అమ్మకి చెపుతుండగా వినేవాణ్ణి. అలాంటి అత్తయ్యింటికి చదువుకంటూ వెళుతున్నానని మనసు కలవరపెడుతున్నా, చేయగలిగేది లేక వేములదీవిని వదిలి నర్సాపురం బయల్దేరాను.

అనుకున్నట్టుగానే అత్తయ్యకు నేనక్కడికి రావడం ఎంతమాత్రం నచ్చలేదు. మారాజు బ్రతుకని కాకపోయినా, మా వేములదీవిలో గంజి తాగినా ఆనందంగా ఉండేది. ఇక్కడా అదే గంజైనా గొంతు దిగేది కాదు. అక్కడ నూకల గంజైతే ఇక్కడ ఎర్రబియ్యం గంజి. అత్తయ్య కసురుకుంటూ పెట్టడమే తేడా. మావయ్యగారు మాత్రం ప్రేమగా మాట్లాడేవారు.

చదువుకోసం కోటి తిప్పలు అనుకుంటూ, కాలేజీకి వెళ్ళిరావడం మొదలుపెట్టాను.

ఇంట్లో ఆశ్రయమిచ్చినందుకు ప్రతిఫలంగా ఏదో ఒకటి నా ద్వారా పొందేతీరాలన్నది మా అత్తయ్య పట్టుదల! లతకు లెక్కలు నేర్పమని రోజూ పోరుతుండేది. ఎంత చెప్పినా లెక్కలు మాత్రం లతకు వంటపట్టేవి కాదు. అక్కడితో సుందరమ్మత్తయ్యకు నా మీద అక్కసు మరింత పెరిగింది. కాసేపు తీరుబడిగా కనిపిస్తే ఓర్చేది కాదు. ఏదో ఒక పని పురమాయించి ఆనందించేది. కాలేజీకెళ్ళే రోజుల్లో మాత్రం, రోజంతా ఇంటిపట్టున ఉండకపోవడంతో కాలక్షేపమైపోయేది. కాలేజీలో సుధాకర్ స్నేహం నాకు ఎంతో ఉత్సాహాన్నిచ్చేది. అతడి స్ఫూర్తితో నా జీవితం కొత్తమలుపు తిరిగింది.

★★★

“వరన్నం తినాలనుందిరా సుధా! సరిగ్గా రెండునెలలైంది అన్నం తిని. కడుపుకి గంజితో సరిపెట్టుకోగలుగుతున్నాను కానీ, అత్తయ్య మాటలు తూటాల్లా పొడుస్తుంటే భరించలేక పోతున్నాను. కడుపుకింత అన్నం తింటే మనసుకింత ఔషధమౌతుందనిపిస్తోంది” ఆ రోజెందుకో గుండెల్ని చీల్చుకునొచ్చేసాయి నా మాటలు.

“శ్రీధర్, ఇంత బాధ పడుతున్నావని నీ స్నేహితుడ్నైన నేను, తెలుసుకోలేకపోవడవంత నాదేరా తప్పు!” బాధపడుతూ... ”ఇక నువ్వు ఆకలితో ఉండడానికి వీల్లేదు. నరసాపురంలో నివాసముండే కాలేజీ కుర్రాళ్ళు ఆకలితో ఉండడమా? రహీమ్ భాయ్ ‘ముసాఫిర్ ఖానా’ ఉన్నచోట ఆకలికి చోటులేదు” అన్నాడు సుధాకర్.

“హోటల్లో తినడానికి నా దగ్గర డబ్బే ఉంటే, ఈ తిప్పలెందుకురా? నా దగ్గర ఐదు రూపాయలు మాత్రమే ఉన్నాయి. దాంతో ఏమొస్తుంది?” నిరాశగా అన్నాను.

“నీకు తెలియదు శ్రీధర్, ముసాఫిర్ ఖానాలో భోజనం చేయడానికి డబ్బుతో పనిలేదు. ఈవాల్టికి సమయం అయిపోయింది కానీ, ఒక్కరోజు ఓపిక పట్టు, రేపక్కడకి తీసుకెళతాను నువ్వే చూస్తావుగా...” అంటున్న సుధాకర్ మాటలు చెవినైతే పడ్డాయి కానీ మనసుని తాకలేదు. డబ్బు లేకుండా భోజనం పెట్టే భోజనశాల ఉంటుందని నిజంలో బ్రతుకుతున్న నా

మనసు ఒప్పుకోలేదు. స్నేహితుడి వాత్సల్యానికి సంతోషించానే కానీ మాటల్ని మాత్రం నమ్మలేకపోయాను. నమ్మలేదు కనుక మరునాటి కోసం పెద్దగా ఎదురు చూడనూలేదు.

“పదపద, భోజనం వేళైంది, ఇంకా ఇక్కడే ఉంటే ఎలా?” పదకొండున్నరకల్లా వచ్చి హడావుడి పెట్టాడు సుధాకర్.

రహీమ్ సాయబు దుకాణం దగ్గరకు చేరుకున్నాము. ముసాఫిర్ ఖానా ద్వారం గోనెపట్టాలాంటి తెరతో మూసి ఉంది. బయటనున్న బెంచీ మీద కూర్చోపెట్టి వెళ్ళాడు సుధాకర్.

“దరిద్రపు సంత!” గంజి ఇస్తున్నప్పుడల్లా అత్తయ్యనే మాటలే చెవుల్లో మోగుతున్నాయి. గుండెల్ని నుజ్జుచేస్తున్నాయి. నలుగురు పిల్లలకు ప్రైవేట్లు చెప్పగా వచ్చిన డబ్బు పైఖర్చులకే సరిపోతోంది. తినే వెసులుబాటు లేదుకదా అన్న ఆలోచనలు చుట్టేసాయి.

లోనుండి వస్తున్న సాంబ్రాణి సువాసనలు ఆలోచనల నుండి విడుదల కల్పించాయి. పదకొండూ యాభైకల్లా సాంబ్రాణి వేస్తే వంటైనట్టు, పన్నెండు గంటలకల్లా భోజనం ప్రారంభమవుతుందని సుధాకర్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. కొంతసేపట్లో గోనెపట్టా తెరుచుకుంది. సాంబ్రాణి వాసనతెరలు తొలగి, ఈసారి వంటల ఘుమఘుమలు నాసికా పుటలను తాకుతున్నాయి. పేగులు అరుస్తున్నాయి. ఆకలి దహించివేస్తోంది.

లోపలికి ఒక్కరైనా వెళితే వారిని అనుసరిద్దామని ఆశగా చూస్తున్నాను. ఆకలి రేపిన ఆశ అది. దేవుడు దయదలిచాడు. ఒక్కొక్కరుగా వెళ్ళడం ఆరంభించారు. భోజనానికై వేసిన బల్లలు, వాటికెదురుగా కూర్చుందుకు బెంచీలు ఉన్నాయి. అందరూ వరుసగా కూర్చుంటున్నారు. మొహమాటంగానే నేనూ ఒక బెంచీపై కూర్చున్నాను.

అరిటాకులు తెచ్చి ఒక్కొక్కరి ముందూ వేస్తున్న వ్యక్తే రహీమ్ భాయ్ కాబోలు అనుకున్నాను. ఆయన్ని చూస్తే కొంత భయం, మరికొంత గగుర్పాటు కలిగింది. మనసులోని భావన బయటపడకుండా నన్ను నేను కాపాడుకుంటూ పెదాలకు అబద్ధపు చిరునవ్వుని పులిమాను.

పొగలు కక్కుతున్న అన్నం వడ్డించారు. దానిపై చిక్కటి చేపల పులుసు. పక్కనే కోడి ఇగురు వేసారు. ఎప్పుడెప్పుడు తింటానా అని ఆరాటంగా చూస్తున్నాను. నాలుకకు నీచు తగిలి ఏళ్ళైపోయింది. చిన్నప్పుడెపుడో మా ఊళ్ళో పెదకాపు గారింట్లో అన్నసంతర్పణకి తిన్న జ్ఞాపకం. అందరూ తినడం మొదలుపెట్టారు. నేనూ ఆబగా తినేస్తున్నాను. అంత కమ్మని భోజనం... పుట్టి, బుద్ధి ఎరిగాక తినలేదనిపించింది. వారబ్బాయి కాబోలు, ఆకులో ఇంకా ఇగురుండగానే మరో గరిట వడ్డించాడు.

“చాలండీ!” అన్నాను మొహమాటంగా.

“కడుపునిండా తినయ్యా, భోజనానికి మొహమాటమేంటి!” అన్నారాయన.

‘మా అమ్మ కూడా నాకెప్పుడూ అలా పెట్టలేదేమో! నెలకోసారి కోడిగుడ్ల ఇగురు చేసినపుడు అందరి కంచాల్లో వడ్డిస్తున్నపుడు, నా కంచంలో కాస్తంత ఎక్కువ పడితే వెంటనే దాన్ని తీసేసి చెల్లాయికో తమ్ముడికో వేసి సద్దేది’ అమ్మ ప్రేమను మించిన

ప్రేమ చూసి కళ్ళు ధారలు కట్టాయి. మళ్ళీ మళ్ళీ వడ్డించగా, ఇంకొక్క ముద్ద కూడా వెళ్ళనంతగా తిన్నాను. కడుపునిండా... కాదు ఒంటినిండా తినేసాననిపించింది. జీవితంలో అంత సంతృప్తిగా భోజనం చేసింది బహుశా ఆవేళేనేమో!

తింటున్నంతసేపూ భయాన్ని మరిచానే కానీ పూర్తయ్యాక భయం మొదలయ్యింది. కడుపునిండా తినేసి ఐదు రూపాయలతో ఎలా సరిపెట్టాలా అన్న సందిగ్ధం మనసుని కలవరపెడుతోంది. 'హుండీలో వేసినా, వేయకున్నా ఎవ్వరూ ఏమీ అనరు!' అన్న సుధాకర్ మాటలు ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను.

లేచి చేతులు కడుక్కుని ఐదు రూపాయలు వేయడానికి హుండీ వద్దకు వెళ్ళాను. ఎవరైనా నన్ను గమనిస్తున్నారేమోనని చుట్టూ పరికించి చూసాను. రహీమ్ భాయ్ కానీ, వాళ్ళబ్బాయి కానీ అటు వైపే చూడట్లేదు. అసలు నావంకకే కాదు, భోజనం ముగించి వెళుతున్న వారెవరి వంకా చూడట్లేదు. హుండీలో డబ్బు వేసేసి ఇంటికి దారితీసాను.

ఆ రోజు తరువాత నరసాపురంలో ఉన్నన్నాళ్ళూ ఆకలి ఎరుగను.

★★★

చదువు పూర్తయి, ఉద్యోగం వచ్చింది. నా జీవితం గాడిన పడడంతో, ఇంటిచూరు బాగు చేయించాను. చెల్లాయి, తమ్ముడి చదువులకు ఎటువంటి ఇబ్బందీ ఎదురవ్వలేదు. పెద్దచెల్లాయి పెళ్ళికూడా జరిగిపోయింది.

రెండేళ్ళు గడిచిపోయాయి. నరసాపురంలో మావయ్యగారికి సుస్తీ చేసి కాలం చేసారన్న వార్త వచ్చింది. వెంటనే వెళ్ళాను. పన్నెండో రోజు వరకూ ఉండి కార్యక్రమాలన్నీ దగ్గరుండి జరిపించి వచ్చాను. సందర్భం కాదు కనుక ముసాఫిర్ ఖానాకు వెళ్ళలేకపోయాను.

సరిగ్గా ఆరునెలలకు అత్తయ్య రాసిన జాబు నా కంటపడింది. భర్త దూరమయ్యాక వాళ్ళ పరిస్థితి బొత్తిగా బాగోలేదని వ్రాసింది. చేసిన పాపానికి అనాథలమయ్యామనీ, రేపు పిల్ల పెళ్ళి ఎలా చేస్తానోనని తమ్ముడికి ఆందోళన వ్యక్తపరచిన ఉత్తరమది. దాన్ని నేను చదవడం అమ్మ చూసింది.

"బాబూ, నీదసలే జాలిగుండె! కృతజ్ఞత పేరిట అత్తయ్య కూతురుని మాత్రం చేసుకోవాలనుకోకు! కావాలంటే నాలుగు రూపాయలేసైనా సరే... దానికో సంబంధం చూసి చేద్దాం!" అంది అమ్మ.

ఆ ఇంటి దురదృష్టంనుండి నన్ను కాపాడాలని అమ్మ పడుతున్న తాపత్రయానికి నవ్వొచ్చింది. 'మనుషులమెంత స్వార్థపరులమో కదా!' అనిపించింది.

ఐదేళ్ళ కాలచక్రం గిర్రున తిరిగింది.

★★★

నర్సాపురం బ్రాంచికి వెళ్ళవలసిన పనుందని మేనేజరుగారు చెప్పగా, ఆనందంగా ఒప్పుకున్నాను. నర్సాపురం పేరు వింటూనే ఉత్సాహం పుట్టించేది ముసాఫిర్ ఖానా. వెంటనే బయలుదేరాను. బ్రాంచికి వెళ్ళవలసిన ముందురోజే అక్కడికి చేరుకున్నాను. ఐదేళ్ళ తరువాత చూస్తున్నాను కనుక నర్సాపురం మారినట్టనిపించింది. బడ్డీకొట్లున్న చోట పెద్ద దుకాణాలొచ్చాయి. రహదారులన్నీ వెడల్పయ్యాయి. ఊర్లో మారనిదల్లా ఒక్క ముసాఫిర్ ఖానానే!

రహీమ్ భాయ్ అమృతహస్తంతో వడ్డించే భోజనానికై ఆత్రుతగా చేరాను. నర్సాపురం వెళ్ళి ఆ భోజనం చేయకుండా తిరిగి రావడమంటే... ఏడుకొండలెక్కి వెంకన్నస్వామిని చూడకుండా తిరిగివచ్చినట్టే! ఆ చేపలపులుసు, కోడి ఇగురుని తలచుకుంటుంటే నోట్లో నీళ్ళు ఊరిపోతాయి.

భోజనానికి కూర్చున్నాను. అదే ఆప్యాయత, అదే ఆదరణా! వేడివేడి అన్నం, పులుసు, ఇగురులతో కొసరికొసరి వడ్డిస్తూ, కడుపునిండా అన్నం పెట్టాడు రహీమ్ భాయ్. ఏడాదిగా దాచుకున్న పాతిక వేలను తెచ్చాను. రహీమ్ భాయ్ చూడకుండా ఉడుతాభక్తిగా హుండీలో వేసినది నా తృప్తికే కానీ అక్కడ అమృతహస్తం ఋణం ఏనాటికీ తీర్చుకోలేను.

అక్కడ్నుండి అత్తయ్యను చూడడానికి వెళ్ళాను. పాడుబడ్డ ఇల్లు, బూజులతో, చెదలతో దరిద్రం తాండవమాడుతున్నట్టుంది. అత్తయ్య రైస్‌మిల్లులో పనిచేస్తోందని లత చెప్పింది. మనసు ద్రవించిపోయింది. మావయ్య కాలం చేసాక, వారి బ్రతుకులు తారుమారయ్యాయి.

'అన్నం పెట్టిన ఋణం తీర్చుకోవడానికి ముసాఫిర్ ఖానాకు వెళ్ళాను, మరో ఋణమూ తీర్చుకోవాలిగా!' అనుకున్నాను.

అత్తయ్య ఆశీర్వాదంతో లతను వివాహం చేసుకున్నాను. ఆశ్రయం కల్పించిన ఋణం అలా తీరింది.

'దైవం మానుష రూపేణా' అన్నట్టు మానవరూపంలో దైవంగా రహీమ్ భాయ్ అమృతహస్తం పంచిన ప్రేమ ఋణాన్ని తీర్చడం మానవమాత్రుడినైన నా తరమా!?

కాలం గతించినా జ్ఞాపకాలుగా మనసులో నిలిచిపోయిన అమృతహస్తం జీవితాంతం నా వెన్ను తడుతూనే ఉంటుంది.




# నాంది

డా. చెల్లపిల్ల సూర్యలక్ష్మి
✆ 9445184363

నాంది

***దుఃఖాన్ని పంచుకుంటే అది తగ్గిపోతుందని పెద్దలూరికే అన్నారా? ఒక్కసారి మానసిక రోగులకు సహాయపడి చూడండి. మీ జీవితంలో 'అదిలేదు, ఇదిలేదు' అనే భావనలు ఎగిరిపోతాయి. అలాగే, ఆ రోగులకి మనుషుల ఆసరా కావాలి. వాళ్ళ భయాలవల్ల వాళ్ళు అలా ప్రవర్తిస్తారు. వాళ్ళకి ధైర్యం వెంటనే రాదు. వచ్చినప్పుడు ఎంతోకొంత మామూలు మనుషులవుతారు!"***

కాలింగ్‌బెల్ మ్రోగడంతో పాటు అరుపుల్లాంటి మాటలు వినబడేసరికి దోసెలు వేసే పెనం కింద పొయ్యి ఆపేసి, గుమ్మం వైపు పరుగుతీసింది ప్రీతి. అసలే భర్త ప్రతీక్ ఆఫీసుకు బయలుదేరవలసిన సమయం! చూస్తే కింద ఫ్లాట్ ఆయన... తలుపు తీయగానే 'భౌ, భౌ'మంటూ తోడేల్లాంటి ఓ కుక్క తన పైకి ఉరికింది. దాని పాలపడకుండా ఆమె వెంటనే పక్కకు జరిగింది.

అక్కడ ఏమౌతోందో తెలుసుకునే లోపు ఆయన, ఆ మినీ తోడేలూ టేకుసోఫా కుషన్ మీద చతికిలబడ్డారు. ఆమెకు అరికాలిమంట నెత్తికెక్కుతుండగా, "మీ ఇంట్లో ఉండే ఒక బుర్రతక్కువ పనికిమాలిన కుర్రోడు, మా కుటుంబ సభ్యుడైన హిట్లర్ మీద రాయి విసిరాడు. జంతువులపై జాలి, మానవత్వం, చూపించని వీడేం మానవుడు?" అని మొరిగాడు.


ప్రీతి జవాబు చెప్పేలోపు మానస్ ఎక్కడి నుంచో ఊడిపడి, "తప్పంతా మీదే! అసలు హిట్లర్ అంటే ఒక క్రూరనియంత అని మీకు తెలియదా! అలాంటివాడి పేరు పెడతారా? చిన్నప్పుడు ఆ పాపిష్టివాడి గురించి తెలుసుకున్నప్పుడు వాణ్ణి రాయితో కొట్టాలనుకున్నాను. ఎనీహౌ, నా కోరిక మీవల్ల తీరింది" అని ఆ తోడేల్లాంటి కుక్క యొక్క యజమానితో కరచాలనం ఇచ్చాడు. ఆయన అయోమయం మొహం పెట్టి, "సర్సరే, ఇకమీదట ఎవరికీ హాని కలిగించకండి" అంటూ తన జాగిలంతో నిష్క్రమించాడు.

కాస్సేపటికి, వాక్యూమ్ క్లీనర్ చప్పుడు చెవులు గళ్ళు పడేటట్టు వినిపిస్తుండగా, ప్రీతి, "మా ఇంట్లో ఉండే ఒక 'బుర్రతక్కువ పనికిమాలిన కుర్రోడు,' మానస్‌గాడి పుణ్యమా అని ఇవ్వాళ రెండుకుక్కలు మా టేకుసోఫా మీద కూర్చొన్నాయి" అని అక్కసుతో గొణిగింది.

"దీనంతకీ కారణం నువ్వే! నాన్నా, నేనూ, హాయిగా సొంతింట్లో సంతోషంగా ఉంటుంటే, ఈ ఇరుకు ఫ్లాట్‌లోకి మమ్మల్ని

ఎందుకు తీసుకువచ్చినట్టో?" జవాబిచ్చాడు మానస్.

ప్రీతికి చిరాకు పుట్టింది. ఇది, ఇరుకు ఫ్లాటా? మూడువేల రెండొందల చదరపుటడుగుల నాలుగు బెడ్రూమ్‌ల ఇల్లు, పైగా విశాఖనగరపు శివార్లలో బోలెడన్ని ఎకరాల విస్తీర్ణంలో కట్టిన గేటెడ్ కమ్యూనిటీ... 'ఇరుకు' అంటాడా వీడు? అనుకుని మానస్‌తో తలపడబోతున్నప్పుడు, వారిద్దరి తండ్రి అయిన నరేంద్ర వచ్చి సర్దిచెప్పాడు. ప్రీతి విషయాన్ని అక్కడితో వదిలేసింది.



కానీ, మానస్ వదలకుండా ఆ రాత్రి "అక్కకి పొద్దుట నా మీద కోపమొచ్చింది. నా అన్నంలో విషం కలిపిందేమో?" అని, అనుమానం వ్యక్తం చేశాడు. అంతే... నరేంద్ర, ప్రతీక్ అతణ్ణి బుజ్జగించి, అన్నం, కాబేజీ కూరా, మిరియాల చారూ, పెరుగూ అన్నింటినీ ముందు వాళ్ళు తిని, వాళ్ళకేమీ కాలేదని నిరూపించడానికి కాస్సేపాగి, మానస్ చేత భోజనం చేయించారు.

ఇకమీదట అదే మామూలైపోతుందని వాళ్ళకప్పుడు తెలియదు పాపం! ప్రీతి మాత్రం ఒకటి నుండి పది లెక్కపెట్టడం నేర్చుకుంది, తనను తాను అదుపులో పెట్టుకోవడానికి! అసలు, తన తమ్ముడికి వచ్చిన రోగం తాలూకు లక్షణాలు మొదట్లో ప్రీతికి పూర్తిగా అర్థం కాలేదు.

మొదట్లో ఏ గొడవ జరుగుతుందో... ఆ గొడవని ఒక సింగిల్ ఎపిసోడ్‌గా మాత్రమే భావించేది. అది పరిపరి విధాలుగా బయల్పడుతుందని, ఇలాంటి చికాకులు రోజూ, ఒకదానిలా మరొకటి ఉండకుండా, వాళ్ళకెదురైనప్పుడే, తన తండ్రి మానస్‌గాడితో ఎంతో కష్టపడి ఉండుంటాడని, ఆయన బ్రతుకు చాలా దుర్భరంగా ఉండుంటుందని అర్థం చేసుకుని బాధపడింది. తమ్ముడిపై విసుక్కోకుండా ఉండాలని తీర్మానించుకుంది.

★★★

ఓ వారంరోజుల తరువాత అదే కమ్యూనిటీలో ఉండే వసంత్ అనే ఆయన వచ్చి, ప్రీతి, ప్రతీక్‌లతో 'తాను వీళ్ళ వైఫైని ఎలా హ్యాక్ చేశాడో నిరూపించమని' సవాల్ చేశాడు. భార్యాభర్తలు అవాక్కయ్యారు. మానస్ ఆ నింద మోపాడని తెలుసుకుని, క్షమాపణ చెప్పుకుంటే ఆయన వెళ్ళిపోయాడు.

ఏడాదిగా అక్కడే ఉంటున్నా అందరితో హాయిగా కలిసిమెలిసి ఉండి, స్నేహితులని పెంచుకుని, సంతోషంగా కాలం గడుపుతున్న ప్రీతి, ప్రతీక్‌లకు కష్టకాలం వచ్చినట్లే ఉంది. 'కమ్యూనిటీ ఫోన్ డైరెక్టరీ అందరికీ అందుబాటులో ఉండే చోటులో పెట్టడంవల్ల, మానస్‌గాడు వసంత్ నెంబర్ కనిపెట్టి, ఆయన మీద ఆరోపణ చేశాడు. 'ఖర్మ! ఇలాంటివి కూడా దాచుకోవాలేమో,' అనుకుంది ప్రీతి.

★★★

ఓ ఆదివారంనాడు మానస్ కార్టన్‌లను కత్తిరించి, కిటికీల మధ్య ఉండే ఖాళీస్థలంలో దూరుస్తున్నాడు. ఎందుకనడిగితే, ప్రతీక్‌తో, "బావా, మనింట్లోకి ఎవరో విషవాయువును వదులుతున్నారు.. మనం సంతోషంగా ఉన్నాం కాబట్టి!" మానస్ అన్నాడు రహస్యం చెప్తున్నట్టు.

నిర్విణ్ణుడైన ప్రతీక్, "మరి మనింట్లోకి మాత్రమే దాన్నెలా వదలగలరు?" అని గుసగుసలాడాడు.

మానస్ కళ్ళు పెద్దవిచేసి, "వాళ్ళకి ఏవో మాయమంత్రాలు తెలుస్తాయి బావా, అందుకని, ఆ గ్యాస్‌ని మన ఫ్లాట్‌లోకే వదులుతారు" అంటూ ఎయిర్ కండిషనర్ తాలూకు వెంట్‌లని కూడా మూసేసి సెల్లోటేప్ వేసేశాడు.

నీరుగారిపోయిన ప్రతీక్, "మరి, మనకి తాజాగాలి ఎక్కడినుంచి వస్తుంది?" అనడిగాడు.

ఒక వికృతమైన నవ్వు నవ్వి, మానస్ "అసలు మనదేశంలో కలుషితం కాని గాలి లేదు కదు బావా! అందుకని, మనం పీల్చే గాలి తాజాగా లేకపోయినా నో ప్రాబ్లం!" అని అలవోకగా జవాబిచ్చాడు.

ఇంత జరిగినా ప్రతీక్‌కి కోపం రాకపోవడం చూసి ప్రీతి ఆశ్చర్యపోయింది. ఆ రాత్రి, "ఏదో మానస్‌గాడు గర్ల్ ఫ్రెండ్ చనిపోయాక మానసికంగా బాధ పడుతున్నాడని, కొన్నాళ్ళు మనింట్లో ఉంటే సరిపోవచ్చని చెప్పావు. ప్రతీ, అసలు మా తమ్ముడికేమయ్యింది? రోజురోజుకీ వాడి ఆగడాలు మితిమీరిపోతున్నాయి! మీ ముగ్గురు మగాళ్ళ మధ్య ఏదో రహస్యం ఉంది. నా తమ్ముడి గురించి నా దగ్గరే మీరంతా ఏదో దాస్తున్నారు. నిజం చెప్పు" అని నిలదీసింది.

ప్రతీక్ తన మామగారు తనతో చెప్పిన విషయాలని ఆమెతో పంచుకున్నాడు.

★★★

“హంస వెళ్ళిపోయాక మానస్ కొన్నాళ్ళు యూఎస్‌లో ఉండిపోయాడు కదా! అప్పుడు ‘వీడు గుంభనంగాడు, ఆమె మరణాన్ని ఎలా తట్టుకోగలడో,’ అని అనుకున్నాం గుర్తుందా?” అడిగాడు ప్రతీక్.

ప్రీతి తలూపి, “మానస్ వీడి పేరు, మానససరోవరంలో నివసించే సరస్వతీదేవి వాహనమైన హంస ఆమె పేరు... ‘భలే కుదిరాయి’ అని అనుకున్నాం కదా! వాళ్ళ నిశ్చితార్థానికి వెళ్ళినవాళ్ళం... ఆమె రోడ్డు యాక్సిడెంట్‌లో మరణించడం చూసి తిరిగివచ్చాం!” అని చెమరుస్తున్న కళ్ళని చున్నీతో అద్దుకుంది ప్రీతి.

“మనవాడు బయటపడడు. వీసా నిబంధనల ప్రకారం మనం తిరిగి వచ్చేసాం. కానీ, వాడు, తాను పడే బాధ చెప్పుకోలేక, పంచుకునే వ్యక్తి లేక బోలెడంత అంతర్మథనానికి గురయ్యాడట! తరువాత తనకి ఉద్యోగం మీద ఆసక్తి తగ్గి, పాఠాలకు బదులు అవాకులూ, చెవాకులూ పేలడం మొదలుపెట్టాడట! మనదేశంలో లాగా అక్కడవేవీ చెల్లవుగా! ఉద్యోగం ఊడి మన ఊరు వచ్చేశాడు. ఇప్పుడనిపిస్తోంది, కనీసం మామయ్యగారినైనా వాడికి తోడుంచి రావాల్సిందని! చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం? ఇండియాకి తిరిగొచ్చాక ఒకరాత్రి మామయ్యగారిని నిద్రలేపి, ‘నీకేం ద్రోహం చేశాను నాన్నా! నిశ్చితార్థానికని వచ్చి, పెళ్ళికూతుర్ని చంపేస్తావా?’ అని మానస్ అడిగాడట. ఆయన అవాక్కయిపోతే, ‘నీ మౌనమే నువ్వు చేసిన నేరాన్ని చెప్తోంది,’ అని ఆరోపించాడట. మరి, మామయ్యగారు షాక్ అవరూ?” అన్నాడు ప్రతీక్. కారుతున్న కన్నీళ్ళని ఆపే ప్రయత్నం చేయకుండా తలూపింది ప్రీతి.

“వాడి మనసుని దైవంమీద లగ్నం చేస్తే కాస్తయినా పరిస్థితి మెరుగుపడుతుందన్న ఆశతో మామయ్యగారు వాణ్ణి దేవుడిస్తోత్రాలు చదివి, దేవుడి గురించి, ఆధ్యాత్మికత గురించి టీవీలో కార్యక్రమాలు చూడమన్నారట. రెండురోజుల్లో వాడు పూర్తిగా దేవుడి కార్యక్రమాలు చూడ్డానికే అంకితమైపోయాడట. అతనిలోని ఈ మార్పును చూసి సంతోషించే లోపలే... నాకు చెప్పడానికి నోరు రావట్లేదు” అని కళ్ళు తుడుచుకున్నాడు ప్రతీక్.

మళ్ళీ తనే, “అయినా చెప్తాను విను. వాడు దేవుడి గురించి ధ్యానం చేసే బదులు, ఆ ఛానెళ్ళలో వచ్చే ప్రకటనలు చూసి ఏవో మంత్రాలూ–యంత్రాలూ అని మొదలెట్టాడట. అసలు భౌతికశాస్త్రాన్ని అధ్యయనం చేసినవాడు హేతుబద్ధమైన ఆలోచనలు వదిలేసి, ఇలా వామాచారాన్ని పట్టుకున్నాడు చూడు! ఎవరికైనా ఇలాంటి ఆలోచనలు వస్తాయా, అసలు? మరి, దేవుడిలీలలు ఏమని చెప్పాలి? ఇంట్లో సామాన్లన్నిటికీ కాటుక పెట్టడం, ఇంటి నలుమూలలా ఉప్పు పెట్టడం, బీజాక్షరాలను ఉచ్చరించే పాటలు పెట్టడం... ఇవన్నీ వింటుంటే భయంవేయడం లేదూ?” అడిగాడు ప్రతీక్.

నిర్విణ్ణురాలై నోరు వెళ్ళబెట్టింది ప్రీతి.

“వాటిల్లో కొన్ని ‘దారుణంగా శత్రువులను నాశనం చేయడానికి’ ఉద్దేశింపబడ్డాయట! చూడు మరి మనవాడి దిగజారుడు! ఇంకా తెలుసా, ఒకరోజు పొద్దున్నే, ఈ దిష్టి తీసే కార్యక్రమాన్ని బ్రహ్మముహూర్తంలో మొదలుపెట్టాడట మానస్. అగరువత్తులను ఒక కాగితం మీద పెట్టి, దాని పక్కనే ఒక కార్టన్ ముక్క అడ్డం పెట్టాడట. ‘ఎందుకు?’ అని అడగొద్దు! అగరువత్తుల దెబ్బకు కాగితం అంటుకుని, కార్టన్ ముక్క కాలుతూ ఉండగా మామయ్యగారికి మెలకువ వచ్చిందట! మానస్ మీద ఆయన అరిస్తే, ‘నువ్వే కదా మొద్దునిద్ర పోతున్నావు, నీకు తగిన శాస్తే జరిగింది’ అని ఆయనను వెక్కిరించాడట కూడాను!” అని చెప్పుకొచ్చాడు ప్రతీక్.

“ఇప్పుడు అర్థమయ్యింది. వాణ్ణీ, నాన్ననీ గాలి మార్పు కోసం ఇక్కడికి తెచ్చావు. థాంక్‌యూ... కానీ, వాడి అక్కనైన నా దగ్గర విషయాలు దాచడం ఏమీ బాగాలేదు” అంది ప్రీతి, పెదవి విరుస్తూ.

“మామయ్యగారి పరిస్థితి అర్థం చేసుకో! కన్నకొడుకు ఇలా అయ్యాడు, నీలో ఆ పరిపక్వత ఉందో, లేదోనని ఆయన భయపడ్డారు. మనందరికీ ఇదేగా మానసికరోగులతో మొదటిసారి! అందుకే ఆయన తప్పులెన్నకు!” అని జవాబిచ్చాడు ప్రతీక్.

“ఆహాఁ, మామగారి మీద ఈగ కూడా వాలనివ్వవు, నువ్వు ఆయనకు పూర్వజన్మలో నాన్నవై ఉంటావు!” అంది ప్రీతి మురిపెంగా.

★★★

ఒక వారం రోజుల తరువాత... ఆ గేటెడ్ కమ్యూనిటీలో ఒకటే కలకలం! వాళ్ళ గ్రూప్‌లో మానస్ ఒక పోస్ట్ పెట్టాడు... ‘కొందరు అరాచకవాదులు, మన కమ్యూనిటీపై 9/11 లాంటి దాడి చేయబోతున్నారు. ఒక్క రెండు రోజులు ఇంటిపట్టున ఉండండి. నేను పోలీసులకూ, భారతీయ సైన్యం వారికీ ఈమెయిల్ ఇచ్చాను. కష్టం రెండురోజుల్లో తీరిపోతుంది’ అని!

అందరూ విషయం కనుక్కోవడానికి వీళ్ళ ఫ్లాటుకు దారితీశారు. “వేంకటేశ్వరా... రక్షించు స్వామీ! నీకొక బంగారు కిరీటం చేయిస్తాను” అని ఒకరూ, “ఇది కాస్త పాతకాలపు మొక్కులా ఉంది. అక్కడ బ్యాటరీకారు కొనిస్తామని మొక్కుకోరాదూ?” అని మరొకరూ, ఇలా ఎవరికి తోచినట్లు వాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

మెసేజ్ చూసి, విషయం తీవ్రత గ్రహించిన ప్రీతి, ప్రతీక్‌లు ఆఫీసులకు సెలవు పెట్టి, ఇంటికి బయలుదేరారు. ప్రీతి ఇంటికి వస్తున్నప్పుడు ‘మేమిద్దరం రోజంతా ఇంట్లో ఉండమని... వీణ్ణి గ్రూప్‌లోకి చేర్పిస్తే, అందరినీ ఫుట్ బాల్ ఆడేస్తున్నాడు,’ అని తిట్టుకుంటూ యాక్సిడెంట్ చేయబోయింది.

సడన్‌బ్రేక్ వేసి, బండి పక్కకు పెట్టి, ‘వీణ్ణి తిట్టుకుంటున్నందుకే ముందున్న బండిని గుద్దేయబోయాను. పాపం, తన నిశ్చితార్థం గురించి ఆలోచిస్తూ, గాలిలో తేలిపోయి, ప్రమాదంలో చిక్కుకుని, హంస అనంతవాయువుల్లో కలిసిపోయుంటుంది. నా ఆలోచనలు బాలేవు. ముందు మన బడుద్ధాయిగాడు పెట్టిన పోస్ట్ తప్పని చెప్పాలి’ అనుకుంటూ ఫోన్ తీసింది.

అప్పటికే ప్రతీక్ అదే మెసేజ్ పెట్టేసాడు తనకి. ‘నేను రావడానికి టైమ్ పడుతుంది. నువ్వు ఇంటికెళ్ళి మామయ్యగారిని, మానస్‌ని చూసుకో’ అని తెలియజేశాడు. తాను చేరేసరికి ఇంటి బయట హడావుడి. ఒక గుంపు తలుపు తెరవమని గోలచేస్తోంది.

ఆమె వాళ్ళని మాటల్లోపెట్టి, మానస్ పెట్టింది ఫేక్ మెసేజ్ అనీ, పట్టించుకోవద్దనీ బ్రతిమిలాడింది. వాళ్ళు, “మీ తమ్ముడికి ఇబ్బంది ఉంటే మీరు చూసుకోవాలి. ఇప్పుడతను పెట్టిన మెసేజ్ నిజమైతే మేమంతా ఏమైపోవాలి?” అని గద్దించారు, రకరకాల గొంతుల్లోనూ, మాటల్లోనూ. ప్రీతికి ముక్కుమీద కోపం గనుక వెంటనే, “నిజమైతే, ఇలా వాదించుకోవడానికి ఎవరమూ బ్రతికుండం కదా!” అనేసింది.

"అంటే, మాచావు కళ్ళ చూడాలని ఆశపడుతున్నారా?" అని వాళ్ళు వేలికేస్తే కాలికేసారు.

ఈ వితండవాదం జరుగుతుండగా పోలీసులు కూడా వచ్చేశారు... ఈ గుంపులో ఎవరో చెప్పినట్టున్నారు! వాళ్ళు విచారణ మొదలుపెట్టే లోపే, ప్రతీక్... మంచి వర్ఛస్సున్న ఒక పెద్దాయన్ని తీసుకుని వచ్చాడు.

పెద్దాయన పోలీసులతో ఏదో చెప్తే, వాళ్ళు ఒప్పుకుని, వీళ్ళని భయపడవద్దని చెప్పి, నిష్క్రమించారు. ప్రతీక్ నిదానంగా అందరినీ అక్కడ ఉండే మీటింగ్ హాల్లో పావుగంట తరువాత కలవమని కోరాడు. వాళ్ళు వినలేదు.

"మీ మానస్‌నైనా తరిమేయండి, లేకపోతే మీరైనా ఖాళీచేయండి. ఇల్లు అమ్మేయండి!" అన్నాడు సొసైటీ సెక్రెటరీ.

"ఉన్నపట్టున మేము వెళ్ళిపోలేం కదండీ. ఈలోగా ఈ పెద్దాయన ఇక్కడికి వచ్చారు. ఆయన మాటలు ఆలకించండి. ఇదే ఇక్కడి నా ఆఖరుకోరిక అనుకోండి" అని బ్రతిమిలాడాడు... ప్రీతి ఆశ్చర్యంతో చూస్తుండగా. వాళ్ళు ఒప్పుకున్నారు.

ఇంతలో ప్రతీక్, తన ఇంటి ఇంటర్నెట్‌కి జామర్ ఏర్పాటు చేసి, ప్రీతి, పెద్దాయనలను తీసుకుని అక్కడికి వెళ్ళాడు.

అందరూ వచ్చిన తరువాత, ప్రతీక్, "మీరంతా మా కుటుంబసభ్యుడి వల్ల ఇబ్బంది పడినందుకు క్షమాపణ కోరుతున్నాను. నేను చెప్పేది దయచేసి కాస్త ఓపిగ్గా వినండి" అని చేతులు జోడించి, "మనల్ని ఈ మధ్య బాగా ఇబ్బంది పెట్టిన మానస్ గురించి కొన్నివిషయాలు చెప్తాను. మా కుటుంబాలు చిన్నప్పుడు పక్కపక్క ఇళ్లలోనే ఉండేవి. అతనొక చైల్డ్ ప్రాడిజీ. జీనియస్. చిన్నప్పటి నుండీ సైన్స్ సబ్జెక్టులలో అసాధారణ ప్రతిభ చూపించాడు. అతణ్ణి మేమెవరం ఒక మామూలు మనిషిగా చూడలేదు. కాబోయే నోబెల్ బహుమతి గ్రహీత అనే అనుకునేవాళ్ళం. దానికి తగ్గట్టు, మానస్ ఐఐటి, హార్వర్డ్‌లలో చదివి, ఎమ్ఐటీలో తన ఉద్యోగం మొదలుపెట్టాడు. చేరిన రెండేళ్ళలోనే యువపరిశోధకులకు ఇచ్చే బహుమతి గెలుచుకున్నాడు. అక్కడే పుట్టి పెరిగిన ఒక తెలుగమ్మాయిని ఇష్టపడ్డాడు. నిశ్చితార్థానికి మేమంతా వెళ్ళాం. కానీ ఆ శుభకార్యానికి ముందే ఆమె రోడ్డు ప్రమాదంలో మరణించింది. అది తట్టుకోలేక అతనిలా తయారయ్యాడు. మామయ్యగారు కొన్నాళ్ళు కడుపులో పెట్టుకున్నారు. చాలా ఆగడాలని తట్టుకున్నారు. ఒకరోజు ఉండబట్టలేక నాతో చెప్పుకున్నారు" అని జేబులోంచి తెల్లరుమాలు తీసుకుని రాలబోయే కన్నీళ్ళని ఆపుకున్నాడు.

ఇంతలో ఒకరు విసుగ్గా, "మీ బామ్మర్ది ఒకప్పుడు ఏమైతే మాకెందుకండీ? ఇప్పుడందరినీ ఇబ్బంది పెడుతున్నాడు కదా! ఇంతకీ ఈయనెవరు? మీ లాయరా?" అని అడిగారు.

అప్పుడు వెంటనే ఆ పెద్దాయన లేచి, "నా పేరు డాక్టర్ మోహన్ ఐజాక్. నేనొక సైకియాట్రిస్ట్‌ని. నింహాన్స్‌లో పనిచేసి రిటైరయి, ఈ ఊళ్ళో కాలం గడుపుతున్నాను. మా అబ్బాయితో పాటు ప్రతీక్ ఐఐటీలో చదువుకున్నాడు. కొంతకాలం క్రితం మీరు దుయ్యబడుతున్న అబ్బాయిని తీసుకుని ప్రతీక్, వాళ్ళ మామగారూ వచ్చారు. ఆ అబ్బాయి ఒక స్కిజోఫ్రేనిక్. అంటే అతనికి కనిపించనివి కనిపిస్తాయి, వినిపించనివి వినిపిస్తాయి. అన్నీ ఊహాగానాలే! సాధారణంగా ఎక్కువ తెలివితేటలున్న వాళ్ళు, రిజర్వ్డ్‌గా ఉండేవాళ్ళూ ఈ రోగానికి గురౌతూంటారు. తనదాకా వస్తేగాని కష్టం తెలియదన్నట్టు, మీరిలాంటి వ్యక్తిని ఇంతవరకూ చూసుండరు. అందుకే ఇలా ప్రవర్తిస్తున్నారు" అన్నారు డాక్టర్ మోహన్.

వెంటనే ఒకావిడ, "ఎవరిజీవితాలు వాళ్ళవి. మా కష్టాలు మాకుంటే, మిగతావాళ్ళవి మేమెందుకు నెత్తిన వేసుకోవాలి?" అనడిగింది.

డాక్టర్ మోహన్ నవ్వి, "కష్టాలు పంచుకోవడం తెలియక చాలామంది మానసికవ్యాధుల పాలపడతారు. మనందరికీ మనమే ముఖ్యం. మనలో ఎవరైనా ఒత్తిడికి లోనవని వాళ్ళుంటే చెయ్యి ఎత్తండి చూద్దాం!" అన్నారు. అనుకున్నట్టే, ఒక్కచెయ్యి కూడా పైకి లేవలేదు.

"చూసారా... దుఃఖాన్ని పంచుకుంటే అది తగ్గిపోతుందని పెద్దలూరికే అన్నారా? ఒక్కసారి మానసిక రోగులకు సహాయపడి చూడండి. మీ జీవితంలో 'అదిలేదు, ఇదిలేదు' అనే భావనలు ఎగిరిపోతాయి. అలాగే, ఆ రోగులకి మనుషుల ఆసరా కావాలి. వాళ్ళ భయాలవల్ల వాళ్ళు అలాగ ప్రవర్తిస్తారు. వాళ్ళకి ధైర్యం వెంటనే రాదు. వచ్చినప్పుడు ఎంతోకొంత మామూలు మనుషులవుతారు!" అని ఒక్క నిముషం ఆగి తానే మళ్ళీ అన్నాడు.

"మరో విషయం... మామూలు రోగులు తమ పరిస్థితిని అంగీకరిస్తారు. వీళ్ళు మాత్రం భౌతికంగా బాగానే ఉంటారు గనుక తాము రోగులమని ఒప్పుకోరు. ఇప్పుడు మానస్ సంగతే చూడండి. అతనికి ఆసుపత్రిలో చికిత్స చేయాలి. మెంటల్ హాస్పిటలంటే మనలో కూరుకుపోయిన అభిప్రాయాల వల్లనేమో, వాళ్ళ నాన్నగారు ఒప్పుకోక, స్థలం మారుద్దామన్నారు. నాకు తెలుసు, కనీసం మందులు కూడా వేసుకోకపోతే ఆ అబ్బాయి ఆరోగ్యం క్షీణిస్తుందని. కానీ ఆ తండ్రి ఒప్పుకోలేదే! ఇప్పుడు వాళ్ళకి తెలిసివచ్చింది. నేనతణ్ణి ఆసుపత్రికి తీసుకుపోతాను. ప్రతీక్ వాళ్ళు ఇల్లమ్మేసి వెళ్ళిపోతారు. ఇంక మీ కమ్యూనిటీలో మానసికరోగాలు మాయమౌతాయా? ఆలోచించండి!" అని ముగించారు.

"మీ సమయానికి ధన్యవాదాలు" అని లేచాడు ప్రతీక్.

ప్రీతి, డాక్టర్‌గారు కూడా బయటికి నడవబోతుండగా, సొసైటీ సెక్రెటరీ లేచి, "ఆగండి. డాక్టర్, మీరు మా కళ్ళు తెరిపించారు. ఇప్పుడు నేను మన మెంబర్స్‌ని అడుగుతున్నాను. ప్రతీక్‌గారి కుటుంబం మన కమ్యూనిటీ వదిలిపోవాలా? ఔనంటే చేతిని ఎత్తండి!" అన్నాడు.

మౌనం రాజ్యమేలింది.

సెక్రెటరీ, "ఇప్పుడు మన కమ్యూనిటీ మానసికరోగులని ప్రేమతో చూసే కొత్త అధ్యాయానికి నాంది పలికింది," అన్నాడు సంతోషంగా. అందరూ నవ్వుతూ తలలూపారు.

*(మనదేశంలో జిల్లా మానసికారోగ్య కార్యక్రమానికి నాంది పలికిన డా. మోహన్ ఐజాక్ గారికి ఈ కథను వినమ్రతతో అంకితమిస్తున్నాను. – రచయిత్రి)*

# ఆడుతూ... పాడుతూ

కె. లక్ష్మి శైలజ
✆ 9440268953

*కోడలే చెయ్యాలి. కొడుకు చెయ్యకూడదు అనుకోవద్దమ్మా. రోజులు మారాయి. మీ ఆలోచనలు కూడా మారాలి. అందరూ పని చేసుకోవాలి. నన్ను కూడా ఒక రకంగా, పని చెప్పకుండా నువ్వు పెంచావమ్మా. అందువల్ల నాకు కొన్ని పనులు రాలేదు కూడా! అయినా ఇప్పుడు చేస్తుంటే అలవాటవుతుందిలే!"*

"రండి... రండి. ట్రైన్ బాగా ఆలస్యం అయిందిగా!" అంటూ కొడుకును, కోడలిని ఇంట్లోకి ఆహ్వానించింది, వాళ్ళకు ఎఱ్ఱనీళ్ళు దిష్టి తీసి వేస్తూ జయంతి.

పదిరోజుల క్రితం పెళ్ళయిన కీర్తి, కిరణ్‌లు టూర్ వెళ్ళి వచ్చారు. కుశల ప్రశ్నలయ్యాక కిరణ్ సూట్కేస్‌లు వాళ్ళ బెడ్‌రూమ్ లోపలికి తీసుకొని వెళ్ళాడు. కీర్తి తన చేతిలోని పండ్లకవరును అత్తగారికి ఇచ్చేసి, తన హ్యాండ్‌బ్యాగ్ తీసుకొని తానూ లోపలికి వెళ్ళింది.

వాళ్ళు టిఫిన్ తిన్న తరువాత సోఫాలో కూర్చొని, కీర్తి అత్తమామలకు టూర్ విశేషాలను చెప్తూ ఉంటే, కిరణ్ టూర్‌నుండి తెచ్చిన, తమ విడిచిన బట్టలు తెచ్చి సర్వీస్ ఏరియాలో ఉన్న వాషింగ్ మెషీన్‌లో వేసాడు. వాళ్ళ నాన్న ఒకసారి కిరణ్ వైపు చూసి, మళ్ళీ కీర్తి మాటల వైపు దృష్టి సారించాడు.

కొద్దిసేపు తరువాత వంట దగ్గర కీర్తి సహాయం చేస్తుంటే, జయంతి వంట చేసింది. కిరణ్ కూడా కూరగాయలు తరిగి పెడ్తూ, మిక్సీ వేస్తూ అక్కడే ఉన్నాడు.

'నువ్వెందుకులే కిరణ్' అని జయంతి అంటున్నా వినలేదు. భోజనాలు అయిన తరువాత నలుగురూ తిన్న ప్లేట్స్ కూడా తీశాడు. మధ్యాహ్నం విశ్రాంతిగా ఉన్నప్పుడు 'ఏమిటీ... వీడిలా చేస్తున్నాడు?' అని జయంతి అన్నప్పుడు, జగన్నాథం తల పంకించి ఊరుకున్నాడు.

ఆ రోజు ఈవెనింగ్ కిరణ్, కాఫీ కలిపి ఇచ్చినప్పుడు, జయంతి "కిరణ్, నేను కలిపి ఇస్తాలే" అంది.

"ఏమ్మా, కాఫీ బాగాలేదా?" అడిగాడు కిరణ్


"అని కాదు, నువ్వెందుకులే అని..." నసిగింది జయంతి.

నవ్వాడు కిరణ్. కీర్తి ఏమీ మాట్లాడలేదు.

సంక్రాంతి పండుగకు అత్తగారింటికి నలుగురినీ రమ్మని బలవంతపెట్టారు వియ్యపువాళ్ళు! ఆ రోజు అందరూ ట్రైన్‌లో బయలుదేరారు. ట్రైన్‌లో నలుగురికీ పేపర్‌ప్లేట్స్‌లో స్నాక్స్ సర్ది ఇచ్చింది, కీర్తి. అందరూ తినగానే కిరణ్ ఆ ప్లేట్స్ అన్నీ డస్ట్‌బిన్‌లో వేసి వచ్చాడు. ట్రైన్ దిగిన తరువాత ఒక బ్యాక్ ప్యాక్ వేసుకొని, రెండు సూట్కేస్‌లను కిరణ్ లాక్కుపోయ్యాడు. జగన్నాథం భుజానికి బ్యాక్‌ప్యాక్ వేసుకుంటే, ఆడవాళ్ళు హ్యాండ్‌బాగులతో నడిచారు. కిరణ్ అలా అన్ని పనులూ చెయ్యడం అటుంచి, అతను చేస్తుంటే కీర్తి వద్దని చెప్పకపోవడం జగన్నాధానికి కూడా వింతగానూ, కొంచెం ఇబ్బంది గానూ ఉంటోంది.

అత్తగారి ఇంట్లో కూడా ఇదే పరిస్థితే కొనసాగింది.

వాళ్ళ మామగారు అల్లుడు పనిచేస్తుంటే వద్దనడం లేదు సరి కదా, కిరణ్ పనిచేస్తుంటే, 'అలా చేయండి, ఇలా చేయండి' అని సలహాలు ఇస్తున్నాడు.



ఆ రోజు సాయంత్రం హాల్లో కూర్చున్న జయంతి దగ్గరకు జ్యూస్‌గ్లాస్ తెచ్చి ఇచ్చింది వియ్యపురాలు. ఆ గ్లాస్ తీసుకుంటూ జయంతి మంచినీళ్ళ కోసం వంటింట్లోకి వెళ్ళబోతుంటే, "ఆ... ఆ... వదినగారూ మీరుండండి, నేను తెస్తాను" అంటూ, కీర్తి వాళ్ళమ్మ అడ్డు పడబోయింది.

"ఫరవాలేదండి" అంటూ జయంతి వంటింట్లోకి వెళ్ళింది. అక్కడ కిరణ్ ద్రాక్షపండ్లతో జ్యూస్ చేస్తున్నాడు. కీర్తి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని నవ్వుతూ కిరణ్‌తో మాట్లాడుతూ ఉంది. ఆ దృశ్యం చూసిన జయంతికి కీర్తి మీద కోపం కూడా వచ్చింది.

జయంతిని చూసిన కీర్తి మౌనంగా ఉండిపోయింది. కిరణ్ మామూలుగానే పనిచేస్తున్నాడు. జయంతి కొద్దిసేపు తరువాత బాధగా జగన్నాథానికి ఆవిషయం చెప్పింది. జగన్నాథానికి కూడా కీర్తిమీద కోపం వచ్చింది. కాసేపు దాకా మౌనంగా ఉన్నాడు.

ఆ తెల్లవారి ఏమీ తోచక జగన్నాథం పక్కనే ఉన్న పార్క్‌కు వెళ్ళాడు. కాసేపు వాకింగ్ తరువాత అతని ఫ్రెండ్ వేణుగోపాల్‌కు ఫోన్ చేశాడు. మాటల మధ్యలో కిరణ్ ప్రవర్తన గురించి ప్రస్తావన వచ్చింది.

"పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు బాగున్నారా?" అని వేణుగోపాల్ అడిగాడు.

"ఏం బాగోలే! మావాడు కోడలిని కూర్చోబెట్టి మరీ సేవలు చేస్తున్నాడు. కోడలు కిమ్మనకుండా వుంది. చూడలేకపోతున్నాననుకో" అంటూ జరుగుతున్నవన్నీ చెప్పాడు.

"పోనీలే. వాడు ఇబ్బంది పడకుండా చేస్తున్నాడు కదా! మీరు కూడా చూసీచూడనట్లు ఉండండి. మా ఇంట్లో మావాడు ఒక్కపనీ చెయ్యడు. పాపం కోడలు ఒక్కతే చేసుకుంటూ ఉంటుంది. అదికూడా కష్టమే కదా? కొంచెమైనా కోడలికి సహాయం చేస్తే బాగుంటుందని మేమనుకుంటూ ఉంటాము. మరీ మీ కోడలు అసలు చేస్తున్నట్లు లేదు. సరే జరగనీ! భవిష్యత్తులో వాళ్ళే అన్యోన్యమైన జంటగా ఉంటారేమో!" అన్నాడు వేణుగోపాల్.

"ఒక్కగానొక్క కొడుకు. అల్లారుముద్దుగా పెంచుకున్నాము. వాడిలా పనిచేస్తున్నాడేమిటా అనిపిస్తోంది!" అంటూ వాపోయాడు జగన్నాథం.

"ఏం ఫరవాలేదు. వాళ్ళు సర్దుకుపోతూ ఉంటే మీరెందుకు మాట్లాడం? చెపితే కోడలికే కాదు కొడుక్కు కూడా చెడ్డవాళ్ళనిపిస్తారు. అయినా ఇద్దరూ సమానమైన ఉద్యోగాలు చేస్తూ ఉన్నప్పుడు ఆడవాళ్ళతో పాటు మగవాళ్ళు కూడా ఇంటిపని చేసుకోవడం తప్పదులే!" అన్నాడు వేణుగోపాల్.

"నిజమేలే" అంటూ నిట్టూర్చాడు జగన్నాథం.

పండుగ రోజు మధ్యాహ్నం నిద్ర పట్టక తన రూములోనుంచి బయటకు వచ్చిన జగన్నాథానికి పక్క రూమ్‌లోనుంచి వినపడ్డ వియ్యకుని మాటలు విభ్రాంతికి గురి చేశాయి.

"కిరణ్! కీర్తి మాకు ఒక్కతే అమ్మాయి. పెళ్ళికి ముందు నేను మీకు చెప్పినట్లుగా ఇంటిపనులు అలవాటు లేదు. నెమ్మదిగా అలవాటు చేసుకుంటుంది. ఇలాగే మీరు కొంచెం హెల్ప్ చెయ్యాలి. ఏమనుకోకండి! మీ అమ్మా నాన్న ఏమనుకోవడం లేదుగా?" అని వియ్యంకుడు కిరణ్‌తో చెప్తున్నాడు. అంటే పెళ్ళికి ముందే అల్లుడి దగ్గర ఇలా మాట తీసుకున్నారా?

"అలాగే మామయ్యా! నేను కీర్తికి ఇబ్బంది రాకుండా చూసుకుంటాను. అమ్మావాళ్ళు ఏమీ అనుకోరు!" అంటూ, కిరణ్ మాటలు వినబడ్డాయి.

ఆ మాటలు విని జగన్నాథం తిరిగి రూమ్‌లోనికి వచ్చాడు. 'పెళ్ళికి ముందే అల్లునితో మంతనాలాడారా?' అనుకుంటూ ఆవేశంతో కూర్చున్నాడు చాలాసేపు. తరువాత వాళ్ళతో ఎక్కువగా కలవలేకపోయాడు.

పండుగ తరువాత నలుగురూ ఇంటికి తిరిగివచ్చారు.

ఒకరోజు రాత్రి భోజనం తరువాత కీర్తి డైనింగ్‌టేబుల్ మీద పచ్చడిసీసాలు, నెయ్యి సర్ది పెడ్తూ ఉంటే జయంతి అందరికీ పల్చటి మజ్జిగ కలిపింది.

"కిరణ్ ఇదుగో మజ్జిగ" అంటూ వాళ్ళ బెడ్రూమ్ లోకి వెళ్ళిన జయంతికి, "ఆడుతూ పాడుతూ పని చేస్తుంటే అలుపూ సొలుపేమున్నదీ... ఇద్దరమొకటై చేయి కలిపితే ఎదురేమున్నదీ... మనకూ కొదవేమున్నదీ..." అని పాడుతూ బెడ్ మీద బెడ్‌షీట్, పిల్లో కవర్స్ మారుస్తున్న కిరణ్ కనిపించాడు. జయంతికి కిరణ్ అలా చెయ్యడం ఇష్టం లేకపోయింది. గ్లాస్ అక్కడ పెట్టి బయటకు వచ్చింది.

ఆ తెల్లవారి ఆదివారం! కీర్తి, కిరణ్‌లు ఇంకా లేవలేదు. జయంతి టాయిలెట్‌లో హార్పిక్ వేసి క్లీన్ చేస్తున్నప్పుడు కిరణ్ వచ్చాడు. "నువ్వు జరుగమ్మా, నేను చేస్తాను" అంటూ.

"నువ్వా? వద్దులే కిరణ్" అంది జయంతి కంగారుగా.

"ఏమ్మా. పెద్దదానివి నువ్వు చేస్తుంటే నేను చూస్తూ ఉంటానా... జరుగు..." అంటూ ఆమె చేతిలోని బ్రష్ తీసుకున్నాడు. జయంతి బ్రష్ ఇచ్చి బయటకు వచ్చింది.

ఆ రోజు ఉదయం టిఫెన్ తిని రెస్ట్ తీసుకునే సమయంలో, జయంతి సోఫాలో ఒక మూల కూర్చొని ఆలోచిస్తూ ఉంది. అప్పుడు జయంత్ వచ్చి వాళ్ళమ్మ పక్కన కూర్చున్నాడు. కీర్తి వాళ్ళ రూమ్‌లో సిస్టంలో పనిచేసుకుంటూ ఉంది.

"అమ్మా. ఏమాలోచిస్తున్నావు?" అన్నాడు జయంతితో.

జగన్నాథం అక్కడే కూర్చొని ఆఫీస్ ఫైల్స్ చూసుకుంటూ ఉన్నాడు.

"ఏం లేదులే" అంది జయంతి.

"లేదమ్మా. నువ్వు నా గురించే ఆలోచిస్తున్నావు. ఇంట్లో ఆడవాళ్ళ పనుల్లో నేను కల్పించుకుంటూ ఉన్నానని అనుకుంటూ వున్నావు. పనిలో ఆడా, మగా అనేముందమ్మా? నువ్వు పెద్దదానివయ్యావు. ఇంట్లోకి ఇంకో మనిషి... అంటే కీర్తి వచ్చింది. ఇంట్లో పని పెరుగుతుంది కదా? అందుకని నేను కొంచెం సహాయం చేస్తున్నానంతే!" అన్నాడు కిరణ్.

"నువెప్పుడూ ఇలా వంటింటి పనులూ, బాత్రూమ్ పనులూ చెయ్యలేదు కదా?" అంది జయంతి కళ్ళనీళ్లతో.

"నాకప్పుడు తెలియలేదన్నా. ఇప్పుడు చేస్తున్నాను. తప్పేముంది?" అన్నాడు కిరణ్.

ఆ మాటలకు "ఇద్దరూ కలిసి చేసుకుంటే తప్పు లేదులే గానీ, నువ్వొక్కడివే చేస్తున్నావు కదా?" జగన్నాథం కొంచెం కోపంగా అన్నాడు, వియ్యంకుని మాటలు మనసులో మెదుల్తుండగా.

"ఫర్లేదు నాన్నా! అవసరమైతే చేస్తుందిలే. కొంచెం రెస్ట్ తీసుకుంటూ ఉంటుంది" అన్నాడు కిరణ్ వాళ్ళ నాన్నతో.

మళ్ళీ "అమ్మా... నీక్కూడా నాన్న ఇలా పనిలో సహాయం చేస్తే ఇష్టమే కదా! నాన్న చెయ్యడంలేదు కాబట్టి, నువ్వు నన్ను అంటున్నావు. ఆలోచించు. మీరిద్దరూ కూడా ఇదే మీకు కూతురు ఉండి, కూతురు భర్త మీ కూతురికి ఇలా అన్ని పనులల్లో సహాయం చేస్తే మీకు సంతోషమే కదా? అవునా, కాదా... చెప్పండి?" అన్నాడు.

ఆ మాటలకు జయంతి, జగన్నాథం సాలోచనగా చూశారు కిరణ్ వైపు.

"మీరు ఇద్దరూ కలిసిమెలిసి పని చేసుకుంటే మంచిదే!" అన్నది జయంతి కూడా నెమ్మదిగా.

"కోడలే చెయ్యాలి. కొడుకు చెయ్యకూడదు అనుకోవద్దమ్మా. రోజులు మారాయి. మీ ఆలోచనలు కూడా మారాలి. అందరూ పనిచేసుకోవాలి. నన్ను కూడా ఒకరకంగా, పని చెప్పకుండా నువ్వు పెంచావమ్మా. అందువల్ల నాకు కొన్నిపనులు రాలేదు కూడా! అయినా ఇప్పుడు చేస్తుంటే అలవాటవుతుందిలే!" అన్నాడు కిరణ్.

"అంతేలే" అంది జయంతి నెమ్మదిగా.

జగన్నాథం కూడా తల పంకించాడు, 'నిజమేలే' అన్నట్లుగా. 'ఆలోచిస్తుంటే కిరణ్ చెప్పేది సమంజసమే అనిపిస్తోంది. స్నేహపూరితమైన వాతావరణంలో వాళ్ళిద్దరూ జీవిస్తుంటే, తమకెందుకు ఈ ఆరాటం? ఇదంతా కీర్తి, కిరణ్‌ను చిన్నచూపు చూస్తుందేమోనని భయమని అనిపిస్తోంది. అప్పుడు కిరణ్ గమనించుకోగలిగితే... చాల్లే అని సర్దుకుపోవడం అందరికీ సంతోషం కదా! 'ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నదీ' అని వాళ్ళనుకుంటూ వుంటే మధ్యలో మనమెందుకు వాళ్ళను ఎగతాళి చెయ్యడం?' అనుకున్నారిద్దరూ!

ఆ రోజు సాయంత్రం పక్క అపార్ట్మెంట్ నుంచి వీళ్ళ పెళ్ళికి రాని ప్రకాశం దంపతులు చిన్న బహుమతి తీసుకొని వచ్చారు. కీర్తి వచ్చిన వాళ్ళకు స్వీట్స్ ఇచ్చింది. కిరణ్ కాఫీ ఇచ్చాడు.

వాళ్ళిద్దరినీ చూసి, "చూడచక్కని ముచ్చటైన జంటగా ఉన్నారు. నూరేళ్ళు ఆనందంగా కలిసి మెలిసి జీవించండి" అని ఆశీర్వదించారు ప్రకాశం దంపతులు.

జయంతి, జగన్నాథం ఆనందంగా చూశారు.

# లాగిన్... అవుట్

**డా. లక్ష్మి రాఘవ**

✆ 9440124700

లాగిన్... అవుట్

*"నీ సంసారంలో ఇన్ని మార్పులు వచ్చినా, ఇలా అవుతోందని ఒక్కసారి కూడా ఎందుకే చెప్పలేదు? కనీసం ఒక్క సలహా కూడా అడగలేదు?" అన్నాడు.*
*గిరిజ నవ్వుతూ "నిర్ణయం జరిగినప్పుడు సలహాలు ఎందుకు? సంతృప్తి అనేది జీతం లేక ఉద్యోగ హోదాలో కాదు. అది మనం విలువైనదిగా భావించే పనిలో ఉంది అని గ్రహించాక ఏదీ ఆలోచనే చేయం అన్నయ్యా"*

ఒకటి, రెండు, మూడు.... అయిదోసారి రింగ్ మోగిన తర్వాతే అభిరామ్ కన్నెత్తి చూశాడు తలగడ పక్కకు తోసి, పక్కనే ఉన్న ఫోన్ చేతిలోకి తీసుకోగానే స్క్రీన్ మీద 'పెండింగ్ రివ్యూ' అని మెరిసే మెయిలు చూసి విసుగ్గా... "ఈ ప్రాజెక్ట్ ఎప్పటికీ అయిపోదు కదా!" అని నిద్రమత్తులోనే అనుకుంటూ లేచాడు.

గబగబా బ్లాక్ కాఫీ చేసుకుని, టేబల్ మీద ఉన్న లాప్‌టాప్‌ను తెరిచి, వర్చ్యువల్ టీమ్ కాల్‌లో చేరాడు. ఒక్కరితో మాట్లాడకుండా రెండు గంటలు వర్క్ చేస్తూ, తర్వాతే అసలు వాళ్లెవరో గుర్తుకొచ్చే రోజులు ఇవి!

అభిరామ్ జీవితం ఈమధ్య ఇలాగే కొనసాగుతోంది. ముఖ్యంగా తనలోని ఎక్స్‌ట్రా స్కిల్స్, కమిట్మెంట్... కంపెనీకి ఎదగడానికి ఉపయోగపడతాడని భావించి 'అసిస్టెంట్ ప్రోగ్రామ్ మేనేజరు'గా ప్రమోషన్ ఇచ్చారు. దీనితో తన ప్రతిభకు గుర్తింపు దొరికిందని సంతోషపడ్డాడు. కానీ ఇన్నిరోజులూ కలిసి పనిచేసిన స్నేహితులే ఈ గుర్తింపుకి ఈర్ష్య పడ్డారు. తన వెనక మాట్లాడే మాటలు వినిపిస్తున్నాయి... తనతో కలిసి ఉన్నప్పుడు వారితో ఉన్న స్పేస్ తక్కువై ఇరుకైనట్టుగా అనిపిస్తుంది. పోనీలే అనుకుంటే... పనిలో ఆలస్యం చూపిస్తూ, అభిరామ్‌కి టెన్షన్ పెడుతున్నారు. వర్క్ ఎక్కువవటంతో ప్రమోషన్ ఆనందమే మిగలకుండా పోయింది. మారుతున్న పరిస్థితులకు తలపడ్డానికి నిత్యం ఒక సంసిద్ధతను ఏర్పరుచుకోవడం కష్టంగా ఉంది. అందుకే వేరే కంపెనీలలో తన అర్హత, అనుభవానికీ తగిన అవకాశం వస్తుందేమో... కంపెనీ మారితే తను ఒక మెట్టు ఎదిగాడని అనిపిస్తుందేమో అన్న ఆలోచనలు ఒక వైపు. ఇక్కడ వస్తున్న తాత్కాలిక అవరోధం అధిగమించే ప్రయత్నం చేస్తే.... మరో వైపు ఈ ఆలోచన! అన్నీ సందేహాలే... ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు.

వెర్షన్ అప్‌డేట్లులాగా... మారే కంపెనీలు, పెరుగుతున్న పేస్కేల్, కానీ తగ్గిపోయే ఆనందం ఉండబోతుందా?

ఒక్కోసారి మధ్యరాత్రి మెలకువ వస్తే, 'నిజంగా ఎదుగుతున్నానా... లేక నన్ను నేను ఎక్కడో పోగొట్టుకుంటున్నానా?' అన్న ప్రశ్న వస్తుంది.

చిన్నప్పుడు ఫోన్, లాప్‌టాప్ లేకుండా గడిచిన రోజులు ఎంత ఆనందంగా ఉండేవి.

ఇప్పుడు?

స్క్రీన్ మీద గ్రీన్ టిక్ వస్తే కాసేపు రిలీఫ్. అంతే!



టెక్నాలజీ ప్రపంచంలో నిత్యం పరుగులు తీస్తూ కంపెనీలు మారుతూ, పదోన్నతులు పొందుతూ, జీవిత లక్ష్యం, 'మరింత పేకేజీ' అనుకోవడమేనా... అన్నది మరీ మరీ వేధిస్తోంది.

ఈ గొడవల మధ్య అమ్మ గోల 'పెళ్ళి చేసుకోరా?' అని!

మనసంతా గందరగోళంగా, గజిబిజిగా ఉంటోంది!

అలాటి సమయంలో కొంతమంది ఫ్రెండ్స్‌తో ట్రెకింగ్ ట్రిప్ వెళ్ళి, కొన్ని గంటలు గడిపినప్పుడు ఎంతో ఆనందంగా అనిపించింది. ఎందుకంటే ఆ ట్రెకింగ్ జరిగిన చోట మొబైల్ సిగ్నల్ లేదు. ఫోన్ పనిచేయదు, కనక పని తొందర లేదు... ఎవరైనా పలకరిస్తారన్నఆత్రుత లేదు... ఇలా స్వేచ్ఛ ఉంటే ఎంత బాగుందో!

ఎందుకో వెనక్కి తిరిగి చూసుకోవాలనిపిస్తోంది....

ఉద్యోగం అంత పెద్ద కంపెనీలో దొరికిందని అప్పట్లో పొంగిపోయిన రోజులు! సిటీలో మంచి ఉద్యోగం, మంచి జీతం అనేసరికి వెంటబడుతున్న సంబంధాలు... అన్నీ కళ్ళముందు కదిలాయి.

అప్పుడప్పుడూ ఊరికి వెళ్ళడం ఎంత హాయిగా ఉన్నా, ఆ సెలవుల్లోనూ కోడింగ్ లేదా వెబ్‌నార్‌లే! ఆన్లైన్ పనులతో పూర్తిగా మనసు సుఖపడదు. తనకేం కావాలి? తేల్చుకోవడం కష్టంగా ఉంది అభిరామ్‌కు! చుట్టూ ఉన్న వాళ్ళందరూ రెండేళ్లకోసారి కంపెనీ మారుతూ, లింక్డ్ఇన్‌లో 'కెరీర్ గ్రోత్'గా చూపిస్తూ, ఒక స్మార్ట్ లైఫ్, మంచి గాడ్జెట్లు, కలలు కంటున్నట్టున్నారు. తనకెందుకు ఆలోచనలు వేరుగా?

చిన్నతనం గుర్తుకు వస్తే, కష్టపడి చదివిన రోజులకంటే అమ్మ, నాన్నలతో గడిపిన రోజులు, చెల్లితో గిల్లికజ్జాలు, చదివి పైకెదగాలనే నాన్న కోరిక... ఇంజనీరింగులో సీటు... ఫీజుల కోసం నాన్నపడ్డ యాతన ఎన్ని జ్ఞాపకాలు!

వెంటనే ఎందుకో సెలవు పెట్టి అమ్మానాన్నల దగ్గరికి వెళ్లాలనిపించిది. వెంటనే అమలుచేసాడు. అనుకోకుండా వచ్చిన కొడుకుని చూసి సంబరపడిపోయారు ఇద్దరూ! ఆ రోజు సాయంకాలమే చెల్లి గిరిజను కూడా రమ్మని కబురుచేసారు.

ఇంట్లో ఆ రాత్రి గడిచిన తీరు ఎంతో నచ్చింది. అమ్మ పెళ్ళి ప్రసక్తి తెచ్చింది. ఇంకొంచెం టైమ్ కావాలని అంటే... మళ్ళీ అడిగి విసిగించలేదు. పెద్ద చదువులు లేని అమ్మ, తన అభిప్రాయానికి ఇచ్చిన విలువ మరపురాదు ఎప్పటికీ!

మరురోజే భోజనం టైముకు వచ్చిన చెల్లి, బావగారిని చూస్తే ఎంతో ఆప్యాయంగా అనిపించింది. కబుర్లతో ఆ రోజు పరిగెడుతూనే ఉంది. గిరిజ ఎంతో హాయిగా ఉన్నట్టు అనిపించింది. సాయంకాలం బావగారు గిరితో కలిసి పొలం వైపుకి వెళ్లారు.

కొంత మాటలు జరిగాక అభిరామ్ హఠాత్తుగా, "బావా, ఒక మాట అడగాలని ఉంది..." అన్నాడు.

"నీవు అడిగేదేమిటో నాకు తెలుసు..." అని నవ్విన గిరి వైపు ఆశ్చర్యంగా చూశాడు అభిరామ్.

"అందరూ నన్ను అడిగేమాటే... సిటీలో మంచి కంపెనేలో ఉద్యోగం మాని మా ఊరి దగ్గర చిన్న కంపెనీకి ఎందుకు వచ్చావు అనే కదా!" గిరి మాటకు తల ఉపాడు అభిరామ్.

"మా అన్నయ్య బెంగళూరులో మంచి ఉద్యోగం చేస్తూవున్నప్పుడు, అమెరికా ప్రాజెక్ట్ వస్తే అక్కడికి వెళ్ళాడు. నీకు తెలుసు కదా! అక్కడ మరోకంపెనీలో చేరి ఎదుగుతూ అక్కడే బాగున్నదన్న అభిప్రాయానికి వచ్చాడు. మా అమ్మానాన్నలకు

సంతోషం కలిగినా, నాకు వెంటనే నా కర్తవ్యం ఏమిటన్న ప్రశ్న వచ్చింది. నేనూ ఎక్కడో ఉద్యోగం చేస్తూ ఉండిపోతే ముసలి వయసులో అమ్మానాన్నలకు తోడు ఎవరుంటారు? అని. అప్పుడు గిరిజకు చెప్పాను... నేను దగ్గరిలో ఉద్యోగం వెతుక్కుంటానని! గిరిజ నా ఆలోచనను బలపరిచింది. వెంటనే మీ ఊరు వచ్చి అత్తయ్య, మామయ్యలకు విషయం చెప్పాను. ఎందుకంటే, నేను ఇంజనీరుగా పెద్ద కంపెనీలో ఎదుగుతానన్న ఆశతో గిరిజను నాకిచ్చినప్పుడు, వారికి ఈ మార్పు ఎలా అనిపిస్తుందో తెలియాలని...'' అంటూన్న గిరి చేయి పట్టుకున్నాడు అభిరామ్, అతని గొప్ప మనసుకు.

''నేను ఆలోచించింది ఒక్కటే అభిరామ్! నా బాధ్యత ఇదీ అని. మీ అమ్మానాన్న నన్ను అభినందించిన తీరు నేను ఎప్పటికీ మరవలేను. ఆ పైన ఆరునెలలకు ఊరికి దగ్గరగా ఉన్న చిన్నకంపెనీకి మారాను. అప్పటిదాకా మా అమ్మా నాన్నలకు చెప్పలేదు. ఈ మార్పుకి వారు మొదట అభ్యంతర పెట్టారు 'మా కోసం ఎందుకు? మేము ఎన్నిరోజులు ఉంటాం? మీ భవిష్యత్తు బాగుండాలి కదా...' అని! కానీ చేతిలో విద్య ఉన్నప్పుడు... ఎలాగైనా ఎదగవచ్చునని చెప్పాను. ఈ మార్పుకి సహకరించిన మీ చెల్లాయికి నేనెప్పుడూ ఋణపడి ఉంటాను అభిరామ్. మీ ఇద్దరినీ గొప్పగా పెంచారు!'' అన్నాడు గిరి, అభిరామ్ భుజం మీద చేయి వేసి.

అతని మాటలు అబ్బురంగా విన్నాడు అభిరామ్.

''ఇంతటి ఆలోచన ఉన్న బావగారు దొరకడం నా అదృష్టం కాదా?'' అని, ఒక అయిదు నిముషాల తరువాత

''బావా, నేనూ ఇలా ఆలోచిస్తే బాగుంటుందేమో'' అంటూ అడిగాడు.

''నీవలా అనుకోవద్దు అభీ, నేనూ గిరిజా మీ ఊరికి దగ్గరలో ఉన్నాము. మీ తల్లిదండ్రులను చూసుకుంటాము. నీవు ఇంకా ఎదగాలి, పెళ్లి చేసుకోవాలి అనే కదా వారి కోరిక?''

ఆ మాటలకు ఆలోచనలో పడ్డాడు అభిరామ్. ఇంటికి వచ్చాక గిరిజ కూడా చాలా స్పెషల్‌గా కనిపించింది. ఒంటరిగా ఉన్నప్పుడు గిరిజను పిలిచి ''నీ సంసారంలో ఇన్ని మార్పులు వచ్చినా, ఇలా అవుతోందని ఒక్కసారి కూడా ఎందుకే చెప్పలేదు? కనీసం ఒక్క సలహా కూడా అడగలేదు?'' అన్నాడు.

గిరిజ నవ్వుతూ ''నిర్ణయం జరిగినప్పుడు సలహాలు ఎందుకు? సంతృప్తి అనేది జీతం లేక ఉద్యోగ హోదాలో కాదు. అది మనం విలువైనదిగా భావించే పనిలో ఉంది అని గ్రహించాక ఏదీ ఆలోచనే చేయం అన్నయ్యా'' అంది.

ఆ రోజు రాత్రి నిద్ర పట్టలేదు అభిరామ్‌కు. తన విషయంలో మళ్ళీ మనసంతా గందరగోళంగా అనిపించింది. అతని మానసికస్థితి ఒక భావోద్వేగపు, అంతర్గత స్వరాన్ని తెలియచెబుతూ ఈ సాంకేతిక ప్రపంచంలో పరిగెత్తడం చూపుతోంది. 'వృద్ధి' అన్నదే లక్ష్యం అయితే, అది మనసుకు సరిపడే దిశలో ఉండాలి కదా.

గిరిజ అన్నట్టు 'సంతృప్తి' ఎక్కడ ఉందని తెలుసుకోవాలి. ఏమి మార్పు వచ్చినా ఏమీ కోల్పోకుండా, శాంతిగా ఉండగలిగే స్థితిలో ఉంటేనే జీవితసారమని అనుకుంటే...

తన ఆలోచనలో స్పష్టత రాగానే అతను హాయిగా నిద్రపోయాడు.

మరి రెండురోజుల్లోనే తన ఆలోచనల మార్పు తల్లిదండ్రులతో సంప్రదించాడు, కొద్దిరోజుల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్పాడు. "అభీ, నీ పెళ్ళికి ఇది అడ్డుపడుతుందేమో..." ఉద్యోగం మారితే పిల్లనిస్తారా అని తల్లి భయం.

అభి నవ్వుతూ "అమ్మా నా ఉద్యోగం, జీతం ఎంత అని కాక నా అభిప్రాయాలను గౌరవించే అమ్మాయి దొరికితేనే పెళ్లి" అన్నాడు స్థిరమైన మనసుతో....

ఈ విధంగా కూడా ఆలోచించే యువతకు అంకురం పడింది తమ కుటుంబంలోనే అని తృప్తి పడింది ఆ తల్లి!

కథామంజరి
బాల కథ

# చిన్నమ్మ ఎందుకు ఏడ్చింది?


మాచిరాజు కామేశ్వర రావు
✆ 9000080396


చిన్నమ్మ ఎందుకు ఏడ్చింది?

***"నా నీడ ఎటో పోయింది... కనబడటం లేదు! రోజూ నేను గడ్డితింటూ ఉంటే నా వెనకే ఉండేది. ఈ రోజు ఎక్కడికి వెళ్ళి పోయిందో!" అంటూ మళ్ళీ పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది చిన్నమ్మ.***
***దాని మాటలు విని జింక, ఉడుత, ఎలుక... "ఇంత చిన్నవయసులో నీకు ఎంత పెద్ద కష్టం వచ్చింది!" అన్నాయి రహస్యంగా నవ్వుకుంటూ.***

అంబాపురం అడవిలో చిట్టెమ్మ అనే కుందేలు చిన్నమ్మ అనే తన పిల్లతో ఒక బొరియలో ఉండేది.

ఒకరోజు చిట్టెమ్మ తన తల్లిని చూసి రావడానికి పక్క అడవికి వెళ్ళింది. తల్లి వెళ్ళిన చాలా సేపటికి, బొరియలోనుంచి చిన్నమ్మ బయటకి వచ్చింది. అలవాటుగా అది లేత గడ్డిపరకలు కొరుకుతూ, ఉన్నట్లుండి పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది.

అప్పుడే అటువైపు వచ్చిన జింక ఏడుస్తున్న చిన్నమ్మను చూసి "ఎందుకు ఏడుస్తున్నావు? అమ్మ కోసమా?" అని అడిగింది

లేదన్నట్లుగా తల వూపింది చిన్నమ్మ.

"దాని స్నేహితురాలు తిమ్మమ్మ కోసం అయి ఉంటుంది!" అంది చెట్టు మీద వున్న ఉడత. తిమ్మమ్మ ఒక కోతి.

"తిమ్మమ్మ కోసం కూడా కాదు!" అంది చిన్నమ్మ ఇంకా ఏడుస్తూ.

"మరి ఈ ఏడుపు ఎందుకు?" అంది అప్పుడే వచ్చిన ఎలుగు బంటి.

"నా నీడ ఎటో పోయింది... కనబడటం లేదు! రోజూ నేను గడ్డి తింటూ ఉంటే నా వెనకే ఉండేది. ఈ రోజు ఎక్కడికి వెళ్ళి పోయిందో!" అంటూ మళ్ళీ పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది చిన్నమ్మ.

దాని మాటలు విని జింక, ఉడుత, ఎలుక, "ఇంత చిన్నవయసులో నీకు ఎంత పెద్ద కష్టం వచ్చింది!" అన్నాయి రహస్యంగా నవ్వుకుంటూ.

ఈ గొడవకు నక్క, కొంగ, తాబేలు, కాకి కూడా అక్కడకు చేరుకున్నాయి. అన్నీ కలసి చిన్నమ్మని ఆట పట్టించడం మొదలు పెట్టాయి.

ఇంతలో చిన్నమ్మ నేస్తం తిమ్మమ్మ... చెరుకుగెడ తింటూ అక్కడికి రానే వచ్చింది.

అది ఏడుస్తున్న చిన్నమ్మను ఊరడించి, "పద, ఇద్దరం కలసి వెళ్ళి, నీ నీడను వెతుకుదాం!" అంది.




"నీ తెలివైన స్నేహితురాలు వచ్చింది కదా... వెళ్ళు, దానితో వెళ్ళి నీ నీడను పట్టి తెచ్చుకో!" అన్నాయి గుమిగూడిన జంతువులన్నీ పెద్దగా నవ్వుతూ .

చిన్నమ్మ, తిమ్మమ్మ కలసి సాయంత్రం దాకా అడవి అంతా వెతికాయి. ఎక్కడా చిన్నమ్మ నీడ కనబడ లేదు. చీకటి పడబోతూ ఉండగా, అవి రెండూ చెరువు గట్టు మీదకు చేరుకున్నాయి. అప్పటికి ఆకాశంలో మబ్బులు తొలగిపోవడంతో పున్నమి చంద్రుడు నిండుగా మెరిసి పోతున్నాడు.

వెన్నెల వెలుగులో తన వెనక ఉన్న నీడను చూసుకుని, "నా నీడ నాకు దొరికింది!" అంటూ ఆనందంతో గంతులు వేసింది చిన్నమ్మ.

అప్పుడు వెలుగు వున్నప్పుడు మాత్రమే నీడ ఏర్పడుతుందని చిన్నమ్మకి అర్థమయ్యేలా చెప్పింది తిమ్మమ్మ.

తరువాత "పగలంతా ముసురు పట్టి ఉండటంతో ఎండ లేక, నీ నీడ నీకు కనబడలేదు. నువ్వు ప్రత్యక్షంగా చూస్తే కానీ అర్థం చేసుకోలేవని, వెన్నెల వచ్చేవేళకు నిన్ను ఇక్కడికి తీసుకు వచ్చాను. నా స్నేహితురాలివైన నిన్ను, ఆ జంతువులు అన్నీ వేళాకోళం చేసి, అవమానిస్తున్నాయి. అందుకే నీడ వెతుకుదాం పద అంటూ నిన్ను అక్కడ నుంచి బయలుదేరదీసాను!" అంది తిమ్మమ్మ.

"నా తెలివితక్కువతనానికి ఇప్పుడు మాత్రం అవి హేళన చేయకుండా ఉంటాయా?" అంటూ బాధగా అంది చిన్నమ్మ.

తిమ్మమ్మ కాసేపు ఆలోచించి, "ఇలా చేస్తే అవి మరి మాట్లాడవు!" అంటూ ఏం చేయాలో చెప్పింది.

మర్నాడు అన్ని జంతువులు కట్టకట్టుకుని వచ్చి, చిన్నమ్మను పిలిచి, "నిన్న నీ నీడ నీకు దొరికిందా లేదా?" అని వేళాకోళంగా నవ్వుతూ అడిగాయి.

చిన్నమ్మ నుదురు బాదుకుని "అయ్యో, నిన్నటి నా దొంగ ఏడుపును మీరు నిజమనుకుని నమ్మేశారు కదూ! అది పందెంలో తిమ్మమ్మను ఓడించడానికి నేను ఆడిన నాటకం!" అంది.

"నాటకమా?" అంటూ తెల్లబోతూ అడిగాయి జంతువులు.

"అవును. మొన్న తిమ్మమ్మ అడివిలో అలా తిరిగి వస్తూ, 'కాలవ దగ్గర నెమలి అందంగా పురివిప్పి నాట్యం చేస్తోంది. ఎన్నో జంతువులు, పక్షులు గుమిగూడి చూస్తున్నాయి! మనం అలా జంతువులు మన చుట్టూ చేరేలా చేసుకోలేం కదా!' అంది. 'నేను అలా చేసి చూపిస్తా' అంటూ తిమ్మమ్మతో పందెం కాసి, దొంగ ఏడుపుతో మీరంతా నా చుట్టూ గుమిగూడేలా చేసా! నన్ను గెలిపించినందుకు మీ అందరికీ ధన్యవాదాలు!" అంది చిన్నమ్మ పెద్దగా నవ్వుతూ.

జంతువులన్నీ సిగ్గుతో తల దించుకుని తమ దారిన తాము పోయాయి.

# నియంత్రణ!

బండారు మురళీమోహన్ రావు

✆ 94409 66268

కథామంజరి బాల కథ

*తేనెటీగలు తుట్ట నుంచి ఎగిరాయి. అవి ఎలుగుబంటిని చుట్టాయి. అంతే కాకుండా ఒడ్డు నున్న కొంగను కూడా చుట్టబోయాయి. కొంగ భయంతో అక్కడి నుంచి ఎగిరిపోయింది. ఎలుగుబంటిని తేనెటీగలు కుట్టసాగాయి. కానీ, దాని బలమైన శరీరంపైన ఉన్న దట్టమైన బొచ్చు నొప్పి కలగకుండా కాపాడాయి*

అడవిలోని చెరువుకు ఎలుగుబంటి వచ్చింది. నెమ్మదిగా నీటిలోకి దిగి, ఓపిగ్గా చేపల కోసం నిరీక్షించింది. ఇంతలో ఒక పెద్ద చేప అటుగా వచ్చింది. అది ఎలుగుబంటిని చూసి పారిపోయింది. ఎలుగుబంటి పెద్ద చేపను వెంబడించింది, కానీ అది తప్పించుకొని పారిపోయింది. ఎలుగుబంటి ఓపిగ్గా నీటిలో నిలిచింది.

ఇంతలో చెరువు దగ్గరకు ఒక కొంగ వచ్చి వాలింది. అది ఒడ్డు నుంచే.. చిన్న, చిన్న చేపల్ని తన పొడవాటి వంకర ముక్కుతో పట్టి తినేస్తూ. "ఏం మామ! చెరువులోకి దిగావు.. చేపల కోసమేనా?" అంటూ అడిగింది ఎలుగుబంటిని.

"అవును అల్లుడూ! ఎంతసేపు నిల్చున్నా చేపలు దొరకటం లేదు! వచ్చిన ఒక చేప కూడా తప్పించుకు పారిపోయింది" అంది ఎలుగుబంటి.

ఇంతలో మరో పెద్ద చేప అటుగా వచ్చింది. ఎలుగుబంటి నెమ్మదిగా రెండు చేతులతో చేపను పట్టేసింది,

ఆకలితో ఉన్న ఎలుగుబంటి చేపను తినేసి, తిరిగి మరో పెద్ద చేప కోసం ఓపిగ్గా నిలుచుంది

అంతలో అటుగా వచ్చిన మరో పెద్ద చేపను ప్రయాస పడుతూ వెంబడించి పట్టుకుంది. దాన్ని కూడా పరపరా నమిలి మింగింది. ఇలా నాలుగు పెద్ద చేపలు తిన్నాక ఒడ్డుకు వచ్చింది.

"ఏంది అల్లుడూ.. రెండే చేపలు తిన్నావు! కడుపునిండా చేపలు తిను! నాలా నువ్వు లావు కావులే!★ అంటూ నవ్వింది ఎలుగుబంటి.

కొంగ మాట్లాడలేదు.

ఎలుగుబంటి చింత చెట్టు ఎక్కి పైనున్న తేనెతుట్టను కట్టెపుల్లతో కొట్టింది. తేనెటీగలు తుట్ట నుంచి ఎగిరాయి. అవి ఎలుగుబంటిని చుట్టాయి. అంతే కాకుండా ఒడ్డు నున్న కొంగను కూడా చుట్టబోయాయి. కొంగ భయంతో అక్కడి నుంచి

ఎగిరిపోయింది. ఎలుగుబంటిని తేనెటీగలు కుట్టసాగాయి. కానీ, దాని బలమైన శరీరంపైన ఉన్న దట్టమైన బొచ్చు నొప్పి కలగకుండా కాపాడాయి. కింద పడ్డ తేనెతుట్టెను చేతిలోకి తీసుకొని, తన ఇంటికి బయలుదేరింది ఎలుగుబంటి.



సాయంత్రం చెరువుకి కొంగ వచ్చింది. అప్పటికే అక్కడ ఎలుగుబంటి వచ్చి, తిరుగుతూ కనిపించింది.

“ఏంది.. ఎలుగు మామా! చేపలు దొరకలేదా.. ఏంటి? ఆత్రుతగా చెరువు చుట్టూ తిరుగుతున్నావు!” అంది కొంగ.

“అల్లుడూ! ఉదయం కడుపునిండా చేపలు తిని, పొట్ట నిండా తేనే తాగి. ఇప్పుడు అరగటానికి అటు ఇటు

నడుస్తున్నా!” అంది ఎలుగుబంటి.

దాహం తీర్చుకున్న కొంగ ”వెలుగు మామా! నువ్వు తింటానికి కష్టపడతావు, అలాగే అరిగించుకోవటానికి ప్రయాస పడతావు, నేను బతకడానికి మాత్రమే ఆహారం తింటాను! ఎందుకంటే నేను లావెక్కితే గాల్లోకి ఎగరలేము!” అంటూ అక్కడి నుంచి ఎగిరిపోయింది కొంగ.

గాల్లోకే చూస్తూ తాను కూడా కొంగలా ఆహార నియంత్రణ పాటించాలి అనుకుంది ఎలుగుబంటి

# ఆలస్యం

**శ్రీ యర్రంశెట్టి శాయి**

**విశిష్ట అతిథి కథ**

*"సౌదా నేనిక్కడ నటిస్తున్నాను. సినిమాల్లోనూ.. సినిమా బయటా కూడా నటనే! ఈ జీవితం నాకు విసుగు కలిగిస్తోంది. కాని, ఈ గ్లామర్ ప్రపంచాన్ని వదలడం కూడా కష్టమే! నేను నటన వృత్తిగా తీసుకోకుండా ఉంటే ఎంత బాగుండేదో అనిపిస్తుంది. ఆఖరుకు నీ ప్రేమ పొందడానికి కూడా నటించాల్సి వచ్చింది. మన ప్రేమ ఒక్కటే నిజం. మిగతా జీవితమంతా నటనే! అదొక్కటీ నాకు దక్కనిస్తావు కదూ.*

సౌదామిని రిక్షా దిగి, సిద్దంగా ఉంచుకున్న డబ్బు రిక్షావాడి చేతిలో పెట్టి, హడావుడిగా బస్స్టాండ్ లోకి నడిచింది. డీలక్స్ లాంజ్ వేపు చేరుకునేసరికి ఒళ్ళంతా చెమటలు పట్టేసినయ్.

అక్కడ హైద్రాబాద్ వెళ్ళే బస్ కోసం వెదికింది. మరేదో ఊరు వెళ్ళే బస్ నిలబడి ఉంది గాని, హైద్రాబాద్ బస్ కనబడలేదు. ఆమెని ఒక్కసారిగా నిరుత్సాహం ఆవరించేసింది. అయినా కొన ఊపిరితో ఉన్న ఆశతో, పక్కనే నిలబడి మాట్లాడుకుంటున్న కండక్టర్ల దగ్గరకు నడిచి, "హైద్రాబాద్ బస్ వెళ్లిపోయిందా?" అని అడిగింది ఆతృతగా.

"అయిదు నిముషాలైంది వెళ్ళిపోయి. జస్ట్ మిస్డ్!"

సౌదామినికి దుఃఖం, నవ్వూ రెండూ వచ్చినయ్.

"జస్ట్ మిస్డ్" మళ్ళీ అనుకొందామె.

ఎన్నిసార్లు వింది తనీ మాట! ఇప్పుడే కాదు.. చిన్నప్పట్నుంచీ ఈ ఆలస్యం మూలాన ఎన్ని పోగొట్టుకుంది? పరీక్షలూ, ఉద్యోగాలూ ఇంకా ఎన్నెన్నో!

నిస్పృహతో బస్స్టాండ్ లోనుంచి బయటకు నడిచిందామె. పాపం, మీరా తన కోసం ఎంతో ఎదురు చూసి ఉంటుంది. బస్స్టాండులో తను కలిస్తే, ఇక్కడ దిగి రెండురోజులు ఉంటాననీ, లేకపోతే హైద్రాబాద్ వెళ్లిపోతాననీ రాసిందామె.

మీరాని చూడాలనీ, ఆమెతో రెండు రోజులు ఆనందంగా గడపాలనీ అనుకొంది తను. అందుకే ఎంతో ఆశతో

వచ్చిందక్కడికి! బస్టాండ్‌కి చేరుకోవడం ఆలస్యం అయితే, మీరా వెళ్లిపోతుందని తనకు తెలుసు. అయినా ఆలస్యమైపోయింది. త్రోవలో సిటీబస్ ఫెయిల్ అయిపోయింది. అక్కడ్నుంచి మెయిన్రోడ్ వరకూ మైలు దూరం నడిచి, వేరే బస్‌లో మార్కెట్‌కు చేరుకొని, రిక్షాలో వచ్చేసరికి, ఈ ఆలస్యం అయిపోయింది.

'జస్ట్ మిస్డ్!' కోపం, ఉక్రోషం ఒకేసారి కలిగినయ్యామెకి. కానీ, ఎవరి మీద అలుగుతుంది తను? బస్ చెడిపోడానికి బాధ్యులెవరు? బాంకులో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పుడు, రైలు ఆరుగంటలు లేటై ఇంటర్వ్యూ టైమ్ కాస్తా దాటిపోయినప్పుడు.. అందుకు బాధ్యత ఎవరిది?


"రిక్షా కావాలమ్మా?"

"వద్దు"

ఇంతకూ తనిప్పుడేం చెయ్యాలి? తమ ఊరు వెళ్ళే సిటీబస్ సాయంత్రం నాలుగింటికి. ఈ నాలుగ్గంటలూ ఎలా గడపాలి? ఏమీ తెలీలేదామెకి. ఫుట్‌పాత్ మీద నెమ్మదిగా నడవసాగింది.

"పోనీ ఏదైనా సినిమాకెళ్తే?" ఆ ఆలోచన బాగానే అనిపించిందామెకి. కానీ, మార్నింగ్ షో అందుతుందా? టైమ్ పదకొండు దాటింది. రోడ్డు పక్కన గోడ మీద వాల్ పోస్టర్లు చూస్తూ నడవసాగిందామె.

రెండు ఇంగ్లీషు సినిమాలున్నాయి గాని, అవి పదకొండింటికే మొదలు! కొత్తగా రిలీజైన తెలుగు సినిమా కూడా పదకొండింటికే అని ఉంది. రిక్షా ఎక్కి ఆ హాల్ దగ్గరకు చేరుకుంది సౌదామిని.



బయట విపరీతమైన జనం. స్త్రీల క్యూ దగ్గర నిలుచుందామె. పన్నెండైపోయినా ఇంకా టికెట్లివ్వడం మొదలుబెట్టక పోయేసరికి, అనుమానం వచ్చి ముందున్నామెని అడిగింది.

"ఇది మాట్నీ క్యూ. మార్నింగ్ షోకి ఇంతకు ముందే అయిపోయినయ్ టికెట్లు." సౌదామినికి నవ్వొచ్చింది. మళ్ళీ ఇక్కడ కూడా ఆలస్యం.

"జస్ట్ మిస్డ్."

సినిమాహాల్లో నుంచి బయటకొచ్చిందామె. ఇప్పుడేమిటి చెయ్యడం? తను పదేళ్లపాటు మీరాతో అద్దెకున్న ఇల్లు చూడాలనిపించిందామెకి. పూర్ణానందంపేటలో ఉందది. కాని ఎందుకా ఇల్లు చూడడం? ఏవేవో పాత స్మృతులను మననం చేసుకోవడం తప్ప ఇంకేముంటుంది?

ఎటూ నిర్ణయించుకోలేక అక్కడే నిలబడిపోయిందామె.

హటాత్తుగా ఆమె కళ్ళు ఎదురుగా ఉన్న పెద్ద సినిమాబోర్డు మీద పడినయ్. శతదినోత్సవం సందర్భంగా నటీనటుల ఆగమనం! నటుల పేర్లలో వినోద్ పేరుంది. హీరో వినోద్!!

మొదటిసారిగా వినోద్ హీరోగా నటించాడట! అంటే వినోద్ ఇప్పుడీ హాల్ కు వస్తాడన్నమాట. కొద్ది క్షణాలు ఆమె మనసంతా ఆనందంతో ఊగిపోయింది. ఎంత కాలమైంది వినోద్‌ని చూసి? పదేళ్ళు పైగానే! తనూ మీరా ఉన్న ఇంటెదురుగానే గదిలో ఉండేవాడు.

ఆ సినిమాహాలు వేపు నడవసాగింది సౌదామిని.

వినోద్ కార్లో వస్తాడు కాబోలు. అతన్ని చూడడానికి బయట జనం! నవ్వొచ్చింది సౌదామినికి! అతను తనకెంతో సన్నిహితుడనీ, తను ఎదురు రానిదే ఇంట్లో నుంచి బయటకు కదిలేవాడు కాదనీ.. ఎంతమందికి తెలుసు?

అతను చెప్పే వరకూ తనకూ తెలీదు. రోజూ తను ఆఫీసుకెళ్లడానికి బయటకు వస్తుంటే, అతనూ అప్పుడే గదిలో నుంచి బయటకు వచ్చేవాడు. తను ఎదురొస్తే అతనికి ఎంతో మంచి జరుగుతుందని నమ్మకం అట!

అసలా రోజులు ఎంత సర్దాగా గడిచేవి!

మీరా స్కూల్లో టీచరుగా చేరింది. తనూ అక్కడే ఓ ఆఫీసులో టైపిస్టుగా చేరింది. మీరాతో పాటూ తనూ ఆ ఇంట్లోనే ఉండిపోయింది. ఇద్దరికీ మీరా వాళ్ళ అమ్మమ్మ వండి పెడుతూ ఉండేది.

రోజూ రాత్రి పన్నెండింటి వరకూ వినోద్ గట్టిగా డ్రామా పోర్షన్ చదువుతూ ఉండడం, తమకు వినబడుతూ ఉండేది. కొద్ది రోజులు అతను తమ వంక కన్నెత్తి చూడలేదు. ఓ రోజు సాయంత్రం తను ఆఫీసు నుండి వచ్చి టీ తాగుతూ కూర్చుంది హాల్లో. వినోద్ తలుపు దగ్గర నిలబడి "ఏమండీ" అని పిలిచాడు.

"ఏమిటి?" లేచి అతని దగ్గరగా వెళ్తూ అడిగింది తను.

"నేను డ్రామాలో కొద్దిసేపు 'స్త్రీ'గా నటించాలి. రేపు రాత్రికి డ్రామా ఉంది. మీరొక చీరా జాకెట్టూ ఇస్తే ఎంతో సాయం చేసినవారౌతారు!" అన్నాడు బతిమాలుతూ.

తనకి నవ్వు వచ్చింది. ఇతగాడు ఆడవేషం వేస్తాడా, జనం బతికినట్టే! ఎంచేతో కాదనాలనిపించలేదు. వెంటనే తన చీరొకటీ, జాకెట్టొకటీ అతనికందించింది.

"చాలా థాంక్సండీ, ఎల్లుండి మళ్ళీ మీకిచ్చేస్తాను" అంటూ అవి తీసుకొని వెళ్లిపోయాడు. మర్నాడు సాయంత్రం తనూ మీరా ఆ విషయమే తలచుకొని నవ్వుకుంటూ ఉండగా మళ్ళీ వచ్చాడతను!

"ఇవిగోండి.. ఈ రెండు పాసులూ తీసుకోండి. రాత్రి డ్రామాకి మీరు తప్పక రావాలి" అన్నాడు నవ్వుతూ.

"సరే" అన్నారు తామిద్దరూ.

ఆ డ్రామాకి వెళ్లాలని అనుకోలేదు గాని, తీరా పొద్దు గూకాక, మీరాకు వెళ్లాలనిపించింది. "సరదాగా చూసొద్దాం, ఎప్పుడో కాలేజీలో ఉండగా చూడటమేగా డ్రామాలు" అందామె.

తనకీ కొద్దిగా కుతూహలంగానే ఉంది. ఇద్దరూ నడుచుకుంటూ వెళ్లారక్కడకి! లోపల పెద్దగా రష్ లేదు. డ్రామా అప్పుడే మొదలైంది. వినోద్ హీరో! నిజంగా హీరోలానే అనిపించాడు తనకి. అక్రమాలూ, అన్యాయాలూ చేసి, ప్రజల్ని మోసగించే ఆ ఊరి ప్రెసిడెంటుకే ఎదురు తిరిగాడు వినోద్. అతని సంభాషణా, ఉచ్చారణా, నటనా తనను కదిలించివేసినై. తమ ఇంటికెదురుగా రూములో ఉండే వినోద్‌లో ఇంత గొప్ప ప్రతిభ ఉందా?

రెండో సీనులో ప్రెసిడెంటుని మోసం చేసి, అతని గుట్టు అంతా బయటకు లాగడానికి 'స్త్రీ' వేషంలో వచ్చాడు వినోద్. తనని ఆ వేషంలో చూస్తే తనకూ, మీరాకీ కూడా నవ్వాగలేదు. అతను తిప్పుకుంటూ నవ్వడం, కులుకుతూ మాట్లాడడం చూస్తూ, నవ్వనివారే లేరు. డ్రామా ముగిశాక, ఇంటికొచ్చిన తరవాత కూడా చాలాసేపు అతని గురించే మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ ఉండిపోయారిద్దరూ.

మర్నాడు సాయంత్రం తను ఆఫీసు నుండి వచ్చిన కొద్ది నిమిషాలకే అతనూ ఇంటికొచ్చాడు. "ఇవిగోండి మీ బట్టలు" అన్నాడు నవ్వుతూ.

అందుకొని "కూర్చోండి" అంది తను. కుర్చీలో కూర్చున్నాడతను.

"మీరు డ్రామాకి రాలేదనుకుంటాను?" అన్నాడతను.

"భలేవారే, ఎందుకు రాలేదు? మీ ఆడవేషం చూసి రాత్రంతా నవ్వుకుంటూనే ఉన్నాం" తిరిగి నవ్వేస్తూ అంది తను.

"థాంక్యూ. మీకూ నాటకకళ అంటే అభిమానం ఉందన్నమాట" అన్నాడతను. తనేమీ మాట్లాడలేదు.

"నాటకం చాలా బాగా వచ్చింది లెండి. నేను హీరోగా నటించడం ఇదే మొదలు. అంతా చాలా బాగా నటించానని అన్నారు. అసలు ఆ నాటకం అంత బాగా రావడానికి కారణం ఏంటనుకున్నారు?"

అతని వంక చూసింది అర్థం కానట్టు.

"మీరే! నాకొక సెంటిమెంటుంది. మీరు నవ్వినా పరవాలేదు. ఏ పని మీద బయల్దేరినా, ఇంట్లో నుంచి బయటికడుగు పెట్టేటప్పుడు నా మనసుకి నచ్చిన వారెవరైనా ఎదురొస్తేనే బయలుదేరతాను. మా ఊళ్ళో ఉన్నప్పుడూ మా అత్తయ్య ఎదురొచ్చేది. ఎటొచ్చీ ఇక్కడికొచ్చాకే కష్టమైపోయింది. నెలరోజుల క్రితం, మీరీ ఇంటికొచ్చాక నాకు మళ్ళీ మీ కోసం ఎదురుచూడడం అలవాటైపోయింది."

"మొదటిరోజు అనుకోకుండా నేను బయటికి వచ్చినప్పుడు మీరు ఆఫీసుకెళ్తూ ఎదురొచ్చేరు. ఆరోజు ఎంత లాభమైందో తెలుసా? నా బి.ఏ. రిజల్ట్స్ వచ్చినయ్. ఠకీమని పాసైపోయాను. అంతే, ఆరోజు నుండీ మీరు ఆఫీసుకి బయల్దేరేటప్పుడే, నేనూ గదిలో నుండి బయటికడుగు పెట్టడం అలవాటైపోయింది."

ఉత్సాహంగా, నిర్మలంగా మాట్లాడుతున్న అతన్ని చూస్తుంటే తమాషాగా ఉంది తనకు.

"నాకుకొంచెంనాటకాలపిచ్చిఎక్కువలెండి.అందుకేఉద్యోగందొరికేలోగానేనాటకకళఅంతుచూద్దామనుకుంటున్నాను!" అన్నాడు.

ఈలోగా మీరా స్కూలు నుంచి వచ్చేసింది.

"డ్రామాకి వచ్చినందుకు చాలా థాంక్స్ అండీ" ఆమెతో అన్నాడతను.

"మీరు చాలా బాగా ఏక్ట్ చేసారు" అంది మీరా నవ్వుతూ.

మరికాసేపు కూర్చొని అతను వెళ్లిపోయాడు. రెండు రోజుల తరవాత సాయంత్రం తన ఆఫీసుకి వచ్చాడతను. "నమస్తే" అన్నాడు రెండు చేతులూ టేబుల్ మీద ఉంచుతూ.

"నమస్తే" అంది తను ఆశ్చర్యంగా.

"మీతో చిన్న పనుండి వచ్చాను."

"ఏమిటో చెప్పండి?"

"నా సర్టిఫికేట్ ట్రూ కాపీస్ మీద, మీ ఆఫీసర్ గారి సంతకాలు కావాలి."

"కూర్చోండి, చేయించి ఇస్తాను" అంటూ బల్ల చూపించింది.

అతను కూర్చొని ఒరిజినల్ సర్టిఫికెట్లూ, ట్రూ కాపీలూ ఆమె ముందుంచాడు. అయిదైపోయాక ఆఫీసర్ గదిలోకి వెళ్ళి వాటిమీద సంతకాలు తీసుకుంది. అవి అందించగానే ఆనందపడిపోయాడతను.

"చాలా థాంక్స్ అండీ రేపే లాస్ట్ డేట్ అప్లై చెయ్యడానికి. వీటి మీద సంతకాలెలాగా అని ఆలోచిస్తుంటే, మీరు గుర్తొచ్చారు. మీకు శ్రమివ్వక తప్పలేదు."

"ఇందులో శ్రమేముందిలెండి" అంది తను నవ్వుతూ. అయిదైపోవడం చేత తనూ అతనితోపాటే బయటకు నడిచింది.

"మీకేమీ అభ్యంతరం లేకపోతే అలా హోటల్లో కాఫీ తాగి వెళ్దాం రాకూడదూ" అడిగాడతను.

ఎంచేతో, అతని కోరిక తోసిపుచ్చలేకపోయింది. ఇద్దరూ ఏసీ రూంలో కూర్చున్నారు.

"నేను వచ్చేవారం రాజమండ్రిలో జరగుతున్న నాటక పోటీలకు వెళ్తున్నాను. మా సమాజం తరఫున మంచి నాటకం తీసుకెళ్తున్నాం. సినిమా దర్శకులూ, ప్రొడ్యూసర్లూ కూడా వస్తున్నారట. బాగా చెయ్యగలిగితే సినిమాల్లో అవకాశం రావచ్చు. మీరు నాకు సహాయం చేశారంటే తప్పకుండా బెస్ట్ ఏక్టర్ అవార్డ్ కొట్టేస్తాను!" అన్నాడతను.

"నేనేం చెయ్యాలి?' అడిగింది తను.

"ఆరోజు సాయంత్రం నాలుగ్గంటలకి స్టేషన్ కెళ్ళాలి. మీరా టైములో నాకెదురావాలి."

తనకు నవ్వాగలేదు. "బాగుంది, నా ఆఫీసో?" అంది నవ్వాపి.

"ఓ గంట పర్మిషన్ పెట్టి ముందుగా వచ్చేయకూడదూ? నాకోసం. ప్లీజ్."

"సరే వస్తాను కానీ, నాకేమిటి లాభం? ఎదురావడం నా వంతూ, ప్రైజులూ, పొగడ్తలూ మీ వంతూనా?" చిలిపిగా అంది తను.

"పోనీ నాకొచ్చే బహుమతుల్లో మీకూ భాగమిస్తాను" నవ్వుతూ అన్నాడు.

రెండురకాల స్వీట్లు ఆర్డర్ చేసాడతను. "నేనిన్ని తినలేను" అందామె.

"మీకు లంచం ఇస్తున్నాను.. ఆరోజు కోసం."

నవ్వేసింది తను. ఇద్దరూ హోటల్లోనుంచి బయటకు వచ్చారు.

"మీరూ ఇంటికేనా?" అడిగింది తను.

"అవును, మీరూ నడిచే వస్తారా?"

తలూపింది. తనకు తెలియకుండానే అతని ఆకర్షణకు లోబడిపోతోంది. దారి పొడుగునా నాటకాల గురించి ఏవేవో చెప్తూనే ఉన్నాడతను. "వీలైతే మీరూ రాజమండ్రి నాటక పోటీలకు రాకూడదూ? మీరు పక్కనుంటే ప్రపంచాన్నే జయించగలననిపిస్తుంది నాకు."

"ఊహూ, నాకు కుదరదు" అంది తను కచ్చితంగా.

"పోనీలెండి మిమ్మల్ని ఇబ్బంది పెట్టను."

ఇల్లు చేరుకున్నారు.

“ఒకే, చాలా థాంక్సండీ. మీ దగ్గర ఎన్నో సహాయాలు అందుకుంటున్నాను. మరి మీ ఋణం ఎప్పటికి తీర్చుకుంటానో ఏమో?”

“తీర్చకపోతే మిమ్మల్ని వదలనులెండి” నవ్వుతూ అంది తను.

రాజమండ్రి వెళ్ళేరోజు ఉదయమే వచ్చి, మళ్ళీ గుర్తు చేసి వెళ్లాడతను. ఆ రోజు మధ్యాహ్నం సెలవు పెట్టి ఇంటికి వచ్చేసింది తను.

“ఏవండోయ్ రడీయేనా?” నాలుగ్గంటలకు అరిచాడు.

“ఆ రడీయే.” తను బయటకొచ్చింది. అతనూ అప్పుడే బయలుదేరి ఆమెకెదురుగా వచ్చాడు.

“మీరెప్పుడూ నాకిలాగే ఎదురొస్తూ ఉండాలని ఆ దేవుడ్ని కోరుకుంటున్నాను” అన్నాడతను వెళ్ళేముందు. తను సిగ్గు పడిపోయింది. అతని మాటలకర్థమేంటి? తామిద్దరూ వివాహం చేసుకోవాలనా? మనసులో తనూ అదే కోరుకుంటుంది.

వారంరోజుల తరవాత పేపర్లో వినోద్ ఫోటో చూసింది. పోటీల్లో ఉత్తమ నటుడి బహుమతి గెలుచుకున్నట్టు ప్రకటింపబడింది. ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయింది తను.

“మీరా, ఇదిగో చూసావా వినోద్ బెస్ట్ ఏక్టర్ ఎవార్డ్ కొట్టేశాడు” అంది మీరాతో.

మీరా నవ్వింది. “నువ్వే గెలిచినంత సంతోషంగా ఉందే నీకు!”

తను సిగ్గు పడిపోయింది.

మరో నాలుగురోజుల తరవాత వినోద్ వచ్చాడు. సరాసరి ఆఫీసుకే వచ్చేసాడు. “బెస్టేక్టర్ కొట్టుకొచ్చేసాను చూసారా?” అన్నాడు పెద్ద కప్పు తీసి చూపుతూ.

“నాకు ముందే తెలుసు. పేపర్లో చూసాను.”

“ఇంకా చాలా న్యూసుంది. ముందు మీకు చెప్పిగాని, మరొకరికి చెప్పకూడదనుకున్నాను” నవ్వుతూ అన్నాడతను. “ఒక ప్రొడ్యూసర్ వాళ్ళ పిక్చర్లో అప్పటికప్పుడే చిన్న వేషం ఇచ్చాడు.”

“నిజమా!” ఆశ్చర్యపోతూ అంది తను.

మీ దగ్గర అబద్ధం చెప్తానా?” చిలిపిగా అన్నాడతను.

ఆ వార్త తనకు సంతోషం, భయం రెండూ కలిగించింది.

“అయితే తమరిక మద్రాసుకి మకాం మార్చేస్తారన్న మాట!” అంది ఉత్సాహంగా.

“ప్రస్తుతానికి తప్పదు మరి...”

“మరి అక్కడ మీకెవరెదురొస్తారు?” అంతవరకూ ఉత్సాహంగా ఉన్న అతను చప్పున క్రుంగిపోయాడు.

“అవునండీ ఆ విషయం ఆలోచించనే లేదు.”

"భలేవారే మీరు, ఈరోజుల్లో కూడా ఇంకా పాత అలవాట్లూ, మూఢాచారాలూ పట్టుక్కూర్చున్నారేంటి?"

"మీకో విషయం చెప్పనా?"

"ఏమిటది?"

"మీరేమీ కోప్పడనంటే చెప్తాను."

తనకి గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్. ఏం చెప్పబోతున్నాడతను.

"పరవాలేదు చెప్పండి" అంది.

"నిజానికి నాకసలు అలా ఎదుర్రావడం మీదా శకునాల మీదా నమ్మకం లేదు. కేవలం మీతో పరిచయం కోసం, మీ మీద ఇష్టంతో, అవన్నీ కల్పించి చెప్పాను. ఇంకా చెప్పాలంటే.. మీరు.. మిమ్మల్ని.. చూసిన మరుక్షణం నుంచే ప్రేమిస్తున్నాను."

తనకి కోపం, నవ్వూ రెండూ వచ్చినయ్. "అయితే నా దగ్గర కూడ నటించారన్నమాట"

"సారీ, మీ కోసమే మీ దగ్గర నటించాల్సి వచ్చింది."

తను పెన్నుతో తెల్లకాయితం మీద, తన పేరు రాస్తూ ఉండిపోయింది.

"నన్ను వివాహం చేసుకోవడం మీకు ఇష్టమేనా?"

చిరునవ్వు నవ్వింది తను. "ఆఫీసులోనా ఈ విషయాలు" అంది నవ్వాపుకుంటూ.

"సరే తరవాత కలుసుకుంటాను" వెళ్లిపోయాడతను.

మరి కొద్దిరోజుల తరవాత అతను మద్రాసు వెళ్లిపోయాడు. తను స్టేషనుకెళ్లింది. తన చేతిని అందుకొని పెదాలతో స్పృశించాడు. "అక్కడ పరిస్తితి ఎలా ఉంటుందో తెలీదు. సినిమాల్లో సెటిలైతే మీరూ వచ్చేద్దురు గాని!"

కళ్ళలో నీళ్ళు నిండుతుండగా తలూపింది తను. రైలు వెళ్లిపోయింది. అంతే.. అతని దగ్గర నుండి ఒకటి రెండు ఉత్తరాలు వచ్చినయ్.

"సౌదా నేనిక్కడ నటిస్తున్నాను. సినిమాల్లోనూ.. సినిమా బయటా కూడా నటనే! ఈ జీవితం నాకు విసుగు కలిగిస్తోంది. కాని, ఈ గ్లామర్ ప్రపంచాన్ని వదలడం కూడా కష్టమే! నేను నటన వృత్తిగా తీసుకోకుండా ఉంటే ఎంత బాగుండేదో అనిపిస్తుంది. ఆఖరుకు నీ ప్రేమ పొందడానికి కూడా నటించాల్సి వచ్చింది. మన ప్రేమ ఒక్కటే నిజం. మిగతా జీవితమంతా నటనే! అదొక్కటీ నాకు దక్కనిస్తావు కదూ. నిన్ను త్వరలోనే కలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాను... నీ వినోద్."

దానికి తను జవాబీయలేదు.

ఆ ఉత్తరం మీరా చేతిలో పడింది. "నమ్మక నమ్మక సినిమా మనుషుల్నా నువ్వు నమ్మేది? తరవాత విచారిస్తావు జాగ్రత్త!" అంది.

ఆ తరవాత ఉత్తరాలే లేవు అతని దగ్గర నుంచి. అప్పటికి తను పనిచేస్తున్న ఉద్యోగకాలం ముగిసిపోయింది. తరవాత తన ఊరు చేరడం.. అక్కడ వివాహం నిశ్చయమైపోవడం.. పిల్లలు!

తల్లిదండ్రుల్ని ఎదిరించి, అతని దగ్గరకు వెళ్ళి అతన్ని పెళ్లాడే ధైర్యం తనకు లేకపోయింది. పైగా అతని మీద నమ్మకం తగ్గిపోయింది. బహుశా అది అతని సినిమా జీవితం కలగజేసిన అభిప్రాయం కావచ్చు.

సినిమాహాలు ఎదుట జనం కిక్కిరిసిపోయి ఉన్నారు. పోలీసుల విజిల్స్... తోపులాటలూ! అయితే, చివరికి వినోద్ సాధించేడన్న మాట!

స్త్రీల వేపు నడిచి, అక్కడ కొంచెం వెనకగా ఉన్న అరుగు మీద నిలబడింది సౌదామిని. మరికొద్ది సేపటికి లాఠీలు గాలిలోకి లేచినయ్. పోలీస్ విజిల్స్.. సినిమాహాల్లో నుంచి బయటకొస్తున్న కారు మీద విరుచుకుపడ్డారు ప్రజలు.

వినోద్ బేక్‌సీట్లో కూర్చొని, స్త్రీల వేపు చూస్తూ చెయ్యి ఊపుతున్నాడు నవ్వుతూ. హఠాత్తుగా అతని కళ్ళు తన కళ్ళను కలుసుకున్నాయి. అతని ముఖంలో ఆశ్చర్యం, ఆనందం, ప్రేమ! అన్నీ కలిసిపోయి ప్రతిబింబిస్తున్నాయి. అతని పెదాలు వణుకుతూ కదిలినయ్.

డోర్ తెరుచుకొని దిగడానికి ప్రయత్నించాడతను. మరుక్షణంలో సౌదామినికి అర్థమైపోయింది. తన కోసం దిగుతున్నాడతను. అతనికందితే తన జీవితమే అల్లకల్లోలమైపోతుంది.

అతని కళ్ళలో తనని చూడగానే ఉప్పొంగిన భావాలు తను తేలిగ్గా చదివింది. ఏమైనా సరే అతనికి దొరక్కూడదు. వెనక్కి తిరిగి, స్త్రీల మధ్యగా జొరబడి, తోసుకుంటూ చివరి వరకూ వెళ్లిపోయింది సౌదామిని. అక్కడ ఖాళీగా ఉన్న రిక్షా ఎక్కి "త్వరగా మార్కెట్ కి పోనీ" అంది ఖంగారుగా!

పావుగంటలో మార్కెట్ చేరుకొని, తమ ఊరు పోయే సిటీబస్ స్టాప్ దగ్గర నిలబడి, "అమ్మయ్య" అని తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది.

తను అతన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయింది. అతనిది సాధారణమైన ప్రేమ కాదు. తన కోసం ఏమైనా చేయగల ప్రేమ. కాని, ఇప్పుడది అర్థం చేసుకొని ఏం లాభం? చాలా ఆలశ్యమైపోయింది.. టూ లేట్! సిటీబస్ వచ్చి ఆగింది స్టేజ్ దగ్గర. ఎక్కి సీట్లో కూర్చుంది సౌదామిని. వేగంగా పోతోంది బస్. ఆమెకి ఇంటి దగ్గర తన కోసం ఎదురుచూసే భర్తా, పిల్లలూ గుర్తుకొచ్చారు. త్వరగా వెళ్లిపోవాలి! ఆలస్యం కాకుండా వాళ్ళని చేరుకోవాలి! తనకింకేమీ వద్దు! ఈ జీవితానికింతే చాలు!

కళ్ల వెంబడి జారిపోతున్న కన్నీటిని కర్చీఫ్‌తో తుడుచుకుందామె!

*('యువ' మాసపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక 1976 నుండి పునర్ముద్రణ)*

# దాహం

## కీ. శే. భమిడిపాటి జగన్నాథరావు

దాహం

**కథా మార్గదర్శి కథ**

*"అసలు ఈ చంద్రగ్రహాన్ని గురించిన ఇంత శాస్త్రీయ విజ్ఞానమూ.. ఇలా వెన్నెల్లో కూర్చుంటే గుర్తురాదేం!" అంది నా పసినేస్తం.*
*చటుక్కున ఛర్రుమన్నాడు తేజ. "అదే మనలోని మౌఢ్యం! విజ్ఞానాన్ని విజ్ఞానంగా చూడడం తెలియదు మనకి. ప్రతీదీ మన ధోరణిలోకి మార్చేసుకోవాలనుకోవడం తప్పు" అంటూ మొదలు పెట్టాడు.*
*వెన్నెల తెల్లబోయినట్టయి నాకు మనసు చివుక్కుమంది.*

పద్మిని నాకు చాలా బాగా తెలుసు! ఎంత బాగా అంటే.. పద్మిని గురించి పద్మినికే తెలియనంత బాగా, అంత స్పష్టంగా!

అసలు ఆమె గురించి అసలు చాలా మందికి తెలీదు.. జ్ఞానతేజ లాంటి మేధావులకు కూడా! 'జ్ఞానతేజ' పేరు కథ కోసమని నేను పెట్టింది కాదు. అసలు అతని అసలు పేరు అదే. నే చెప్పేదంతా విన్నాక కూడా మీరు అనుమానించనక్కరలేదు.

కాని పద్మిని పేరు అలా కాదు. పద్మిని గురించి తెలియని చాలా మందిలో మీరూ ఒకరు కావద్దు. అందుకే జ్ఞానతేజ దగ్గరకు వెళదాం!

★★★

'తేజోనిలయం' గేటు పక్కకు తొలగించి లోపలకి వెళ్ళాను.

సంధ్య లోంచి వెలుగు జారి, చీకటి చేరడం గుర్తించని తేజ పెరటి వాకిట్లో సంధ్యావందనంలో వున్నాడు. నేనే లైట్లు వెలిగించాను.

కాసేపటికి నిష్ఠలోంచి లేచి నన్ను పలకరింపు నవ్వుతో సత్కరించి లోపలికి వెళ్ళాడు. పట్టుపంచె లోంచి లుంగీలోకి మారి వచ్చి, అతని పుస్తకాల గదిలో కూర్చున్నాడు.

"ఏమిటోయ్ ఆ చిరునవ్వు" అన్నాడు.

నేను నవ్వుతున్నానా? నా ముఖంలో చిరునవ్వు అంత స్పష్టంగా బయటపడి పోయిందా? నిజమే! నవ్వురాదూ? ఆ పట్టుపంచ ఈ డిస్కో లుంగీ.. ఏమి కాంట్రాస్ట్!

అతనికి చెప్పి ప్రయోజనం లేదు.

ఆ కాంట్రాస్ట్‌ని యోగవాసిష్టం నుంచి కాఫ్కా దాకా కోట్ చేసి సమర్థిస్తాడు. అతని మేధాశక్తికి, వాగ్ధోరణికి అడ్డుకట్టలు లేవు. కాని నాకు ఆ మహద్గ్రంథాల మహా తాత్వికుల పట్ల గొప్ప గౌరవంతో కూడిన జాలి.. జ్ఞానతేజను చూసినప్పుడు!

చిరునవ్వుకు కారణం చెప్పలేదు..

"సరే.. ఏమిటీ మౌనం? ఎందుకీ ధ్యానం?" తేజ ప్రశ్న వింటుంటే మళ్ళా చిరునవ్వు.

లోపల నుండి 'సుందరమూర్తి' పాట గమ్మత్తుగా.. అతను అన్న మాటల్లో.. ధ్యానం అంటే అతని అర్థం వేరు. 'సినిమా పాట నీ మాట ....' అంటే కొడతాడు కూడానూ.



"ఏమీలేదు తేజా. రకరకాలుగా ఆలోచిస్తుంది నా మనసు. నా చిరునవ్వుల కారణాలు నాకే నవ్వు కలిగిస్తాయి!"

తేజా చాలా తెలివయినవాడు. "తప్పించుకో అలాగే.. అయినా నేను జ్ఞానతేజను. మా నాన్నగారు క్రాంతదర్శిత్వంతో పెట్టేరు నాకు పేరు!" అన్నాడు.

వాళ్ళ నాన్నగారి మాట వచ్చేసరికి అతని ముఖం చెప్పలేని మూఢ భక్తి భావంతో నిండిపోయింది. ఆది భక్తి భావమేనేమో! ఊరికి నేనే 'మూఢ' అని విశేషిస్తా. పోనీ నా 'పాపం' నాదే.

"దానికేం కాని తేజా. ఈ రోజు నిన్ను ఒక చోటికి తీసుకు వెళ్ళాలని వుందోయ్" అన్నాను.

"ఎక్కడకో ముందుగా చెప్పకుండా రాను" నా మాటల్లోని ప్రేమని ఏమాత్రమూ పట్టించుకోని సమాధానం.

"మైడియర్ తేజస్వీ.. నిన్ను చాలా ప్రశాంతమయిన ఇంటికి తీసుకువెళతాను!" అని ' నిన్ను ఉద్ధరించాలని నాకెందుకు ఈ ప్రయాస ' అని మనసులో అనుకున్నాను.

ఏమనుకున్నాడో... ఎలాగో ఒప్పుకున్నాడు.

★★★

"పద్మినీరమా" అని పిలిచాను తలుపు తట్టి.

ఆ మూడు గదుల గృహంలోని గృహరాణి వంటింట్లోంచి బెడ్రూమ్ దాటుకుని వచ్చినట్టుంది.. కాస్త ఆలస్యంగా తలుపు తీసింది.

తీస్తూ "ఏమిటి పిలుపులూ నువ్వూనూ" అంది చిన్నగా నవ్వుతూ.

"నీకు ఎప్పుడూ కొత్తే నా పిలుపులు. అసలు అదేనోయ్ జీవితం. నిత్య నూతనంగా ఉండాలిట. కవిత్వమూ అంతే అంటారు!"

'ఆ అమ్మాయి ఎదుట నిలబడితే ఇన్నిన్ని మాటలు ఎలా పుట్టుకొచ్చేస్తాయో నాకు!' అని చిన్న ఆశ్చర్యం.

"ఏమిటో.. అన్నీ గమత్తుగా చెప్తావు.. అన్నీను" అని నవ్వి, నా వెనుక అసహనంగా వున్న తేజాని అప్పుడే చూసింది.

అప్పుడు పరిచయం చేశాను తేజాకు ఆమెను.

అతను మేధావి అని విని, ఆమె కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పు అయి మెచ్చుకోలుతో మెరిశాయి.

"రండి.. రండి కూర్చోండి" అని ఎంతో ఆదరంగా ఆహ్వానించింది.

ఆమె సన్నటి వేళ్ళతో ఎంబ్రాయిడరీ చేసిన పూవుల కవర్లు తొడుక్కున్న పేము కుర్చీలు.

ఆ ఇంటి నున్నటి గచ్చు మీద గోడకి హాయిగా జారబడి కూచుని, ఆ పూల సౌందర్యం చూడాలని అనిపిస్తుంది నాకు ఎప్పుడూను!

జ్ఞానతేజ చాలా రిజర్వ్డ్‌గా ఇరుక్కున్నాడు ఆ కుర్చీలో. "మీ పేరు పద్మినా?" అడిగేడు.

చిన్న మొహమాటంతో "అబ్బే కాదండీ.. పద్మావతి. అంతా పద్మా అని పిలుస్తారు" అంది.

తేజ మళ్ళా సైలెంట్ అయిపోయి కళ్ళు మూసుకున్నాడు.

"మీరు చాలా విషయాల్లో చాలా తెలిసినవారు అని మా మోహనమూర్తి మీ గురించి చాలా మాట్లు చెప్పాడు. మీలాటి వారి పరిచయ భాగ్యం కలిగినందుకు నాకు చాలా ఆనందంగా వుంది" అంది.

తేజ కళ్ళు తెరిచాడు. ఆ కాంప్లిమెంటు తనకు ఇంతకు ముందే చాలా మాట్లు చాలా మంది ఇచ్చినట్టుగా బింకంగా బిగుసుకున్నాడు.

ఈ డ్రామాని ఆశ్చర్యంగా, విషాదంతో చూస్తున్నాను నేను.

"మా మోహనుడు నా బాల్య నేస్తం. అసలు బాల్యంలో జరిగిన జీవితం చాలా గాఢంగా జీవితాంతవూ మనసులో నాటుకుపోయి వుంటుంది కదండీ. నేను ఇతనితో సమానంగా గోళీలు ఆడేదాన్ని!" అంది నవ్వుతూ.

తేజ పరధ్యానంగా ఉన్నట్టున్నాడు. ఆ మాటలన్నీ విన్నాడో లేదో తెలీలేదు.

నా అంచనా తప్పు.. విన్నాడు.

"అసలు బాల్యంలో మన చేష్టల బాధ్యత మనది కాదు, మన తలిదండ్రులది! శాస్త్రం అదే చెపుతుంది. మన అన్ని బాల్య చేష్టలకీ తలిదండ్రులు బాధ్యత పడి, గమనించి ఉండాలని!"

అసలు ఇలా మాట్లాడకపోతే అతను జ్ఞానతేజ కాదు,

ఈ జ్ఞానతేజకు గాలి చల్లదనమూ, పూల సువాసన, దయ గల మనుషుల ప్రేమ.. చూపించి మనిషిని చేయాలని నాకెందుకు ఈ తాపత్రయం ?

పద్మ నవ్వి వూరుకుంది.

"ఆ గులాబీలు అంతంత పెద్దవిగా పూయడానికి కారణం తెలుసా మీకు?" అని అడిగాడు.

ఆమె నవ్వుతూ "తెలీదు" అంది.

నిజవేఁ! నాకూ తెలియదు. కాని కారణం గురించి నేనూ ఎప్పుడు ఆలోచించలేదు. అసలు ఆ గదిలోకి అడుగుపెట్టగానే పూలవనంలో ఉన్నట్టుంటుంది. గది మధ్య టీపాయి మీద సన్నటి గాజుగ్లాసులో ఎర్రగన్నేరు పూలగుత్తి. తాజావనంలోకి మనసు వెళ్ళి కూచుంటుంది. ఇంతలో ఆ మూలన వున్న బాలకృష్ణుడి చిన్న విగ్రహం తల మీద అమిరిన ముద్ద మందారంలోనూ, పాదాల చెంత వున్న పారిజాతాల్లోనూ హృదయం కలిసి పోతుంది. బుక్‌షెల్ఫ్‌లో ఫ్రేమ్‌లో బిగించిన ఫొటోలో ఉన్న రెండే రెండు పసుపుపచ్చని గులాబీలు దృష్టిని లాగేస్తాయి. కారణాలు ఎక్కడ ఆలోచిస్తాను?

తేజా చెప్పడం మొదలు పెట్టాడు. ఆ పూలు ఎక్కడెక్కడ పెరుగుతాయో, వాటికి కావలసిన నేల, వేయవలసిన ఎరువులు, ఎరువుల పాళ్ళు చాలా వివరంగా చెప్పాడు. గులాబీల జాతులు, రకాలు.. ఇన్ని పేర్లు ఇంత క్షుణ్ణంగా నోటికి ఎలా వచ్చునో.. అన్నీ చెప్పాడు.

చెప్పి చివరగా "వాటికి సంబంధించిన పుస్తకాలు రేపు పంపుతాను చదవండి" అన్నాడు.

పద్మ ఆశ్చర్యంగా వింది.

మంచి కాఫీ ఇస్తూ అంది "మావారూ పిల్లలూ కాసేపట్లో వచ్చేస్తారు"

అది విననట్టుగానే తేజా లేచి నిల్చున్నాడు.

వచ్చేశాం.

★★★

నేను విసుగు చెందలేదు.

తరుచు నేను, తేజ ఆ ఇంటికి వెళ్తూండే వాళ్ళం. తరుచు ఆమెతో గొడవ పెట్టుకునే ధోరణిలో మాట్లాడేవాడు. కాని పద్మిని నాకు తెలిసిన పద్మిని. మధ్యలోనే నవ్వేసి వాతావరణం తేలిక చేసేసేది.

"ఆదమరచి ఎప్పుడయినా.. అన్నానా?" అని చిన్న కూనిరాగంతో రాజీ కుదిర్చేసేది.

ఆ రాజీకీ, ఆ రాజీ కుదర్చడంలోని వ్యంగ్యానికి వెనుక వున్న ఆ సుతిమెత్తని హృదయం, నన్ను పూల పరిమళంలా తాకేది. తేజా కోసం నేను పద్మినిని నొప్పిస్తున్నానేమో.. అన్న చిన్న అనుమానం నాలో!

★★★

పద్మిని ఒకరోజు అడిగింది నన్ను. "ఆయన.. జ్ఞానతేజ.. నిజంగా జ్ఞానతేజుడే! ఎన్ని విషయాలు తెలుసునో! ఎంత విజ్ఞానమూ! నాకు గొప్ప గౌరవం కలుగుతుంది ఆయన్ను చూస్తే.. కాని చిట్టిగులాబీల అందం అనుభవించాలంటే అంత చదివి ఉండాలా?"

ఈ ప్రశ్నలో అమాయకత్వమే ఉందో, గడుసుదనమే ఉందో ఆమెకే తెలియాలి. నాకు ఒకటి మాత్రం తెలుసు.. ఆ రెండూ కలిసిన స్త్రీ ఆమె.

కష్టసుఖాల అస్తిత్వం స్పష్టంగా తెలుసుకునీ కూడా ప్రపంచాన్ని పసిదానిలా చూసి, పొందగలిగే మనసు ఆమెది.

"గులాబీ మొక్కలు పెంచి, పూలు కాయించి వ్యాపారం చేసుకునే వాళ్ళకి మాత్రం అవసరం ఆ విజ్ఞానం!" అన్నాను నేను.

అని నేను నవ్వలేదు.

"పోదూ! ఎప్పుడూ కొంటె మాటలే నీకు!" అని తీసి పారేసింది నవ్వుతూ.

"ఎందుకు, ఎప్పుడు పుస్తకాల్లో మునిగి తేలుతూ ఉంటారాయన.. వయసు మళ్లుతోంది కదా.. పెళ్ళి చేసుకుని ఓ ఇంటివాడయితే బావుణ్ను కదా!" అంది.

"ఈమాట అతనితో అన్నావా?" అన్నాను

"నాకు అంత చనువేదీ?" అంది.

ఒకసారి తేజా ఈ ప్రశ్నకు నా ముఖం మీద కొట్టినట్టు మరీ సమాధానం చెప్పాడు.

"మీరు అంతా 'కూపస్థ మండూకం' అంటారే.. అలా తయారయ్యారు. పెళ్ళి, సంసారం వీటితోనే వుందా జీవితం? నా ఆశయం వేరు, నా సిద్ధాంతాలు వేరు."

అతని సిద్ధాంతాలు ఆకాశంలో ఎగురుతాయి. కానీ రెక్కలు లేవు. కాళ్ళు భూమికి ఆనవు. కనీసం పద్మిని ఇంటి దగ్గర అయినా ఆనుతాయోమో నన్న నా ప్రయత్నం వ్యర్థం అయింది.

అలా అని స్పష్టంగా తెలిసింది ఎప్పుడు అంటే.. ఆ రోజు అతనూ, నేనూ వీధి వరండాలో వెన్నెలలో కూచున్నాం. తేజా ఏదో పుస్తకం చూస్తుంటే, నేనే పట్టుబట్టి లైట్ తీయించేశాను.

పద్మిని పని పూర్తి చేసుకుని రేడియో తెచ్చి మా పక్కన ఉంచి మెట్ల మీద కూచుంది.

వెన్నెల్లో కూచుని వుంటే, నాకు ఏదో 'ట్రాన్స్'లోకి వెళ్ళినట్టు ఉంటుంది. జ్ఞానం తెలిసినప్పటి నుంచి మనసుకు కలిగిన మధురానుభూతులన్నీ పరిమళంలా వచ్చి తాకుతాయి.

"అసలు ఈ చంద్రగ్రహాన్ని గురించిన ఇంత శాస్త్రీయ విజ్ఞానమూ.. ఇలా వెన్నెల్లో కూర్చుంటే గుర్తురాదేం!" అంది నా పసినేస్తం.

చటుక్కున ఛర్రుమన్నాడు తేజ. "ఆదే మనలోని మౌఢ్యం! విజ్ఞానాన్ని విజ్ఞానంగా చూడడం తెలియదు మనకి. ప్రతీదీ మన ధోరణిలోకి మార్చేసుకోవాలనుకోవడం తప్పు" అంటూ మొదలు పెట్టాడు.

వెన్నెల తెల్లబోయినట్టయి నాకు మనసు చివుక్కుమంది.

అతని ధోరణి మార్చాలనే ప్రయత్నంలోనే ఎప్పుడు వుండే నేను.. అనాలోచితంగానే రేడియో ఆన్ చేశాను.

'వేదిక లెక్కను వాదం చేసెను

హిమాలయముపై జెండా పాతెను

ఆకాశంలో షికారు చేసెను – అయినా '

అంటూ 'పింగళి'.. గాలి అంతా నిండారు.

ఆ పాటకు వ్యాఖ్యానం లాంటిది పద్మిని.

"భలే పాట వస్తోందేం" అంది నా వేపు తిరిగి.

తేజాకు కోపం వచ్చినట్టుంది.

మాట్లాడ్డం మానేశాడు. పాట మిగిలింది. విసురుగా లేచాడు.

వచ్చేస్తూ అడిగాడు, "ఆమెను నువు పద్మినీ అంటావేం?"

ఆ ప్రశ్న చాలా ఆలస్యంగా అడిగాడు అతను. మొదట్లోనే అడిగి వుంటే కారణం చెప్పి ఉందును.

ఇప్పుడు అతనికి చెప్పి ప్రయోజనం లేదు!

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, దీపావళి 1984 ప్రత్యేక సంచిక నుంచి పునర్ముద్రణ)*

కథామంజరి

తెలుగు కథ విస్తృతే
ధ్యేయంగా పనిచేస్తోంది.
ఇది లాభాపేక్ష లేని సంస్థ.
అందుకే ఇక్కడ
చందా అవసరం లేదు.
తెలుగు కథ చదవండి,
చదివించండి.
ఉచిత సంచిక కోసం
ఇక్కడ నొక్కండి.

CLICK